ప్రజలే ప్రభువులు

# జనబలం

డిసెంబర్ 2025 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



## నెల్సన్ మండేలా ప్రమాణాలకు నిలువెత్తు నిదర్శనం రామారెడ్డి జీవితం : జేపీ

- గవర్నర్ సంతకం సంస్కరణలు
- బీహార్ ఫలితాలు.. పరిశీలనాంశాలు
- రేవంత్ పాలనకు రెండేళ్లు
- మార్కెట్ పిల్లలు VS స్కూలు విద్యార్థులు





# రామారెడ్డి స్ఫూర్తితో 'ప్రజల సాధికారత' లక్ష్యాన్ని సాధిద్దాం: జేపీ



సంపన్న కుటుంబంలో పుట్టినా ఈ దేశంలో సామాన్యుల కోసం, ప్రతి పౌరుడూ ఆత్మగౌరవంతో బతికే ప్రజాస్వామ్యం కోసం అహరహం కృషి చేసిన మనీషి మామిడి రామారెడ్డి అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఘననివాళులర్పించారు. రామారెడ్డి గారు మరో పదేళ్లు బతికుంటే బాగుండేదన్న స్వార్థం ఉన్నా, ఆయన నిండైన జీవితం గడిపారన్న సంతృప్తి, నిరంతరం మనకు స్ఫూర్తినిస్తుంటారనే భావం మనల్ని ముందుకు నడిపిస్తోందన్నారు. వరంగల్‌లో రామారెడ్డి నివాళి కార్యక్రమంలో జేపీ, పలువురు లోక్ సత్తా నేతలు, సహకార రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

కొందరు మన మధ్యే బతికున్నా వారి ఉనికికి అర్థం లేదని, కొందరు మనల్ని వీడిపోయినా శాశ్వత ప్రభావం చూపుతారని జేపీ అన్నారు. మొదటి రకం జీవన్ మృతులు కాగా, రెండో రకానికి చెందిన రామారెడ్డి గారి లాంటి వారు నిరంతరం మనకు మార్గం చూపుతుంటారన్నారు. నాలుగు రంగాల్లో రామారెడ్డి దూరదృష్టి, ప్రతిభా పాటవాలు, సామర్థ్యంతో గొప్ప ప్రభావం చూపారన్నారు. మొదటిది, అధికార వికేంద్రీకరణ, స్థానిక ప్రభుత్వాల సాధికారత. రెండోది, సహకార రంగం. ఎక్కడ అవసరం ఉంటుందో అక్కడ అధికారం ఉండాలని ఆయన భావించారన్నారు. అందుకు విరుద్ధంగా మన దేశంలో అవసరం ఒకరిది, అధికారం మరొకరిది అనే రీతిలో సాగుతున్న నిష్ఫల, దుష్పరిపాలనను మార్చేందుకు సహకార సంఘాల స్వయంప్రతిపత్తితో కృషి చేశారన్నారు. ప్రజల చొరవను పెంచారన్నారు. మూడోది, సకలస్వామ్యం. భాగస్వాములందరి పాత్ర, వారి మధ్య సమన్వయం అవసరాన్ని గుర్తించి అటువంటి వ్యవస్థ కోసం నిర్మాణాత్మక కృషి చేశారన్నారు. నాలుగోది, ప్రజాస్వామ్యబద్ధ స్వేచ్ఛ. వీటి కోసం పనిచేస్తున్నందునే ఆయన లోక్ సత్తా ఉద్యమాలలో కీలకపాత్ర పోషించారన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఓటు వేయటం, రోడ్ల మీద అరవటం కాదని రామారెడ్డి గారికి స్పష్టమైన అవగాహన ఉందని జేపీ పేర్కొన్నారు. ఈ దేశంలో వేలాది మందితో తాను కలసిపనిచేశానని, కానీ వారిలో చాలా ఉన్నతస్థానాల్లో ఉన్నవారి కంటే ఎక్కువ స్పష్టత, లోతైన అవగాహన, పునాది స్థాయి నుండి క్షుణ్ణత ఆయనలో ఉన్నాయన్నారు. అంత మౌలిక స్పష్టత ఉండబట్టే.. సిద్ధాంతాల కన్నా కార్యదీక్షకు ప్రాధాన్యతనిచ్చి చాలామంది సాధించలేని విలువైన ఫలితాలను సాధించారన్నారు. రామారెడ్డి అంత స్పష్టతతో పట్టుబట్టటం వల్లే ఆంధ్రప్రదేశ్ లో 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టం - 1995 వచ్చిందన్నారు.

పాలనా సమాచార హక్కు చట్టంలో రాజకీయ పార్టీలను కూడా జవాబుదారీ చేసే ఏర్పాటు చేస్తానంటే, దానివల్ల జరిగే మంచిని కూడా పార్టీలు అడ్డుకుంటాయని, చట్టం ఆమోదం పొందటం కష్టమని రామారెడ్డి ముందు జాగ్రత్త చెప్పారన్నారు. ఆయన సలహా మేరకు పరోక్షంగా రాజకీయ పార్టీల్ని జవాబుదారీ చేసే ఏర్పాటుతో తాను ఆర్.టి.ఐని రూపొందించానని జేపీ తెలిపారు. అధికార వికేంద్రీకరణ, పౌరుల సాధికారత పట్ల రామిరెడ్డికి చాలా స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ఒక వ్యక్తిగా, మిత్రునిగా మనకు ఏం కావాలో చెప్పనవసరం లేదని.. అంత మనసెరిగి లక్ష్యసాధనలో మనకు కావలసినవి అందించటం ఆయన స్వభావమన్నారు. మన జీవితాలకు, సమాజానికి, ప్రజాస్వామ్యానికి ఆయన చూపిన మార్గాన్ని అనుసరించటమే నిజమైన నివాళి అన్నారు. ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు, నివారించదగ్గ క్లేశాల్ని తొలగించటం కోసం రామారెడ్డి సుదీర్ఘ కృషి చేశారని గద్గద స్వరంతో, సజల నయనాలతో నివాళులర్పించారు. అటువంటి వ్యక్తి ఆశయాల్ని నెరవేరుద్దామని, కచ్చితంగా నెరవేర్చగలమని.. ఇందుకు అందరూ కలిసిరావాలని జేపీ సభకు విజ్ఞప్తి చేశారు.

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ప్రజలే ప్రభువులు

డిసెంబర్ 2025

సంపుటి 27 సంచిక 12


**జనబలం చందా రుసుము వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్




*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

**కార్టూన్ కార్నర్**




హోంవర్కు కూడా ఏఐతోనే చేస్తున్నారు సార్.. ఏం చేద్దాం!!


06 బీహార్ ఫలితాలు..పరిశీలనాంశాలు

14 నెల్సన్ మండేలా ప్రమాణాలకు నిలువెత్తు నిదర్శనం రామారెడ్డి జీవితం

23 ప్రజల భాగస్వామ్యంతో అవినీతి నిర్మూలన

28 రోజుకు రూ.835 కోట్ల ఖర్చు.. ఫలితాలు ప్రశ్నార్థకం

31 2025-కొన్ని ప్రజాస్వామిక పరిణామాలు



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# భారత్ ఆర్థిక వ్యవస్థపై రుణభారం ఒత్తిళ్లు!

పెరుగుతున్న రుణభారం భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని ఒత్తిళ్లలోకి నెట్టే ప్రమాదం పొంచి ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఇటీవల హెచ్చరించింది."ఆర్టికల్ 4 కన్సల్టేషన్, స్టాఫ్ రిపోర్ట్ -ఇండియా" పేరిట **2025** నవంబరు **26**వ తేదీన విడుదల చేసిన నివేదిక భారతదేశపు ఆర్థికవ్యవస్థ పనితీరును కూలంకషంగా మదింపు వేసింది.

"భారత దేశం రుణభారంతో సతమతవుతోంది, తగిన చర్యలు తీసుకొని పక్షంలో సుస్థిర ఆర్థికగతిలో ముందంజ వేస్తున్న భారత్ మధ్యంతర ఒడిదుడుకులను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ఆ నివేదిక పేర్కొన్నది.

జిడిపిలో రుణాల నిష్పత్తి **2008** నాటికి **60** శాతం మించకుండా చూడాలని **2003** నాటి ఎఫ్.ఆర్.ఎం.బి. చట్టం నిర్దేశించింది. అన్ని చట్టాలలో ఉన్నట్లే ఇందులో కూడా మినహాయింపులు ఉండటంతో మన ప్రభుత్వాలు తరచూ గడువును పొడిగించుకుంటూ వచ్చాయి. అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక సంక్షోభాలు తలెత్తిన ప్రతిసారీ మనం రుణాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఎదురయ్యింది. ఎన్.కే.సింగ్ కమిటీ సిఫార్సు మేరకు జాతీయ ప్రభుత్వ రుణాలు **40** శాతం, రాష్ట్రాల రుణాలు **20** శాతం మించరాదని **2018**లో మరోసారి ఎఫ్.ఆర్.ఎం.బి. చట్టాన్ని సవరించుకున్నాం. కోవిడ్ సంక్షోభం తర్వాత భారత ఆర్థికవ్యవస్థ సాధారణ స్థితికి చేరుకున్నపుడు **2022-23** ఆర్థిక సంవత్సరంలో జిడిపి రుణ నిష్పత్తి **85.1** శాతంగా ఉన్నది. అందులో జాతీయ ప్రభుత్వ వాటా **57.1** శాతం, రాష్ట్రాల వాటా **28** శాతంగా ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం భారత జిడిపి, రుణ నిష్పత్తి ప్రస్తుతం **83.46** ఉన్నది. ఇది రానున్న రెండేళ్లలో నూరు శాతం మించవచ్చునని అంచనా.

రుణభారం ఒత్తిళ్లు భారత ఆర్థికవ్యవస్థను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయని ఇప్పటికే పలు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు, బహుళపక్ష సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ప్రపంచంలోనే బాగా పెరిగిపోతున్న రుణభారం ఒక నూతన సంక్షోభానికి తెర తీయవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా టారిఫ్ పెంపుదల ఒత్తిళ్ల కారణంగా డాలరుతో రూపాయి మారకం విలువ మరింతగా పతనం కావచ్చునన్న అంచనాలు కూడా ఉన్నాయి.

రెండవ త్రైమాసిక జిడిపి వృద్ధిరేటు **8.2** శాతం ఉన్నట్లు జాతీయ గణాంకాల సంస్థ ఇటీవల ప్రకటించింది. అదేరోజు డాలర్‌తో రూపాయి మారకపు విలువ **89.85** గా నమోదు అయ్యింది. సరిగ్గా అదే సమయంలో ఐ.ఎం.ఎఫ్. నివేదిక వెలువడింది. భారత ఆర్థికవ్యవస్థ నిర్వహణలో కొనసాగుతున్న సానుకూల అంశాలను నివేదిక ప్రముఖంగానే ప్రస్తావించింది. ఆర్థిక నిర్వహణలో భారత ప్రభుత్వ పనితీరును ఆ నివేదిక ఘనంగానే ప్రశంసించింది.

అయితే గణాంకాల నిర్వహణలో భారత్‌ను సి.గ్రేడ్ లో ఉంచడంతో భారత ఆర్థిక వ్యవస్థ గురించిన గణాంకాలు సందేహాస్పదం అయ్యాయి. ప్రభుత్వం ఇస్తున్న గణాంకాలు లోపాలతో కూడుకుని ఉన్నాయనీ, అందువల్ల ఆర్థికవ్యవస్థ పనితీరును మదింపు వేయడంలో పరిమితులు ఏర్పడుతున్నాయని ఐ.ఎం.ఎఫ్. పేర్కొన్నది. ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు ఈ అంశాన్ని చర్చిస్తున్నారు.

భారత్ ఇచ్చే గణాంకాలకు **2011-12**వ సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం సరికాదని ఐ.ఎం.ఎఫ్. అంటున్నది. జిడిపి సిరీస్ కూడా **2015** నాటి ప్రాతిపదికపై లెక్కించడం శాస్త్రీయం కాదని అంటున్నది.

పారిశ్రామిక , సేవల, వినిమయ రంగాల ధోరణులలో ఈ పద్నాలుగు సంవత్సరాల్లో ఎన్నో మార్పులు

చోటుచేసుకున్నాయి. వాటికి అనుగుణంగా ప్రాతిపాదికలను సవరించాల్సి ఉంది. టోకు ధరల సూచీ ప్రకారం కాకుండా ఉత్పత్తిదారుల ధరల సూచీ ప్రకారం ధోరణులను అంచనా వేయాలనే వాదన ఉంది. ఆదాయాలు, వ్యయాలు, వినిమయం లెక్కించే సమయంలో సాధారణంగా సంఘటిత రంగాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు.

కానీ భారత దేశంలో అసంఘటితరంగంలో పనిచేసే జనాభా **40** శాతం నుండి **50** శాతానికి పెరిగింది. కోవిడ్ కారణంగా **2021**లో జనగణన జరగలేదు. దాంతో శ్రామికశక్తి వినియోగం గురించిన సరైన సమాచారం భారత్ వద్ద లేదు. మన దేశంలో జాతీయ ప్రభుత్వం ఇచ్చే గణాంకాలకు, రాష్ట్రాలు ఇచ్చే గణాంకాలకూ ఎప్పుడూ పొంతన ఉండటం లేదు. ఇలాంటి కారణాల వల్లనే భారత్ ఇచ్చే గణాంకాలు లోపాలతో కూడుకుని ఉన్నాయని ఐ.ఎం.ఎఫ్. అంటున్నది.

రుణభారం పెరగడం వల్ల ఇప్పటికే కీలక రంగాల్లో ప్రభుత్వ వ్యయాలకు కోత పడుతున్నది. విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, పౌష్టికాహారం, సామాజిక.. ఆహార భద్రత, ఆహారం, పౌర పంపిణి, గ్రామీణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, సంస్కృతి, షెడ్యూలు తెగలు, మైనారిటీ వ్యవహారాలు వంటి సామాజిక రంగ కేటాయింపులు తరచూ హెచ్చు తగ్గులకు, ఒడిదుడుకులకు లోనవుతున్నాయి.

సుస్థిర ఆర్థిక వ్యవస్థ గురించి సానుకూల అంశాలు ఉన్నప్పటికీ మధ్యకాలిక లక్ష్యాల సాధనలో ప్రతికూల అంశాలు ఎదురవుతున్నాయని ఐ.ఎం.ఎఫ్. నివేదిక హెచ్చరించింది. అంతర్జాతీయ నివేదికల్లో భాష చాలా సున్నితంగా, మర్యాదగా ఉంటుంది. విమర్శా ధోరణిలో కాకుండా సూచనాత్మకంగా, సలహా పూర్వకంగా ఉంటుంది. ఉన్నతాధికారుల స్థాయిలో దాన్ని అర్థం చేసుకుని స్వీకరించే లక్షణం ఉంటుంది. రాజకీయ నాయకత్వానికి అలాంటి లక్షణం తక్కువ.

వారికి రాబడి అంచనాలతో, బడ్జెట్ పరిమితులతో, రుణ ఒత్తిళ్లతో సంబంధం ఉండదు. అనుత్పాదక, అనుచిత ఉచితాలు ప్రకటించడానికి రాజకీయ నాయకత్వం నిరంతరం పోటీ పడుతూనే ఉంది. ఎన్నికల విజయాలే ప్రధానంగా భావించే రాజకీయం అన్నిచోట్లా వర్ధిల్లుతున్న కాలమిది. మనదేశం కూడా అందుకు మినహాయింపు కాదు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఐదు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, **2030** నాటికి **7.3** ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని భారత్ లక్ష్యంగా పెట్టుకున్నది". ఎన్ని ఒడిదుడుకులు ఉన్నప్పటికీ మన ఆర్థికవ్యవస్థ సుస్థిరంగా ముందంజ వేస్తున్నది" అని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఎక్స్‌లో పేర్కొన్నారు. మన దేశంలో అత్యధిక జనాభాకు ఆదాయాలు స్తంభించిపోయాయి. ఖర్చులు పెరిగిపోయాయి. ఆదాయపు పన్నులు చెల్లించే వారి సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ దేశంలో రకరకాల పన్నుల భారం పెరిగిపోయింది.

పొదుపు బాగా తగ్గిపోయింది. అసంఘటిత రంగంలో పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నది. అయినా జిడిపి **7** శాతం నుండి **8** శాతం వృద్ధి సాధిస్తున్నదని ప్రభుత్వం అంటున్నది. కోవిడ్ అనంతరం కూడా భారత ఆర్థికవ్యవస్థ సుస్థిరంగా ముందంజ వేసిందని, **2021** నాటికి **3.7** ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా బలంగా ఉందని, **2025** నాటికి ఐదు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రస్తుతం **4.19** ట్రిలియన్ల దగ్గర మన ఆర్థిక వ్యవస్థ తచ్చాడుతున్నదని ప్రభుత్వమే అంటున్నది. భారత ప్రభుత్వ ధీమా ఎలా ఉన్నప్పటికీ రుణభారం వల్ల పెరగనున్న ముప్పును గురించి ఐ.ఎం.ఎఫ్.సహా పలు అంతర్జాతీయ సంస్థలు చేస్తున్న హెచ్చరికలను భారత ప్రభుత్వం ఇప్పటికైనా పట్టించుకోవాలి.

డి. సోమ సుందర్

# బీహార్ ఫలితాలు.. పరిశీలనాంశాలు



***యావత్ భారతదేశం ఉత్కంఠగా ఎదురుచూసిన బీహార్ అసెంబ్లీ 2025 ఎన్నికల ఫలితాలపై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు:***

మన దేశంలో ప్రతి ఎన్నికా భయాన్ని కలుగ చేస్తోంది. రెండు ప్రధాన పార్టీలు కావచ్చు, ఈమధ్యకాలంలో ఎక్కువగా గెలుస్తున్న రెండు ప్రధాన కూటములు కావచ్చు.. ఈ దేశంలో ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పన, సంపద సృష్టికి అనుకూలంగా ఉండి, మిగిలిన విషయాల్లో కాస్త తేడా ఉన్నా – మనకు భయం ఉండదు. అలాంటి ఎన్నికల్లో ఎవరు గెలిచినా మనం ఆందోళన చెందం. పార్టీల మధ్య పోరాటం, పోటీ ఉండాలి. గెలుపు కోసం తపన ఉండాలి. కానీ మౌలిక ఆర్థికాంశాల్లో ఏకాభిప్రాయం ఉన్నప్పుడు ఎవరు నెగ్గినా దేశ భవిష్యత్తుకి ఢోకా ఉండదు. ఒకప్పుడు మొత్తమ్మీద ఎన్నికలు అలా ఉండేవి. ఇటీవలి కాలంలో ప్రతి ఎన్నికా భయాందోళనల్ని కలుగ చేస్తోంది. తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమం రాజకీయాన్ని, ఆర్థికాభివృద్ధిని దెబ్బతీస్తుండటం అందుకు కారణం.

సంక్షేమం అవసరం. ఒక ప్రజాస్వామ్య సమాజంలో, అది మన నైతిక బాధ్యత. ఆకలిగొన్నవారికి అన్నం పెట్టకుండా మనం ఎన్ని మాట్లాడినా ఉపయోగం ఉండదు. కాబట్టి సమాజం ఆ బాధ్యత తీసుకోవాలి. కష్టంలో ఉన్నవారిని ఆదుకోవాలి. అదేవిధంగా, సమాజంలో అణగారిన వర్గాలున్నప్పుడు, దుర్భర దారిద్ర్యం ఇంకా తాండవిస్తున్నప్పుడు.. ప్రజల పన్నుల డబ్బు నుండి వారికి ప్రభుత్వం ఎంతోకొంత అండగా ఉండాలి. కానీ ఈ సంక్షేమం వల్ల పేదరికం పోదు. సంక్షేమం వల్ల బతుకులు బాగుపడవు. రోజూ తింటాం. కానీ మరుసటి రోజు పరగడుపే. కాబట్టి వ్యక్తిగత, తాత్కాలిక సంక్షేమాన్ని దీర్ఘకాలిక అభివృద్ధితో జోడించాలి.

**దీర్ఘకాలిక అభివృద్ధి అంటే ఏమిటి?**

మంచి విద్యను అందించటం, నైపుణ్యాన్ని ఇవ్వటం, పెట్టుబడుల్ని పెంచటం, రోడ్లు, మంచినీటి సరఫరా, వర్షం వస్తే వరదలు రాకుండా ఏర్పాట్లు వంటి అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించటం.. ఇలా ఉమ్మడి అవసరాల్ని మన పన్నుల డబ్బుతో తీర్చటం ఇక్కడ పెట్టుబడులు పెడితే, ఇక సంపద సృష్టిస్తే తమకు భద్రత ఉంటుంది, లాభాలు ఉంటాయి అనే నమ్మకం కల్పించటం, దాన్నుంచి ఉపాధి సృష్టించటం, ఈ మొత్తం నుండి ఆదాయాల్ని పెంచటం – దీర్ఘకాలిక అభివృద్ధి.

కాబట్టి, తాత్కాలిక సంక్షేమానికి పాత్ర ఉన్నది. కానీ ఆ తాత్కాలిక సంక్షేమం ఒక్కటే బాధ్యతగా తీసుకుని ప్రభుత్వాలు ఇక మిగతావి పక్కన పెట్టేస్తే, భవిష్యత్తు అంధకారమవుతుంది, పేదరికం శాశ్వతమవుతుంది, పేదలు పేదలుగా మిగిలిపోతారు. ఈవేళ మన దేశంలో మౌలిక రాజకీయ పోరాటం – సంక్షేమం మాత్రమే అవసరం అనే పంథాకి, ఎంతోకొంత అభివృద్ధి కూడా అవసరం అనే పంథాకి మధ్య జరుగుతోంది. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. అంటే, ప్రతి ఎన్నికా మనకు రేపొద్దున ఏం జరుగుతుంది? అనే ఆందోళనే. ప్రతిరోజు పరగడుపైపోతుంది. రెండు ప్రధాన పార్టీలూ, కూటములూ దేశంలో అభివృద్ధికి, ఉపాధి కల్పనకి, సంపద సృష్టికి అనుకూలంగా ఉన్నట్లయితే, అప్పుడు మనకు ఎన్నికల్లో ఏ పార్టీ నెగ్గినా, నెగ్గకపోయినా భయాం దోళనలు ఉండనక్కర్లేదు. ఇప్పుడా పరిస్థితి లేదు కాబట్టే.. బీహార్ 2025 అసెంబ్లీ ఎన్నికలలో ఎన్.డి.ఏ గెలవ గానే, దేశ ప్రజలు, ఆలోచించేవాళ్లు ఊపిరిపీల్చు కుంటున్నారు.

ఒకరు గొప్పవాళ్లు, ఒకరు తక్కువవాళ్లు అని కాదు. అందరూ ఒకే విన్యాసాలు చేస్తున్నారు. కులతత్వం, నేరస్తులను రాజకీయాలలో నిలపెట్టటం కావచ్చు. బీహార్‌లో మరీ అంత లేకపోయినా, చాలా రాష్ట్రాలలో, తెలుగు రాష్ట్రాలలో డబ్బులు పంచటం కావచ్చు, తాత్కాలిక తాయిలాలు ఇవ్వటం కావచ్చు – ఇవి అందరూ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే, కాస్త అభివృద్ధిని, ఉపాధిని పట్టించుకునేవారు గెలవటం ఎన్నిక తర్వాత ఎన్నికలో మనకు కీలకంగా మారుతోంది.

బీహార్‌లో కొన్ని స్థానిక పరిస్థితులుండొచ్చు. కానీ కొంచెం లోతుగా చూస్తే, ప్రతిపక్ష మహాగర్ బంధన్ అసంబద్ధ

హామీలనిచ్చింది. ప్రతి ఇంటికీ ప్రభుత్వోద్యోగం ఇస్తానంది. అంతకంటే అబద్ధం, అసాధ్యమైన హామీ ఇంకోటి లేదు. బీహార్‌లో 2 కోట్ల 50 లక్షల వరకు కుటుంబాలున్నాయి. వారందరికీ 2.5 కోట్ల ప్రభుత్వోద్యోగాలు ఇవ్వాలి. నెలకు కనీసం 30 వేలకు తగ్గకుండా జీతాలిచ్చే ఉద్యోగాలివ్వాలి. భారతదేశం మొత్తంలో – జాతీయ, రాష్ట ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగంలోని సంస్థలు మొత్తం కలిపి చూసినా కూడా ప్రభుత్వోద్యోగాలు 1.8 కోట్లు. అలాంటిది మీరు 2 కోట్ల 50 లక్షల సర్కారీ ఉద్యోగాలు ఒక్క బీహార్ లో ఇస్తామనటం ఎంత అసంబద్ధమైనది. ఇది పచ్చి మోసమని సామాన్య ఓటర్లకు కూడా ఎన్నికలకు ముందే తెలిసిపోతుంది. ఇదేగనక తెలివిగా వారు, 10 లక్షల ఉద్యోగాలు కొత్తగా ఇస్తామని చెప్పి వుంటే ప్రజలు నమ్మి ఉండేవారేమో. అదే జరిగితే ప్రమాదకర పరిస్థితి ఎదురయ్యేది.

ప్రతిపక్షం ఇచ్చిన హామీ ఎంత అసంబద్ధమైనదో హామీలకు డబ్బెంత అవుతుందో లెక్కేసినట్లయితే దిగ్భ్రాంతి కలుగుతుంది. మొత్తం బీహార్‌లో కర్షకులు, కార్మికులు, ప్లంబర్లు, ఇతర వృత్తులవారు ఇలా అందరూ కలిపి చేసే ఉత్పత్తి విలువ కంటే రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల జీతాల ఖర్చు ఎక్కువ వుతుంది. అంటే, ప్రజలు సంపాదించే 100 రూపాయలకు 100 పన్నులుగా తీసుకున్నా, జీతాలివ్వటం సాధ్యం కాదు. అంత అసంబద్ధమైన హామీనిచ్చారు. గతంలోని ఆర్.జె.డి హయాం.. ఆనాడు ఏం పేరు పెట్టినా, జంగిల్ రాజ్యం అని అందరికీ తెలుసు. గూండారాజ్యం, మతతత్వ రాజ్యం, అంతా కులం తప్ప ఇంకోటి లేదు. దేశమంతా ఈ జాడ్యం ఉంది. కానీ బీహార్‌లో మరింత ఉంది. ప్రజలు మర్చిపోలేదు ఇంకా. రెండోది, నితీష్‌కుమార్ ఉన్నంతలో మెరుగైన పాలన అందించారు. బీహార్ ఇంకా పేద రాష్ట్రం. ప్రపంచంలోనే అత్యంత పేద దేశాలతో పోటీపడుతోంది. తలసరి ఆదాయం ఇప్పటికీ 69-70,000 రూపాయలు దాటలేదు. అంత పేదరికం! ఈ పరిస్థితుల మధ్యే నితీష్ కుమార్.. శాంతి భద్రతల పరిరక్షణ గానీ, కొంతమేరకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచటం గానీ చేశారు. కొంత మేరకు మంచిపాలన అందించారనే నమ్మకం ప్రజల్లో ఉంది. అలాంటప్పుడు ఆర్.జె.డి అసంబద్ధ హామీలిచ్చి, ఒకే ఒక్క ప్రాతిపదికన – కొత్త మొహాలు కాబట్టి మాకు అవకాశం ఇవ్వండి అని ప్రజల్లోకి వెళ్లారు. బలమైన, నమ్మకమైన ఎజెండా లేకుండా కొత్త ముఖ్యమంత్రి ముఖం కోసం ఓటేయండని అసంబద్ధ హామీతో అడగటాన్ని ఓటర్లు తిరస్కరించారు.

కానీ ఇందాక నేను చెప్పినట్లు, క్షణక్షణం మనం భయం భయంగా బతుకుతున్నాం. ఒక్క ఎన్నికలో గనక ప్రజలు దీర్ఘకాలిక అభివృద్ధిని పక్కనపెట్టేసి తాత్కాలిక తాయిలాలకు, అసంబద్ధ హామీలకే పట్టం కడితే, తర్వాత అనుభవం నుండి పాఠాలు నేర్చుకోవచ్చు. కానీ ఈలోగా దేశం సర్వనాశనమవుతుంది. కాబట్టి మనం కోరుకోవలసింది ఏమిటంటే – అన్ని పార్టీలూ బాధ్యతగా వ్యవహరించటం. అందుకు అవసరమైన ఎజెండా లేదా?.. ఉంది మన దేశంలో.

ఎన్.డి.ఏ కొన్నిచోట్ల గెలుస్తుండవచ్చు. అభివృద్ధితోపాటు కొంతమేర ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తుండవచ్చు. కానీ ఎన్.డి.ఏ వైఫల్యం వల్ల దెబ్బతిన్న రంగాలు చాలా ఉన్నాయి. నష్టపోయేదెవరు? నిరుపేదల పిల్లలు, కుటుంబాలు.

తెలివితేటలు లేవా?.. అందరికీ ఉన్నాయి. బీహార్‌లోని సామాన్యుల కుటుంబాలకు ఎన్నో తెలివితేటలున్నాయి. బెంగళూరులోనో, చెన్నైలోనో సంపన్నుల కుటుంబాలకు ఎలాంటి తెలివితేటలున్నాయో అదేస్థాయిలో ఉన్నాయి. కానీ తేడా ఏమిటి? పాఠశాల విద్య సక్రమంగా, మనం పెట్టే ఖర్చుకు తగ్గట్లు ఉన్నట్లయితే ఆ తెలివితేటలు వికసిస్తాయి. బుద్ధి పదునెక్కుతుంది. అది ఈవేళ బీహార్‌లో, దేశంలో జరగటంలా. మంచి ఆరోగ్యం అందటంలా. రకరకాల పథకాలు అమలవుతున్నా కూడా. అందరికీ మంచి ఆరోగ్యం అందించే విధానం, వ్యవస్థ లేదు. అందువల్లే, అనారోగ్యం వస్తే ఆర్థిక భారం వల్ల దుర్భర దారిద్ర్యం కొనసాగుతోంది. అప్పుల పాలవుతున్నారు.అదేవిధంగా, చట్టబద్ధపాలన లేదు. కోట్లాది కేసులు వస్తున్నాయి, కానీ కోర్టుల గుమ్మాల దాకా వెళ్లకుండా గూండాల బారిన పడాల్సి వస్తోంది. వాళ్లు కండ బలంతో బండన్యాయం అందిస్తున్నారు. చట్టసభల్లో నేరస్తుల గురించీ మనం ఆలోచించాలి. నేర రాజకీయాల మీద మనం దృష్టి పెట్టటంలా. అధికారం కేంద్రీకృతమై పోయింది. ముఖ్యంగా రాష్ట్రాల్లో. పట్టణ ప్రాంతాల్లోనూ స్థానిక ప్రభుత్వాలు నిర్వీర్యమైపోయాయి. కనీసం కేరళ తరహాలో వాటిని బలోపేతం చేయకుండా ప్రజాస్వామ్యం సాధ్యం కాదు. ప్రజాస్వామ్యం పెరగదు. అది దీర్ఘకాలిక కృషి.

అలాగే చిన్న పట్టణాలు పెరగాలి. ఒక పాట్నా నగరం పెరిగితేనో, ఒక హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకి వలస పోతేనో ప్రజల జీవితాలు బాగుపడవు. పొట్ట చేత పట్టుకుని మహానగరాలకు వలస వెళ్లి అక్కడ దుర్భర జీవితం గడపటం సుస్థిర పట్టణీకరణ కాదు. ఉన్న ఊరికి దగ్గరలోనే ఉపాధి కల్పన, ఆదాయాలు అందించే చిన్న పట్టణాలు గ్రామాల మధ్య ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చెందితే, భద్రమైన జీవితం ఏర్పడుతుంది. తక్కువ జీతంతోనే.. మహానగరాలలో ఉండే అన్ని సౌకర్యాలతో బతకొచ్చు. జీవన భద్రతతోపాటు..ఉమ్మడి కుటుంబాల్లోని సుఖసంతోషాల్నీ ఆస్వాదించవచ్చు. అలాకాకుండా నిస్సహాయ స్థితిలో నిరు పేదలు వలసలు పోవటం వల్ల వారి జీవితాలతోపాటు నగరాలూ నరకం అవుతున్నాయి.

కాబట్టి ఒక బలమైన ఎజెండా దేశానికి అవసరం. ప్రత్యామ్నాయం అంటే అదీ! దాని మీద దృష్టి పెట్టకుండా..వాళ్లు

అభివృద్ధిని చూపిస్తుంటే, ఆ అభివృద్ధిని పక్కనపెట్టి మేం తాత్కాలిక తాయిలాలు ఇస్తామని ప్రకటించటం ప్రత్యామ్నాయం కాదు. ఈ దేశ భవిష్యత్తుని ప్రమాదంలోకి నెట్టటం.

### ఓడిపోయిన పార్టీలకు పాఠాలు

గెలుపోటములు సహజం. కానీ ఒక ప్రత్యామ్నాయ ఎజెండా లేకుండా ఓడిపోవటం రాజకీయం కాదు. బలమైన ఎజెండా, అది కొరవడటం వల్ల ఈ దేశ ప్రజలకు అన్యాయం జరుగుతున్నదీ.. ఆ ఎజెండాని రూపొందించుకొని, ఆ అన్యాయాన్ని అరికట్టటం కోసం, అందరికీ న్యాయం చేయటం కోసం ప్రతిపక్షాలు పనిచేయాలి. అంతేతప్ప.. గతం కంటే ఎక్కువగా తాత్కాలిక తాయిలాల డోసును పెంచటం, అభివృద్ధిని మంటగలపటం, రాష్ట్రాన్ని నాశనం చేయటం, అప్పులపాలు చేయటం, మన బిడ్డల మీద భారాన్ని పెట్టి మనం ఈవేళ ఓపీఎస్ పునరుద్ధరణ వంటి పథకాలతో తినేయటం, భవిష్యత్తును అంధకారం చేయటం కాదు. అభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం ఉండే ఎజెండా ఈ దేశానికి అవసరం. అటువంటి ఎజెండాను ఏ ప్రభుత్వమూ అమలు చేయటం లేదు. దాన్ని చేపట్టాలి. 'ప్రభుత్వం మంచి విద్య ఇవ్వటం లేదు.. మేం ఇదిగో ఈ పద్ధతిలో ఇస్తాం' అని చెప్పగలగాలి. అదేవిధంగా 'మంచి న్యాయాన్ని మీరు ఇవ్వటంలా.. మేం ఇస్తాం, సులభంగా అందరికీ ఇలా అందిస్తాం' అని సవాలు చేయగలగాలి. 'మీరంతా మహానగరాలు, రియల్ ఎస్టేట్ చుట్టూ తిరుగుతున్నారు – మేం వస్తే, గ్రామాల మధ్యే చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి పరిశ్రమల్ని ప్రోత్సహిస్తాం, వ్యవసాయాన్ని వ్యాపారంలా మార్చి ప్రోత్సహిస్తం, రైతుకి లాభాల పంట పడిస్తాం' అని చాటగలగాలి. అలాంటి మౌలిక, బలమైన ఎజెండా మనకి ఉంది. ఆ ఎజెండాను తీసుకురండి, ప్రజలను ఆకట్టుకోండి, అధికారాన్ని వికేంద్రీకరించండి.. కచ్చితంగా ప్రజలు స్పందిస్తారు. ఓడించిన పార్టీలను తిరిగి ఆదరిస్తారు, మీకు రాజకీయ భవిష్యత్తునిస్తారు.

### ప్రశాంత్ కిషోర్ ఎజెండా చర్చ

ప్రశాంత్ కిషోర్ రాజకీయ కన్సల్టెంట్‌గా అనేకమంది రాజకీయ ప్రముఖులను గెలిపించారని పేరుగాంచారు. జన్ సురాజ్ పేరుతో కొత్త పార్టీ స్థాపించి బీహార్ అసెంబ్లీ తాజా ఎన్నికల్లో పోటీ చేశారు. ఇందుకోసం 2022 నుండే విస్తృతంగా పర్యటించి వందల గ్రామాలను పాదయాత్ర ద్వారా సందర్శించారు. విద్య, ఆరోగ్యం, స్థానికంగా ఉపాధికి చర్యలు, ఆచరణసాధ్యంకాని మద్యనిషేధాన్ని తొలగించి బెల్టు షాపులు లేని నియంత్రణను అమలు చేసి ఆ డబ్బును అభివృద్ధికి వినియోగించటం వంటి కీలక అంశాలను ఎజెండా గా ప్రతిపాదించారు. ముఖ్యంగా యువతలో మంచి స్పందన వచ్చింది. కానీ మన ఎన్నికల వ్యవస్థ రెండు పార్టీలను మాత్రమే పెంచే వ్యవస్థ. గెలిచినవాడు గొప్పోడు కాదు, గెలవనివాడు తక్కువా కాదు. రెండు పార్టీలకే స్థానం.

ఉదాహరణకు, కాంగ్రెస్ పార్టీ 70–80 ఏళ్లుగా దేశంలో పాతుకుపోయిన పార్టీ. దశాబ్దాలపాటు దేశాన్ని, రాష్ట్రాలను పాలించింది. స్వతంత్రం తెచ్చిన పార్టీ. కానీ ఈవేళ ఆంధ్ర ప్రదేశ్‌లో పోటీకి దిగితే ఏం వస్తాయి ఓట్లు? లేకపోతే, బీజేపీ. చాలా రాష్ట్రాల్లో ప్రభావశీల పార్టీ. కానీ ఏపీలో సొంతంగా పోటీ చేస్తే ఎన్ని ఓట్లు వస్తాయి? తమిళనాడులో బీజేపీకి ఓట్లు ఏం వస్తాయి? కేరళలో విపరీతంగా ఆ పార్టీ పోటీపడుతోంది. కానీ నామమాత్రంగానే ఫలితాల్ని సాధించ గలదు. పార్టీలను తప్పుపట్టకూడదు. నాయకత్వాలను కించపరచకూడదు. మన ఎన్నికల వ్యవస్థ మూడవ పార్టీని పైకి రానీయదు. కాబట్టి, ఇది ఆషామాషీ కాదు. అరుదైన సందర్భాలలో ప్రధాన పార్టీ అదృశ్యమైనప్పుడు, అప్పుడు మూడో పార్టీకి అవకాశం లభిస్తుంది. ఉదాహరణకి, ఏ కారణంగా నైనా ఢిల్లీలో కాంగ్రెస్‌పై అవినీతి ఆరోపణలు రావటంతో ఆ పార్టీ పట్ల ప్రజల్లో మొహం మొత్తింది. అకస్మాత్తుగా ఆ శూన్యాన్ని ఆప్ భర్తీ చేసింది. అలాగే పంజాబ్‌లో అకాలీదళ్ చాలాకాలం అధికారంలో ఉంది. విపరీత అధికారం, అవినీతితో ఆ పార్టీ ఆత్మహత్య చేసు కుంది. ఆ స్థానాన్ని ఆప్ వాళ్లు భర్తీ చేశారు. అంతేతప్ప, మూడో పార్టీకి మన ఎన్నికల్లో ప్రభావం ఉండదు. కాకపోతే, పీకే చాలా రాష్ట్రాల్లో ఎన్నికల మేనేజర్‌గా గుర్తింపు పొందారు కాబట్టి.. కొంత ప్రభావం ఉంటుంది. దాన్ని మీడియా బాగా పెంచింది. జనసురాజ్ గెలవటం దాదాపు అసాధ్యమని అందరికీ తెలుసు. అది వేరు, దాన్ని బట్టి ఆ పార్టీ ఎజెండాను అంచనా వేయటం వేరు. ప్రశాంత్ కిషోర్ ప్రతిపాదించిన సమ్మిళిత ఆర్థికాభివృద్ధితో అందరినీ పెంచటం, అన్ని వర్గాలనూ కలపు కోవాలనే వాదన బలమైనది. ఆ విధంగా సరైన వాదన అయినట్లయితే, ఆ వాదన అవసరం. ఎన్ని ఓట్లు వచ్చాయన్నది ముఖ్యం కాదు. కాబట్టి, ప్రధాన పార్టీలు ఆ ఎజెండాను భుజానికెత్తుకోవాలి. దాన్ని నిర్మాణాత్మకంగా, కొత్త రీతిలో, ప్రజలను ఆకర్షించే రీతిలో, ప్రభుత్వాలు ఇప్పటిదాకా ఎందుకు చేయలేదో చెప్పి ప్రశ్నించాలి. తాము ఏం చేస్తామో, ఎలా అమలు చేస్తామో చెప్పాలి. అలాంటి రాజకీయం దేశానికి రక్ష అవుతుంది, ఆ పార్టీలకూ రాజకీయంగా పెరుగుదల అవుతుంది.

కొత్తగా వచ్చిన ఒక రాజకీయ పార్టీకి ఓట్లు లేవని వారి మంచి ఎజెండాను తగ్గించి చూపటంగానీ, ఆ విధానాలను విస్మరించటంగానీ పొరపాటు. కొత్త పార్టీ రావటం కష్టంగానీ, ఎజెండా బలమైనదైతే కచ్చితంగా ప్రధాన పార్టీలు సొంతం చేసుకోవాలి, ప్రజల ముందుకు తీసుకెళ్లాలి, ఆ మార్పును సాధించాలి. పార్టీలకన్నా దేశం మిన్న!


★

# పొరపాటు సరిదిద్దుకున్న సుప్రీంకోర్టు..

# గవర్నర్ వ్యవస్థను పునర్నిర్మించాల్సిన సమయమిది

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**

రాష్ట్ర అసెంబ్లీ పంపిన బిల్లుల ఆమోదంలో గవర్నర్లకి పరిమిత విచక్షాధికారం మాత్రమే ఉంటుందని ఏప్రిల్ 8, 2025న ఇచ్చిన తీర్పులోని కొన్ని తప్పుల్ని, రాజ్యాంగ ఉల్లంఘనను అప్పట్లోనే ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్ సత్తా తరపున బహిరంగంగా తెలియచేశాం (జూన్ 4, 2025న 'ఫ్రీ ప్రెస్ జర్నల్' ఎడిట్ పేజీలో ప్రచురించిన నా వ్యాసంతోపాటు.. జేపీ లోక్‌సత్తా యూట్యూబ్ ఛానల్ వీడియోల్లో ఆ వివరాలు చూడవచ్చు). మే 13న రాష్ట్రపతి కొన్ని ప్రశ్నలను సంధించిన నేపథ్యం లో..వాదోపవాదాల అనంతరం నవంబర్ 20న వాటికి సమాధానంగా ఇచ్చిన తీర్పులో సుప్రీం కోర్టు తన పొరపాటును సరిదిద్దుకుంది.



ఏప్రిల్ తీర్పులో మిగతా అన్ని అంశాల్లో సుప్రీంకోర్టు తర్కం ప్రశంసనీయం. నిరవధికంగా బిల్లుల్ని నాన్చటం, తద్వారా వీటో అధికారాలను వినియోగించటం గవర్నర్ చేయరాదని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొనటం కొంతవరకు సమంజసం. కానీ పెండింగ్ బిల్లుల్ని ఆమోదించినట్లుగా భావించాలని పేర్కొంటూ ఆర్టికల్ 142ను ప్రయోగించటంలో మాత్రం కోర్టు గీత దాటింది. ఆ ఆర్టికల్‌ను ఉపయోగించి దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న పది బిల్లుల్ని రాష్ట్ర రాజ్యాంగాధినేత సంతకం లేకుండానే ఆమోదించినట్లుగా భావించాలని పేర్కొనటం, సదరు బిల్లుల్ని చట్టాలుగా మార్చే యటం న్యాయవ్యవస్థ తన పరిధిని అతిక్రమించటం. ఏప్రిల్‌లో ద్విసభ్య ధర్మాసనం పొరపాటును తాజాగా రాజ్యాంగ ధర్మాసనం సరిదిద్దింది. ఎలాగైతే రాష్ట్రపతి జాతీయస్థాయి శాసన నిర్మాణ వ్యవస్థలో అవిభాజ్య భాగమో, అదేరీతిలో గవర్నర్ కూడా రాష్ట్ర శాసననిర్మాణం నుంచి వేరు కాదు. గవర్నర్ సంతకం లేకుండా, న్యాయవ్యవస్థ ఆదేశం ద్వారా చట్టాన్ని అమలు చేయొచ్చునటం ప్రమాదకరమైన భావన.

ఇదేసమయంలో, గవర్నర్ పాత్ర అంతా సవ్యంగా, రాజ్యాంగ బద్ధంగా సాగుతోందనుకోటం కూడా పొరపాటు.

ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టు జోక్యం మూడు పర్యవసానాల పై చర్చను లేవనెత్తుతుంది. భారత ఫెడరలిజం స్థాయి, ఒక ఫెడరల్ వ్యవస్థలో నామినేట్ అయిన గవర్నర్ పాత్ర, ఆర్టికల్ 142 కింద కోర్టు విచక్షణాధికారాల పరిధి.

మొదటిది, భారత ఫెడరలిజం స్థితి. రాజ్యాంగ సభ లక్ష్యాల తీర్మానం ఏమి ఆశించినదనేది సుస్పష్టం: రాష్ట్రాలు "స్వతంత్ర విభాగాలుగా సొంత హోదాను కలిగివుంటాయి. మిగిలిన అధికారాల ద్వారా యూనియన్ గా కలసికట్టుగా ఉంటాయి". కానీ రాజ్యాంగ వాస్తవ రచనకొచ్చేసరికి మన జాతీయోద్యమ నేతలు భారత్ కు పాక్షిక–సమాఖ్య (క్వాజీ–పెడరల్) వ్యవస్థని ఎంచుకున్నారు. ఇది చాలా స్పష్టంగా దేశ విభజన సమయంలోని భయానక పరిణామాలకు ప్రతిస్పందన. అసాధారణ వైవిధ్యం, వేర్పాటువాద ధోరణలతో కొత్తగా ఏర్పడిన ఒక జాతి–రాజ్యం ఐక్యతను, సమగ్రతను కాపాడటానికి అప్పుడున్న పరిస్థితుల్లో ఈ రకమైన ఏర్పాటు తప్పదని భావించారు. ఒక ఫెడరల్ రాజకీయ వ్యవస్థలో భాగంగా ఏర్పాటైన రాష్ట్రాల్ని రద్దు చేయలేరు. వాటి సరిహద్దుల్ని.. అదీ సంబంధిత వర్గాల ఆమోదంతో మార్చగలరంతే. కానీ మన పాక్షిక–సమాఖ్య రాజ్యాంగం ప్రకారం, ఒక రాష్ట్ర శాసనసభ తన అభిప్రాయాల్ని వ్యక్తం చేశాక, పార్లమెంటు తన ఇచ్ఛాను సారం రాష్ట్రాల్ని ఏర్పాటు చేయవచ్చు. రాజ్యాం గంలో 2,3 అధికరణలు ఇందుకు వీలు కల్పిస్తున్నాయి.

మరో ఏకీకృత కేంద్ర లక్షణం – రాష్ట్రపతి పాలన విధించటానికి యూనియన్‌కి ఉన్న అధికారం (356వ అధికరణ). 1950 నుంచి 134 సార్లు ఆ అధికారాన్ని వినియోగించారు. చాలా సందర్భాలలో పక్షపాత రాజకీయాలతో ఉపయోగించారు. రాష్ట్రాధినేతలుగా నియమితులైన గవర్నర్లు తరచూ యూనియన్ ప్రభుత్వ కీలుబొమ్మలుగా వ్యవహరించారు రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాల్ని ఢిల్లీ పెద్దల రాజకీయ ప్రయోజనాల కోసం కూల్చారు.

ఆర్థిక నిర్వహణలో, లైసెన్స్–పర్మిట్–కోటా రాజ్యాన్ని నిర్మించటం, కేంద్రీకృత ప్రణాళిక పద్ధతిని అనుసరించటం,

సర్వాధికారాలు గల ప్రణాళికా సంఘాన్ని కార్యనిర్వాహక ఆదేశం ద్వారా ఏర్పాటు చేయటం..రాష్ట్రాలను యూనియన్ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడేవిగా తయారుచేసింది. ఫెడరల్ నిర్మాణంలో ఆర్థిక సంఘం ఒక ఆశాకిరణం. అయితే, రాష్ట్రాలకు, ఆ దిగువ అంచెలోని ఫెడరల్ వ్యవస్థకు నిధుల బదిలీలో ఏకపక్ష ఫార్ములాను అనుసరించటం అనిశ్చిత వాతావరణాన్ని సృష్టించింది. యూనియన్ ప్రభుత్వ ఆధిపత్యంగా మారింది. తమకు నచ్చిన రాష్ట్రాలకేమో వరాల మూటలు రాజకీయ ప్రత్యర్థులకు మాత్రం మొండిచెయ్యిగా తయారైంది. గవర్నర్లను యూనియన్ నుంచి నియమించటం ద్వారా ప్రతిపక్ష ప్రభుత్వాలున్న రాష్ట్రాలకు కష్టాల్ని మరింత పెంచటం రాజకీయ ఆనవాయితీగా మారింది. ఇది ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసింది.

అయితే, సంతోషించాల్సింది ఏమిటంటే, మన ఫెడరలిజం కొన్నేళ్లలో పరిణతిని సాధించింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన దేశాలలో.. అనేక భాషలు కలిగి, ఫెడరల్ ప్రజాస్వామ్య వ్యవస్థగా విజయవంతమైనది, వేగంగా ఎదుగుతున్నది భారత్ మాత్రమే! తనకున్న కేంద్రీకృత, తిరుగులేని అధికారాలను ప్రయోగించకుండా యూనియన్ ప్రభుత్వం రాష్ట్రాల సరిహద్దుల విషయంలో ఎప్పుడూ సంయమనం పాటించింది. సంబంధిత రాష్ట్రాల అంగీ కారంతోనే సరిహద్దుల్లో మార్పులు చేసింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల పునర్విభజన కావచ్చు, ఆ తర్వాత కొత్త రాష్ట్రాల ఏర్పాటు కావచ్చు. రెండు మాత్రమే మినహా యింపులు. ఆంధ్రప్రదేశ్ విభజనబీ జమ్మూకశ్మీర్ విభజన, కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేయటం. ఆంధ్రప్రదేశ్ అనుభవం తర్వాత సదరు రాష్ట్ర ఆమోదం లేకుండా కొత్త రాష్ట్రం ఏర్పాటు చేసే సాహసాన్ని ఏ ప్రధాన జాతీయ పార్టీ చేయదు. చరిత్ర, జాతీయ భద్రత అనివార్యతల రీత్యా జమ్మూకశ్మీర్ ఒక ప్రత్యేకమైన కేసు. ఆ ప్రాంతానికి రాష్ట్ర ప్రతిపత్తిని తిరిగి కల్పిస్తామని యూనియన్ ప్రభుత్వం అధికారికంగా పేర్కొంది.

దశాబ్దాలకాలంలో, అనేక ఇతర సానుకూల మార్పులు మన ఫెడరలిజాన్ని నిజమైనదిగా, పటిష్ఠమైనదిగా మార్చాయి. డాక్టర్ అంబేద్కర్ ఆశించినట్లు, ఆర్టికల్ 356 కాగితాలకే పరిమితమైంది. బొమ్మయ్ కేసు (1994)లో సుప్రీంకోర్టు తీర్పు ఇందుకు కారణం. లైసెన్స్–పర్మిట్–కోటా రాజ్యాన్ని గణనీయస్థాయిలో కూల్చివేశారు. పదవ ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రాల వాటా బదిలీ ఒక పద్ధతి ప్రకారం సాగింది. యూనియన్ తనకు నచ్చినట్లు రాజకీయ పక్షపాతంతో కేటాయింపులు చేయటం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. ప్రణాళికా సంఘం రద్దయింది. ఎంట్రప్రెన్యూర్ షిప్, ప్రయివేటు పెట్టుబడులు పెరగటంతో, ప్రభుత్వ సంస్థల పాత్ర చాలావరకు కనుమరుగైంది. మొత్తంగా, మన ఫెడరలిజం మొదట్లో కంటే చాలా పరిణతిని సాధించింది. రాష్ట్రాలు చాలావరకు తమ భవిష్యత్తుకి తామే కర్తలుగా మారాయి. రాష్ట్రాల్లో సమర్థ నాయకత్వం, విధానాల ఎంపిక మునుపెన్నడూలేని రీతిలో భారత్‌ను పునర్నిర్మిస్తున్నాయి. వైవిధ్యం, ప్రాంతీయ అసమానతలు, రాజకీయంగా తీవ్ర పోటీ నేపథ్యంలో నిధులు, అధికారాల బదిలీపై ఆరోగ్య కరమైన చర్చ కొనసాగుతోంది.

ఇవన్నీ మనల్ని గవర్నర్ వ్యవస్థ గురించి ఆలోచింపచేస్తాయి. గవర్నర్‌ని యూనియన్ ప్రభుత్వం నియమించటం బూజు పట్టిన సాంప్రదాయం. ఆస్ట్రేలియా, కెనడా మాత్రమే ప్రావిన్స్ లకు (రాష్ట్రాలు) గవర్నర్లను నామినేట్ చేసే పద్ధతిని ఇప్పటికీ కొనసాగిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో రాష్ట్ర ప్రీమియర్ సలహా మేరకు గవర్నర్ ని నియమిస్తారు. కెనడాలో లెఫ్టినెంట్ గవర్నర్ భారత్ లోలా ప్రధానమంత్రి సలహా మేరకు నియమితులవుతారు. కానీ ఎల్.జి ప్రావెన్షియల్ ప్రభుత్వాన్ని రద్ద చేయలేడు. ఒక బిల్లును తిరస్కరించే అధికారాన్ని వినియోగించటం దాదాపు అరుదు. చివరిసారిగా అటువంటి అధికారాన్ని సస్కచెవాన్ రాష్ట్ర విషయంలో 1961లో వినియోగించారు.

గవర్నర్ వ్యవస్థను పునర్నిర్వచించాల్సిన సమయమిది. విజ్ఞత గల గవర్నర్ మంచి ప్రసూతి వైద్యునిలా వ్యవహరిస్తారు. నిపుణుడైన ప్రసూతి డాక్టర్ కాన్పు సమయంలో జాగ్రత్తగా గమనిస్తుండటం తప్ప అనవసర జోక్యం చేసుకోరు. అధికారాల విభజన స్పష్టంగా ఉండటం ఆదర్శనీయం. ప్రభుత్వ, రాష్ట్రాధినేతగా గవర్నర్ ని ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి. రాష్ట్రపతి ఎన్నిక తరహాలో గవర్నర్ ని కూడా రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాల ద్వారా ఎన్నుకోవటం ఇంకో పద్ధతి. చివరిగా, శాసనసభ ఆమోదం పొంది పెండింగ్‌లో ఉన్న బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు పరిధి.

మన రాజ్యాంగం పాక్షిక–విప్లవాత్మక చట్టం. దీనిపై రాజ్యాంగసభ సభ్యులు సంతకం చేశారు తప్ప, వలస పాలకులు నియమించిన దేశాధినేత కాదు. కానీ గవర్నర్ రాజ్యాంగం ద్వారా నియమితులవుతారు. ఆయన పాత్రను దాట వేయలేరు. కోర్టులు శాసనసభ అధికారాన్ని ఆక్రమించకుండా గవర్నర్‌కి బిల్లుల ఆమోదానికి సంబంధించి నిర్దిష్ట గడువును పరిమిత న్యాయసమీక్ష పరిధిలో విధించటం వరకు విజ్ఞత గల పని అవుతుంది. అలాంటి పరిణతితో నిజమైన అధికారం నియంత్రణలో ఉంటుంది. మన ప్రజాస్వామ్యంలోని లోపాల్ని పరిష్కరించగలిగింది, పరిష్కరించాల్సింది రాజకీయ ప్రక్రియ, ఎన్నికైన చట్టసభలు తప్ప.. స్వయంభూల్లా తమను తాము నియమించుకునే న్యాయమూర్తులు కాదు. ★

# రాష్ట్రాల బిల్లుల ఆమోదంపై గవర్నర్ జాప్యాన్ని ఆమోదంగా భావించాలని రాజ్యాంగం చెప్పలేదు

శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయ స్థానాలు గడువు విధించలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిర్దిష్ట గడువు లోగా సమ్మతి/అభిప్రాయం తెలియ చేయకపోతే ఆ బిల్లులను ఆమోదించినట్లుగా భావిం చటమూ రాజ్యాంగంలో లేదని, అధికారాల విభజన సూత్రా నికి ఇది వ్యతిరేకమని పేర్కొంది. శాసన నిర్మాణంలో రాష్ట్ర పతి, గవర్నర్లు నిర్వర్తించాల్సిన విధుల్ని మరే వ్యవస్థా భర్తీ చేయలేదని స్పష్టం చేసింది. దేశ సమాఖ్య వ్యవస్థలో గవ ర్నర్లు నిర్వహిస్తున్న పాత్రపై తీవ్ర చర్చకు దారితీసిన 'రాష్ట్రాల బిల్లుల ఆమోదం' అంశంలో సుప్రీంకోర్టు అయిదు గురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువ రించింది. అయితే తన వద్దకు వచ్చిన బిల్లులను గవర్నర్లు అకారణంగా, నిరవధికంగా నిలిపివేయటం తగదని, సహే తుక సమయంలో నిర్ణయం తీసుకోవాలని సూచించింది. నిరంకుశంగా బిల్లులను నిలిపివేసే పరిస్థితుల్లోనే కోర్టులు తమకున్న పరిమిత న్యాయసమీక్ష అధికారాలను ఉపయోగిం చాల్సి వస్తుందని అభిప్రాయపడింది. అధికరణం 143 కింద రాష్ట్రపతి ముర్ము సంధించిన 14 ప్రశ్నలకు జవాబిచ్చింది.

**రాష్ట్రపతి లేఖకు కారణమైన తీర్పు ఇదీ..**

తమిళనాడు గవర్నర్ బిల్లులను నిరవధికంగా నిలిపి వేయటాన్ని సవాలు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఏప్రిల్ 8, 2025న నిర్ణయం వెలువరించింది. ఆ తీర్పు రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో జోక్యం చేసుకున్నట్లుగా ఉండటంతో దేశ ప్రథమ పౌరురాలు మే 13న 14 ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు.

**కోర్టు జోక్యం ఎంతవరకు?**

గవర్నర్ల విధులు, నిర్ణయాలలో కోర్టులు సాధారణంగా జోక్యం చేసుకోలేవని రాజ్యాంగ ధర్మాసనం తాజాగా నవంబర్ 20న తీర్పు ద్వారా రాష్ట్రపతి ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాల్లో తెలిపింది. కానీ, కారణం లేకుండా బిల్లుల్ని దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచితే అది న్యాయపరమైన సమీక్ష పరిధిలోకి వస్తుందని పేర్కొంది. రాష్ట్రపతికి కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. గవర్నర్ బిల్లును పంపిన ప్రతిసారీ రాష్ట్రపతి.. సుప్రీంకోర్టును సంప్రదించాల్సిన అవసరంలేదని స్పష్టం చేసింది. అధికరణం 143 కింద రాష్ట్రపతి అవసరమని భావించినప్పుడు అభిప్రాయం కోరవచ్చని తెలిపింది.

**రాష్ట్రపతి 14 ప్రశ్నలకు**
**సుప్రీంకోర్టు ధర్మాసనం సమాధానాలు**



**(?) అధికరణం 200 కింద బిల్లు సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగ మార్గాలేంటి..**

**గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు మార్గాలున్నాయి.**

1.బిల్లుకు ఆమోదం తెలపటం 2. రాష్ట్రపతి పరిశీలన కోసం రిజర్వులో పెట్టటం 3. ఆమోదాన్ని పెండింగ్‌లో పెట్టి తన అభిప్రాయాలతో మళ్లీ శాసనసభకు తిప్పిపంపటం. అధికరణం 200లోని తొలి నిబంధన చాలా ముఖ్యమైనది. అందువల్ల నాలుగో ఆప్షన్‌కి వెళ్లటానికి బదులు అందులో ఉన్న ఆప్షన్స్ కి గవర్నర్ పరిమితం కావాలి. ఒకవేళ తన ముందుకు వచ్చింది ద్రవ్య బిల్లు కాకపోతే, అనుమతిని పెండింగ్‌లో ఉంచి తన అభిప్రాయాలతో ఆ బిల్లును తిప్పి పంపే ఐచ్ఛికం ఒక్కటే గవర్నర్ కి అందుబాటులో ఉంటుంది.

**(?) బిల్లులపై గవర్నర్ తన ముందున్న మార్గాలను ఎంచు కునేటప్పుడు మంత్రిమండలి సలహా, సూచనల మేరకే నడుచుకోవాలా..**

గవర్నర్ పైన పేర్కొన్న మూడు రాజ్యాంగపరమైన ఆప్షన్లను ఎంచుకునేటప్పుడు తన విచక్షణ ప్రకారం నడుచుకోవచ్చు. అధికరణం 200 కింద విధులు నిర్వహించేటప్పుడు మంత్రిమండలి సలహా, సూచనలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు.

**(?) గవర్నర్ ఉపయోగించిన రాజ్యాంగ విచక్షణాధికారాలను న్యాయపరంగా సమీక్షించవచ్చా**

అధికరణం 200 కింద గవర్నర్ విధులను సమీక్షించటం న్యాయబద్ధం కాదు. ఆయన తీసుకున్న నిర్ణయాల్లోని బాగోగుల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవు. కానీ, సదరు బిల్లులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నిరవధికంగా జాప్యం చేసినా, కారణం చెప్పకుండా పెండింగ్ లో ఉంచినా వారికున్న విచక్షణాధికార మెరిట్స్ పై వ్యాఖ్యలు చేయకుండా అధికరణం 200 కింద

విధులు నిర్వర్తించి బిల్లులపై తగిన సమయంలోగా నిర్ణయం తీసుకోమని కోర్టులు పరిమిత ఆదేశాలు జారీచేయొచ్చు.

**(?) అధికరణం 200 కింద గవర్నర్ చర్యలను న్యాయసమీక్ష చేయకుండా అధికరణం 361 పూర్తిగా నిషేధిస్తోందా**

గవర్నర్ ను వ్యక్తిగతంగా న్యాయవిచారణ ప్రక్రియలోకి లాగి న్యాయసమీక్ష చేయటాన్ని అధికరణం 361 పూర్తిగా నిషేధిస్తోంది. అధికరణం 200 కింద గవర్నర్ ఎలాంటి చర్యలూ తీసుకోకుండా నిరవధికంగా వాయిదా వేసినప్పుడు సమీక్షించేందుకు కోర్టుకు అధికారం ఉంది. ఆ పరిమిత న్యాయసమీక్షను అడ్డుకోవటానికి అధికరణం 361ని ఉపయోగించకూడదు.

**(?) కోర్టులు గవర్నర్ కి గడువులు విధించవచ్చా**

నిర్దిష్ట గడువులు, గవర్నర్ల అధికార వినియోగతీరుపై రాజ్యాంగంలో ఏమీ చెప్పనప్పుడు అధికరణం 200 కింద గవర్నర్ అధికారాల విషయంలో కోర్టులు న్యాయపరంగా గడువులు విధించటం తగదు.

**(?) అధికరణం 201 కింద రాష్ట్రపతికున్న విచక్షణాధికారాలను న్యాయసమీక్ష చేయొచ్చా**

గవర్నర్లకు వర్తింపచేసిన కారణం ప్రకారం, అధికరణం 201 కింద రాష్ట్రపతి ఇచ్చిన ఆమోదాన్నీ న్యాయపరంగా సమీక్షించటానికి వీల్లేదు.

**(?) రాష్ట్రపతి విచక్షణాధికారాలకు సంబంధించి కోర్టులు గడువు విధించొచ్చా**

అధికరణం 200 కింద గవర్నర్లకున్న అధికారాల విషయంలో ఇచ్చిన స్పష్టతే రాష్ట్రపతికీ వర్తిస్తుంది. అధికరణం 201 కింద విధులు నిర్వర్తించేటప్పుడు కోర్టులు విధించిన గడువులకు రాష్ట్రపతి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు.

**(?) తన ఆమోదం కోసం గవర్నర్ బిల్లు పంపినప్పుడు అధికరణం 143లో పొందుపరిచిన ప్రతిపాదన విధానం ద్వారా రాష్ట్రపతి ప్రతిసారీ సుప్రీంకోర్టు సలహాలు తీసుకోవాలా**

గవర్నర్ బిల్లు పంపిన ప్రతిసారీ సుప్రీంకోర్టు సలహాను రాష్ట్రపతి తీసుకోవాల్సిన అవసరం లేదు. ఆ బిల్లుపై రాష్ట్రపతి సంతృప్తి సరిపోతుంది. ఒకవేళ ఏ విషయంలోనైనా స్పష్టత లేకపోతే రాష్ట్రపతి దాన్ని అధికరణం 143 కింద సుప్రీంకోర్టుకు ప్రతిపాదించవచ్చు.

**(?) అధికరణం 200, 201 కింద గవర్నర్, రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలను చట్టం ఆచరణలోకి రావటానికి ముందే సమీక్షించొచ్చా. అందులోని అంశాలపై కోర్టులు విచారణ చేయవచ్చా**

చట్టం అమల్లోకి రాకముందే అధికరణం 200, 201 కింద గవర్నర్లు, రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలను సమీక్షించటం కుదరదు. బిల్లు చట్ట రూపం దాల్చక ముందు ఏరకంగానూ అందులోని అంశాలపై కోర్టులు న్యాయవిచారణ జరపరాదు.

**(?) రాష్ట్రపతి, గవర్నర్లు ఉపయోగించే రాజ్యాంగ అధికారాలు, జారీ చేసే ఉత్తర్వులకు అధికరణం 142 కింద సుప్రీంకోర్టు ఇచ్చే ఉత్తర్వులు ప్రత్యామ్నాయంగా ఉంటాయా**

గవర్నర్లు, రాష్ట్రపతి నిర్వహించే విధులు, జారీ చేసే ఆదేశాలను ఎట్టిపరిస్థితుల్లోనూ అధికరణం 142 ద్వారా భర్తీ చేయలేరు. అధికరణం 142 కింద.. బిల్లులకు అనుమతించినట్లుగానే భావించేలా (డీమ్డ్ టు అసెంట్) ఉత్తర్వులు జారీ చేయటాన్ని రాజ్యాంగం అనుమతించదు.

**(?) రాష్ట్ర శాసనసభలు చేసిన బిల్లులు గవర్నర్ అనుమతి లేకుండానే చట్టరూపం దాల్చుతాయా**

గవర్నర్ ఆమోదం లేకుండా శాసనసభలు తీసుకొచ్చే ఏ బిల్లూ చట్టరూపం దాల్చలేదు. అధికరణం 200 కింద ఉన్న గవర్నర్ పాత్రను మరో రాజ్యాంగ వ్యవస్థ భర్తీ చేయ లేదు.

**(?) అధికరణం 145(3) ప్రకారం రాజ్యాంగపరమైన కేసు సుప్రీంకోర్టు ముందుకొచ్చినప్పుడు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి ప్రతిపాదించాలా, వద్దా**

రాజ్యాంగా ప్రాధాన్యమైన కేసుల విచారణలో ధర్మాసనాల కూర్పు గురించి అడిగిన ప్రశ్న ప్రస్తుతం అప్రస్తుతం. దానికి సమాధానం

## రెండోసారి పంపిన బిల్లునూ రాష్ట్రపతికి గవర్నర్ పంపవచ్చు

★ రాజ్యాంగ అధికరణం 200 కింద బిల్లు తన వద్దకు వచ్చినప్పుడు గవర్నర్ పక్కన పెట్టి ఉంచలేరు. ఆ బిల్లును మళ్లీ శాసనసభకు తిప్పిపంపాల్సిందే. అలా తిప్పిపంపిన బిల్లు మళ్లీ తన వద్దకు వచ్చినప్పుడు గవర్నర్ కి రెండు మార్గాలుంటాయి. ఆమోదం తెలపటం, లేదంటే రాష్ట్రపతి పరిశీలనకు పంపటం. శాసన సభకు తిప్పి పంపిన బిల్లు సవరణలతోకానీ, సవరణలు లేకుండాకానీ తిరిగి వచ్చినా.. రాష్ట్రపతి పరిశీలన కోసం పంపే అధికారం గవర్నర్‌కు ఉంటుంది.

★ ఒకసారి తిప్పిపంపిన బిల్లు మళ్లీ వచ్చినప్పుడు గవర్నర్ దాన్ని అంతకుముందు పంపిన దాంతో పోల్చిచూసుకుని అనుమతివ్వాలా? లేదా? అని నిర్ణయం తీసుకోవచ్చు.

★ అందులో చేసిన సవరణలు అంతర్రాష్ట్ర సమాఖ్య కోణంలో ప్రభావం చూపుతున్నట్లు అనిపిస్తే దాన్ని రాష్ట్రపతి పరిశీలనకు పంపొచ్చు.

★ రెండోసారి అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకి అనుమతివ్వటం మినహా గవర్నర్‌కి మరో గత్యంతరం లేదనటం కుదరదు. అది బిల్లును రాష్ట్రపతికి పంపటానికి ఉన్న అధికారాలను ప్రభావితం చేస్తుంది. తిరిగి వచ్చిన బిల్లుకి సమ్మతి తెలపటం, లేదా రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వులో ఉంచే అధికారం గవర్నర్‌కి ఉంటుంది.

**సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం**

ఇవ్వకుండా వదిలేస్తున్నాం.

**(?) అధికరణం 142 కింద సుప్రీంకోర్టుకు ఉన్న అధికారాలు, విధానపరమైన అంశాలకు సంబంధించిన కేసులకే పరిమితమా**

అధికరణం 142 కింద ఉన్న అధికారాలు చాలా విస్తృతం. దానికి నిర్దిష్టంగా సమాధానం చెప్పటం సాధ్యం కాదు. రాష్ట్రపతి, గవర్నర్ల విధినిర్వహణలో అధికరణం 142కి ఉన్న పరిధిని పదో ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలోనే చెప్పాం.

**(?) అధికరణం 131 కింద దాఖలు చేసిన దావా విషయంలో కాకుండా ఇతరత్రా ఇంకేదైనా మార్గంలో యూనియన్, రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించకుండా రాజ్యాంగం సుప్రీంకోర్టు న్యాయపరిధిపై ఏమైనా పరిమితి విధిస్తోందా**

అధికరణం 131కి వెలుపల యూనియన్, రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారాల విషయంలో ఈ కోర్టుకున్న న్యాయపరిధితో ప్రస్తుత రాష్ట్రపతి ప్రతిపాదనకు సంబంధం లేదు. అందువల్ల దానికి సమాధానం ఇవ్వటం లేదు. ★

# ప్రభుత్వ బడులలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి

**బండారు రామ్మోహనరావు**




ఇప్పటి ఉపాధ్యాయులను టీచర్లుగా పిలవడం కంటే విద్యా ర్థుల మిత్రులుగా ఒక ఫెసిలిటేటర్లుగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు అన్నారు.

ఏలుబడి తీరు ఎట్లుంటే ఊరి బడి తీరు కూడా అట్లుంటదని ఊరుబడి తీరు బాగుపడాలంటే ప్రజల భాగస్వామ్యం మరింత ఉండాలని రామ్మోహనరావు అన్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేసిన కవి, రచయిత్రి, సామాజికవేత్త అన్నవరం సుజాత రాములు పదవీ విరమణ అభినందన సభలో ముఖ్య అతిథిగా రామ్మోహన రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయురాలు సుధారాణి అధ్యక్షత వహించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పందిళ్ళ శంకర్‌తో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా అమరవాది రాజశేఖర్ శర్మ వ్యవ హరించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ కుక్కను చంపాలంటే పిచ్చికుక్కగా ముద్ర వేసినట్లే ప్రభుత్వ బడులు సరిగ్గా నడవడం లేదని ప్రభుత్వమే ప్రచారం చేస్తుందని దాన్ని నమ్మిన ప్రజలు ప్రభుత్వ బడులకు తమ పిల్లలను పంపించడం లేదని ఆయన అన్నారు. అప్పటి తరం ఉపాధ్యాయుల గురించి గొప్పగా చెప్పుకుంటున్న మనం అప్పటి కంటే మరింత అద్భుతంగా అంకిత భావంతో పనిచేస్తున్న ఇప్పటి తరం ఉపాధ్యాయులను అభినందించాలని రామ్మోహన రావు కోరారు. మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్య దేవోభవ అన్నారు కనుక ఆచార్యులు ఆదర్శంగా ఉండాలని పందిళ్ళ శంకర్ అన్నారు. పిల్లలు చదువుతోపాటు ఎక్స్ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ అల వర్చుకోవాలని సాహిత్యము చిత్రకళ ఇతరత్రా లలిత కళలను నేర్చుకుంటే బాగుంటుందని దాశరథి సాహితి పురస్కార అవార్డు గ్రహీత అన్నవరం దేవేందర్ అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించొద్దు. పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు అదరాసు పల్లి శశిధర శర్మ. ఉపాధ్యాయులకు అనేక విధాలుగా బోధనేతర పనులు అప్పగిస్తున్నారని దీనివల్ల విద్యార్థులకు చదువు చెప్పే సమయం కంటే కాకి లెక్కలు రాసే సమయం ఎక్కువగా పడుతుందని పిఆర్టియు జిల్లా అధ్యక్షులు అదరాసు పల్లి శశిధర శర్మ న్నారు. ప్రశ్న తోనే ప్రపంచం తెలుస్తుందని పిల్లలు ప్రశ్నించడం నేర్చుకోవాలని ప్రశ్నించినప్పుడే శాస్త్రీయ దృక్పథం అలవాటు అవుతుందని మరొక ఉపాధ్యాయ సంఘం నేత తుమ్మ కన కయ్య అన్నారు. పదవి విరమణ చేస్తున్న అన్నవరం సుజాతని హైదరాబాదు నుండి ప్రతిరోజు ఆమె బస్సులో వచ్చే ఆర్టీసీ బస్సు డ్రైవర్ కండక్టర్లతో పాటు ప్రయాణికులు కూడా బస్సు లోనే సన్మానించడం దీనికి ఒక మంచి ఉదాహరణ అని మరొక ఉపాధ్యాయుడు రాంప్రసాద్ అన్నారు. తాను పాఠాలు బోధించేటప్పుడు పిల్లల శాస్త్రీయ దృక్పథంతో పాటు హేతువాద దృక్పథాన్ని అలవర్చే ప్రయత్నం చేశానని దానివల్ల జీవితంలో వారు కష్టాలకు వెరవకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళతారని సన్మాన గ్రహీత అన్నవరం సుజాత అన్నారు. హైస్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన లు ఆహూతులను ఆకట్టుకున్నాయి.



# నెల్సన్ మండేలా ప్రమాణాలకు నిలువెత్తు నిదర్శనం రామారెడ్డి జీవితం

## డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

***'నెల్సన్ మండేలా ఒక మాట చెబుతుండేవారు – ఎంతకాలం బతికామన్నది కాదు, ఎంతమంది జీవితాల్ని దీర్ఘకాలంలో ప్రభావితం చేశామన్నది మన జీవిత సాఫల్యతకు, గొప్పతనానికి గీటురాయి. మామిడి రామారెడ్డి గారిది అటువంటి సుసంపన్న జీవితం. వారి జీవితం నిండా ఎంతో స్ఫూర్తి, ఎన్నో పాఠాలు, మరెన్నో సాఫల్యతలు' అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు***


హైదరాబాద్ బంజారాహిల్స్ ఎల్.వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో కల్లం అంజిరెడ్డి ప్రాంగణం, గుళ్లపల్లి ప్రతిభారావు భవనంలోని పటోడియా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో జేపీతోపాటు పలువురు లోక్‌సత్తా భావజాలురు, పౌర ప్రముఖులు రామారెడ్డి స్మృతికి అంజలి ఘటించారు. రామారెడ్డి కృషిని వివరించే సవివర ప్రజంటేషన్, ఆయన నెలకొల్పిన సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళా నేతలు మాట్లాడారు. **ఈ కార్యక్రమంలో జేపీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు:**

'రామారెడ్డి గారితో నాది 45 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం. మా మధ్య ప్రగాఢ అనుబంధం ఉన్నా, ఎక్కువగా మాట్లాడుకున్న సందర్భాలు తక్కువ. కానీ ఇద్దరి మనసుల్లో ఏముందో ఒకరికొకరికి మరుక్షణం తెలిసేది. సుమారు నాలుగున్నర దశాబ్దాల క్రితం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముల్కనూరులో వారి పరిచయం. ఆ ఊరి సహకార బ్యాంకును లాభాల్లోకి తీసుకెళ్లి చుట్టుపక్కల గ్రామాల రైతులకు, ప్రజలకు సంఘటిత శక్తి బలం ఎంతో తెలియచేసిన విశ్వనాథరెడ్డి గారు నాకు ఆప్తులు. వారు త్వరగా కాలం చేశారు. అదేవిధంగా భోజిరెడ్డి గారు నాకు ఆప్తులు. భోజిరెడ్డి గారు, రామారెడ్డి గారు తండ్రీకొడుకులని నాకు తర్వాత తెలిసింది. భోజిరెడ్డి గారి గురించి చాలామందికి తెలిసి ఉండక పోవచ్చు. స్వతంత్ర పోరాటం, నిజాం పాలన కాలంలో వారు ప్రజాజీవితంలో ఎంతో కృషి చేశారు. హైదరాబాద్ జిల్లా పరిషత్, సహకార బ్యాంక్ అధ్యక్షునిగా ఎంతో నిజాయతీగా, నిబద్ధత, సామర్థ్యాలతో సేవలందించారు.



ఒక వ్యక్తిగా, సంస్థల నిర్మాతగా, ప్రజాస్వామ్య విలువల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తిగా.. రామారెడ్డి గారు చిరస్మరణీయులు. ఈ మూడింటినీ ఆయన కలిపేశారు. అలా పదుల వేలమంది మీద ప్రభావం చూపిన వ్యక్తులు అరుదు. అటువంటి వ్యక్తే మన ముందు కూర్చున్న డాక్టర్ జీఎన్ రావు గారు. చాలా అరుదైన ప్రభావం అది. జనాభా లెక్కల కోసం ఉండటం కాకుండా..మన జీవితకాలంలోనూ, ఆ తర్వాతి తరాల్లోనూ వేలమంది జీవితాలపై సానుకూల ప్రభావం చూపారు.

రామారెడ్డి ఒక వ్యక్తిగా చాలామందికి తెలిసినవారే. సభ్యత, సంస్కారం, స్నేహ స్వభావం ఉట్టిపడే మనిషి. ఇతరుల అవసరాల్ని, సందర్భాన్ని గుర్తించి సాయం చేసే వ్యక్తి. నేను






లోక్‌సత్తా ప్రారంభించినప్పుడు, అడగకుండానే నాతోపాటు ఢిల్లీ వచ్చారు. పదిమందినీ కలుద్దామని. మార్క్ టుల్లీ ఆ రోజుల్లో బీబీసీ ప్రతినిధిగా ఇండియాలో పనిచేస్తుండేవారు. ఎంతో సుప్రసిద్ధ, గౌరవనీయ, పరిణతిగల కరస్పాండెంట్. వారిని, నాకు అంతకు ముందే పరిచయమున్న రాజ్ మోహన్ గాంధీ మొదలైనవారితో కలిసి చర్చించాం. హైదరాబాద్‌లో ఎఫ్.డి.ఆర్ ఆఫీసు కోసం నేను, అశోక్ గారు పంజాగుట్ట నిర్మల్ టవర్స్‌కి వెళ్తుంటే రామారెడ్డి కూడా వచ్చారు. మాకు వయసులో ఎంతో తేడా ఉంది. అటువంటి పట్టింపు లేకుండా సాయం చేశారు. ఒక సంస్థ నిర్మాణంలో ఆయన్ని మించినవారు లేరు. సీడీఎఫ్ థింక్ ట్యాంక్ కావచ్చు, సహ వికాస మహిళా సాధికారత సంఘం కావచ్చు. ఇందిరా సేవా సదన్, సంగం లక్ష్మీబాయ్ ట్రస్ట్ సేవలు ఎంత అద్భుతమైనవో సంధ్య గారు వివరించి చెప్పారు.ఎఫ్.డి.ఆర్ నిర్మాణంలో ఒక సోదరుడిగా, సహచరుడిగా అండగా నిలిచారు. అదేవిధంగా, లోక్‌సత్తా ఉద్యమంలో. రాజ్యాంగబద్ధత, వ్యక్తి స్వేచ్ఛ పట్ల ఎంతో లోతైన అవగాహన కల వ్యక్తి రామారెడ్డి. సహకార సంఘాలు అనేది కాకతాళీయం కావచ్చు. కానీ లక్ష్యం స్వేచ్ఛ. పౌరులు వర్సెస్ రాజ్యం. ఆ రెంటి మధ్యా హక్కులు, విధులు ఎలా ఉండాలో ఆయనకి ఎంతో మంది కంటే చాలా స్పష్టత ఉంది.

నాకు జీవిత చరిత్రలు చెప్పటం అంతగా అబ్బని గుణం. సాధారణంగా అలాంటి విషయాలు ప్రస్తావించను. రామా రెడ్డి గారి గురించి కదలాడుతున్న కొన్ని అప్రయత్న జ్ఞాపకాల్ని మాత్రం ప్రస్తావిస్తాను.

కాకతాళీయంగా నన్ను ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు ఎం.డిగా ఆనాటి ముఖ్యమంత్రి నియమించారు. బ్యాంకు చాలా క్షీణస్థితిలో ఉంది. వంద రూపాయలు అప్పిస్తే, రూ.8 తిరిగొచ్చేది. రూ.92 నష్టం అంటే ఇక బ్యాంక్ ఏముంది? భారతదేశం మొత్తం మీద అత్యధిక నష్టాల్లో కూరుకుపోయిన బ్యాంక్ అది. నేను కొంత లోతుగా అధ్యయనం చేసి సహకార సంఘాల కమిషనర్ వద్దకు వెళ్లాను. భలే రావుగారికి ముందు పనిచేసిన అధికారి వారు. నిజాయతీపరుడు, మంచివ్యక్తి. బ్యాంక్‌లో ఏమిటి సమస్య, ఏం చేస్తే పరిష్కారం సాధ్యం.. అని నేను అరగంట ప్రజంటేషన్ ఇచ్చాక ఆయన తాపీగా, 'అంతా అద్భుతంగా ఉంది జయప్రకాష్, కానీ నేను చేయను' అన్నారు. 'అదేంటండీ, లోపాలుంటే చెప్పొచ్చు. అంతేగానీ, అంతా బాగుంది చేయను అంటే, నాకు అర్థం కావటం లేదు' అన్నాను. 'ఇవన్నీ జరిగే పనులు కావు' అని ముక్తాయిం చారు. 'మరి నేనెందుకు ఆ సీట్లో' అన్నాను. 'మంచి కారు ఇచ్చారు. హాయిగా లైఫ్ ఎంజాయ్ చెయ్యి' అని సలహా ఇచ్చారు. 'క్షమించండి, పొరపాటు చేశాను, మీ సమయం వృధా చేశాను. మళ్లీ ఎప్పుడూ చేయను' అని చెప్పి వచ్చేశాను. ప్రసాద్ గారిని, ఇతర సీనియర్ అధికారులను పిలిచి,'సహకార సంఘ కమిషన్ గురించి, చట్టం గురించి మర్చిపోండి. ఆ ప్రస్తావనతో ఫైల్ వస్తే, మరుక్షణం రద్దు చేస్తా (డీయాక్ట్)' అని చెప్పాను. అప్పట్నుంచి రెండున్నరేళ్ల పాటు ఆర్.బి.ఐ నిబంధనలు, బ్యాంకుల నియంత్రణా చట్టం పరిధిలోనే పనిచేశాం. ప్రభుత్వంవారు చేసిందేమీ లేదు. కానీ, రామా రెడ్డి గారు సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి ఎందుకంత ప్రాధాన్యతనిచ్చేవారో, ఎందుకు అన్నిసార్లు చెప్పేవారో నాకు అప్పుడు పూర్తిగా అర్థమైంది.

తర్వాత ఎన్.టి రామారావు ప్రభుత్వం వచ్చింది. సహకార శాఖకి మంత్రిగా ఎవరిని నియమిద్దాం? అని నన్ను అడిగారు. దేవేందర్ గౌడ్ గారి పేరు చెప్పాను. 'ఆయన మద్యనిషేధ శాఖ చూస్తున్నారు. అదే చాలా పెద్ద పని. దానికి, సహకార శాఖకి




సంబంధం లేదు గదా' అని రామారావు గారు అన్నారు. 'దేవేందర్ గారు జెడ్.పి ఛైర్మన్ గా మంచి కృషి చేశారు. ప్రభుత్వం పాత్ర మితిమీరకూడదు అనే స్పష్టత ఆయనకు ఉంది. ప్రజలకు స్వేచ్ఛ ఉండాలని నిజాయతీగా నమ్మే వ్యక్తి' అని వివరించాను. సరే అన్నారు. సహకార, వ్యవసాయ శాఖ కార్యదర్శిగా ఎవరు అనే ప్రశ్న వచ్చింది. సంపత్ గారు అన్నాను. ఎందుకు అని అడిగారు. 'గతంలో ఆయన సహకార బ్యాంకు ఎం.డిగా చేశారు. అక్కడ ప్రభుత్వ అనవసర జోక్యం వల్ల కష్టనష్టాలేంటో ఆయనకు అనుభవం ఉంది' అన్నాను. అలా సంపత్, భలే రావు వచ్చారు. వారు కాకతాళీయంగా రాలేదు. ప్రభుత్వంలో ఎన్.టి.ఆర్ వ్యూహంతో చేశారు. ఆ తర్వాత రామారెడ్డి గారి అధ్యక్షతన కమిటీ వేశాం.

అప్పుడు ఎన్.టి.ఆర్ ఒక మాట అన్నారు. ఒక గొప్ప మనిషి తప్ప ఎవరూ అలా అనలేరు. 'నాది మొద్దు బుర్ర జయప్రకాష్ గారూ. సహకార చట్టాన్ని మారిస్తే నిజంగా ప్రజలకు మంచి జరుగుతుందా?' అని అడిగారు. 'ఈ చట్టం మార్చి ప్రభుత్వ అనవసర జోక్యం లేకుండా చేస్తే తప్ప ఉపయోగం లేదు. సభ్యులుగా ప్రజలు బాగా చేసుకుంటే, బాగుపడతారు. అసమర్థంగా వ్యవహరిస్తే వాళ్లే నష్టపోతారు. కానీ ప్రభుత్వం మాత్రం పెత్తనం చేయకూడదు' అన్నాను. 'కరెక్టే' అన్నారు. ఎన్.టి.ఆర్ సరే అనగానే, కురియన్ గారిని తీసుకొచ్చాం. ఆ సహకార ప్యానల్ లో ముగ్గురు సభ్యులుగా ఉన్నారు. అదృష్టవశాత్తూ, ముగ్గురూ నాకు సన్నిహితులే. మోహన్ ధారియా, ఎల్.సి జైన్, కురియన్. వీరిలో కురియన్ నేను ఎంతో గౌరవించే మెంటార్. అలా దేశంలో మొదటిసారిగా తెలుగునాట 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టం వచ్చింది. ఆ తర్వాత అదే ఒరవడిలో 97వ రాజ్యాంగ సవరణను సాధించి వర్గీస్ కురియన్ బతికుండగానే ఆయనకు గురుదక్షిణగా సమర్పించాను.

నేను ఎన్.ఏ.సిలో ఉండగా, మ్యాక్స్ చట్టం గురించి కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. రాజకీయ జోక్యం కోసం రకరకాల ప్రయత్నాలు జరిగాయి. నేను అధ్యక్షురాలికి సమస్య వివరించాను. ఆమె చాలా శ్రద్ధగా విని, ఆ చట్టం ఎట్టిపరిస్థితిలో మార్చటానికి వీల్లేదు  అని స్పష్టంగా చెప్పారు. దాంతో, ఆ చట్టాన్ని మార్చే సాహసం చేయలేక, ఆ పరిధిలోకి పాల సంఘాలు రావని మార్పు చేశారు. అంటే చట్టం మార్చినట్లు కాదు. నేను గట్టిగా నిలదీయటంతో ప్రభుత్వం ఒక వివరణ ఇచ్చింది. మరింత సమర్థంగా సహకార సంఘాలు పని చేయటానికి వీలుగా ఈ సవరణ చేశామన్నారు. కానీ ఆచరణలో జరిగిన పరిణామాలు వారి కపట రాజకీయాన్ని పట్టిచ్చాయి. ముఖ్యమంత్రి గారి సొంత జిల్లా కడపలో డెయిరీ ఒక్క లీటరు పాలు సేకరించకుండా మూతపడింది. అదేవిధంగా ప్రతిపక్ష నేత సొంత జిల్లా చిత్తూరులో డెయిరీ మూతపడింది. ఒక్క లీటరు పాలసేకరణ లేదు. సహకార మంత్రి గారిది గోదావరి జిల్లా. పాడిపంటలకు పెట్టింది పేరు. అక్కడా ఒక్క లీటరు సేకరణ లేకుండా ప్రభుత్వ డెయిరీ మూతపడింది. అవన్నీ అంతకుముందు చాలా సమర్థంగా పనిచేసే డెయిరీలు. రాజకీయ జోక్యం వాటిని దివాళా తీయించింది. నేను ప్రచారరథంలో ఆ మూడు జిల్లాల్లో నడిబొడ్డున వారిని నిలదీసి తిట్టిన తిట్టు తిట్టకుండా ప్రశ్నించాను. ఏం చేయాలో వారికి అర్థం కాలేదు.

ఆ తర్వాత నేను, రామారెడ్డి ఢిల్లీ వెళ్లాం. నాకు శాంతిభూషణ్ పరిచయం. రాయ్ బరేలీ ఎన్నికకు సంబం ధించి రాజ్ నారాయణ్ కేసు వాదించారాయన. ఆ తర్వాత జనతా ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రి చేశారు. నాకు ఎమర్జెన్సీ పట్ల వ్యతిరేకత, జనతా పట్ల మక్కువ కారణంగా వారితో పరిచయం ఏర్పడింది. ముందు ప్రశాంత్‌కి ఫోన్ చేశాను. 'మీరు అడ్వొకేట్ ఆన్ రికార్డుగా ఉండండి. శాంతిభూషణ్ చూసుకుంటారు' అన్నాను. ఆయన ఒప్పుకున్నారు. ఈ క్రమంలో, శాంతిభూషణ్ నన్ను భోజనానికి పిలిచారు. కేసు వివరాలు చెప్పినాక, వాదించటానికి అంగీకరించారు. భోంచేస్తూ, సహకార సంఘాల గురించి ఆయన అభిప్రాయం అడిగాను. 'అబ్బే, అవి అక్రమాలకు అడ్డాలు. వాటిని నియంత్రించాల్సిందే' అన్నారు. 'మీరు నాకు లాయర్‌గా పనికిరారు' అన్నాను. ఆయన ఖంగుతిన్నారు. 'నేను దేశంలోనే లీడింగ్ లాయర్ ని. ఆషామాషీగా టైమివ్వను. అలాంటిది, మీతో కలిసి భోంచేస్తుంటే, మా ఇంట్లోనే ఆ మాట అంటారా?' అన్నారు. 'ఈ విషయంలో మీకు రాజ్యాంగం గురించి తెలియదు, సారీ' అన్నాను. మొత్తానికి ఆయనా సరే అన్నారు. ప్రశాంత్ మాత్రం అడ్వకేట్ ఆన్ రికార్డ్‌గా కొనసాగారు.



తర్వాత పీపీ రావు గారిని కలిశాం. ఆయన అంతకుముందు లోక్‌సత్తా తరపున నేరచరిత్ర సహా అభ్యర్థుల వివరాలను బయట పెట్టాలనే కేసును వాదించారు. గెలిచాం. సహకార సంఘాల స్వతంత్ర ప్రతిపత్తి కేసు వాదించటానికీ సంతోషంగా ఒప్పుకున్నారు. చివరికి నెగ్గాం.

రామారెడ్డి గారి సెంట్రల్ ఫిలాసఫీ – పౌరుల స్వేచ్ఛ. అందుకు సహకార సంఘాలు ఒక ఏర్పాటు మాత్రమే. సంఘాల పటాటోపం కన్నా, ఆయన ఆలోచనంతా అందులో సభ్యులుగా ఉన్న రైతులు, ఇతర ప్రజలు వారి సాధికారత గురించే. 'అవసరం ఎవరికి ఉందో, అధికారం వారి దగ్గర ఉండాలి. ప్రభుత్వం బోడి పెత్తనం ఉండకూడదు. ప్రభుత్వం అంటే రాజు కాదు, దైవాంశసంభూతుడు కాదు. ప్రభుత్వం మన సేవల కోసం, మన ఉమ్మడి అవసరాల కోసం తప్ప.. నెత్తినెక్కి తొక్కటానికి కాదు' అని చాలా స్పష్టత ఉందాయనకు. అది చాలామంది ఐఏఎస్, ఐపీఎస్ తదితర సివిల్ సర్వెంట్లకే అర్థం కాలేదు. పలువురు రాజకీయ నాయకులూ గ్రహించ లేకపోయారు. రాజకీయ నాయకులు ఉన్నతాధికారుల నుద్దేశించి – 'మేం పబ్లిక్, మీరు పబ్లిక్ సర్వెంట్లు. అంటే మా సర్వెంట్లు' అనటం నేను చాలా సందర్భాల్లో విన్నాను. అంతకుమించి అవగాహనలేని ఒక విచిత్ర వ్యవస్థలో.. ఓటు వేయటం, అరవటం తప్ప మరేమీ తెలియని వ్యవస్థలో ఉన్నాం.

ఈవేళే స్విట్జర్లాండ్ నుండి ఒకతను వచ్చారు. వారి తండ్రి గారు క్యాన్సర్‌తో బాధపడుతూ కూడా లోక్‌సత్తాలో సేవలం దించారు. 'బసవపున్నయ్య గారూ, మీరు కుటుంబంతో గడపండి' అంటే 'పంపకండి సార్, ఇక్కడ పనిచేయటం వల్ల నా జీవితకాలం అయిదేళ్లు పెరిగింది' అనేవారు. ఎంత మంది త్యాగాలతో ఈ దేశ నిర్మాణం జరుగుతుందో చెప్పటానికి ఓ ఉదాహరణ. వారి కుమారుడు వచ్చి, స్విట్జర్లాండ్‌లో ప్రజా స్వామ్యం ఎలా పనిచేస్తోందో చెబు తుంటే.. ఇది కలా, నిజమా అనిపిస్తుంది. మనం ఇంకా ఎంతో దూరం ప్రయాణిం చాల్సుంది. రామారెడ్డి గారు ఒక మార్గం చూపారు. కొన్ని మెట్లు వేశారు. కానీ ఈ దేశంలో రాజ్యాంగ ఫలాలు సామాన్యులకు అందాలంటే, ఇంకా చాలా చాలా చేయాల్సి ఉంది. **దేవరకొండ బాలగంగాధర్ తిలక్ ఒక కవితా సంకలనంలో అన్నారు**

**–'ఈ దేశం గజానికో గాంధారి పుత్రుడున్న విచిత్ర సౌధం, ఈ దేశం కడుపునిండా తిండి, గుండె నిండా ఆహార్యం, బతుకంతా కాస్తంత స్వతంత్రం ఉంటే చాలనుకునే నిర్భాగ్యులు కోటానుకోట్లుగా ఉన్న దేశం'.** ఆనాడు జనాభా 40 కోట్లు, ఈవేళ 146 కోట్లు. అంతే తేడా. ఇంకా ఈ దేశంలో ప్రజలకు స్వేచ్ఛ అంటే ఏమిటో తెలియకుండా, ప్రజాస్వామ్య నిర్మాణం చేస్తున్నాం. లోపభూయిష్ట నిర్మాణం. కొన్ని రకాలుగా దేశంలో అద్భుతాలు జరుగుతున్నాయి. కొన్ని రకాలుగా పరాధీనుల్ని చేస్తున్నాం, బానిసత్వంలోకి నెట్టేస్తున్నాం. రామా రెడ్డి గారి లాంటి వారు చేసింది బానిసత్వం నుండి స్వేచ్ఛకు, విముక్తికి పోరాటం.

కొందరి పోరాటం వ్యక్తిగతంగా ఉంటుంది, కొందరి పోరాటం వ్యవస్థాగతంగా, రాజ్యాంగపరంగా ఉంటుంది. రామారెడ్డి గారిది వ్యవస్థాగత, రాజ్యాంగ లక్ష్యాల కోసం పోరాటం. అందుకే మట్టిలోని మాణిక్యాలను వెలికితీశారు. వారు స్థాపించిన సంస్థల్లో మహిళల చైతన్యాన్ని చూస్తే, 30–40 ఏళ్ల క్రితం ఎలా ఉన్నారో, ఇప్పుడెలా ఉన్నారో నేపథ్యాన్ని పరి శీలిస్తే.. వారిలో ఎంతటి ప్రతిభాపాటవాలు దాగి వున్నాయో, ఎంతగా వారిని అణచివేశామో, అవకాశం ఇస్తే వారు ఎంత గొప్పగా తమ జీవితాల్ని, సమాజాన్ని చక్కదిద్ద గలరో అర్థమ వుతుంది. బహుశా రామారెడ్డి గారి జీవితంలో అన్నిటికంటే గొప్ప అంశం ఇదే. మట్టిలో దాగున్న మాణిక్యాల్ని వెలికి తీశారు. పేటికాంతర రత్నాల్ని రాళ్లుగా వదిలేయకుండా, సానబట్టి, సూర్యకాంతిని ప్రసరింప చేసి కాంతులీనేలా చేశారు. ఈ దేశంలో ప్రతి బిడ్డకూ, ఏ తల్లి గర్భాన పుట్టినా వివక్ష లేకుండా అవకాశాలను ఇవ్వటం, ఆత్మగౌరవాన్ని కలిగించటం, నివారించదగ్గ క్లేశాల్ని తొలగించటం స్వతం త్రానికి, ప్రజా స్వామ్యానికి అర్థం. అందుకు స్ఫూర్తినిచ్చిన రామారెడ్డి గారికి మీ అందరి తరపునా నమోవాకాలు అర్పి స్తున్నాను. మనుషులు ఎల్లకాలం మనతో ఉండక పోవచ్చు. కానీ నెల్సన్ మండేలా చెప్పిన ప్రమాణాల్లో ఎంతోమంది జీవి తాల్ని దీర్ఘకాల ప్రభావితం చేసిన రామారెడ్డి చిరస్మరణీయులు, చిరంజీవి.

❖

# PREAMBLE ( ప్రాదేశిక )

## WE, THE Jugaad Voters OF INDIA, On the occasion of Azadi ka Amrit Mahotsav having solemnly resolved:

To establish a financially self-sustainable MODEL POLITICAL SYSTEM [MPS] (temporarily termed as Jugaad Party) based on the proposed Party's founding principles of "COOPERATION BASED ON TRUST" in order to enable all the Law Abiding Voters with good normal character and political integrity, who are registered with Election Commission of India under the Sovereignty of our SOCIALIST SECULAR DEMOCRATIC CONSTITUTION, every word there in pleasantly and meaningfully defined in the MPS manifesto, to participate in a conflict-free good governance to the citizens of India, in a peaceful and transparent manner. Corruption free Jugaad Voters irrespective of their own individual ideologies shall collectively run the proposed party with their own funds, with declared rules of decentralised power and expenditure for the common benefit of citizens, within the Party, and in all collective daily public activities involving other political parties.

On this auspicious day the 26th November 2021 we THE Jugaad Voters OF INDIA, HEREBY ADOPT, IMPLEMENT AND OWN TO OURSELVES THIS Jugaad Party Constitution.

## జుగాడ్ ఓటర్ల 50:50 రాజకీయ సంకల్పం !

మనరాజ్యాంగమే మన సర్వజన రక్ష. దానిప్రకారం, శాంతియుత "రహస్య ఓటింగుపద్ధతి" లో ఎన్నుకునేవాడూ, ఎన్నుకోబడినవాడూ ఇద్దరూ ఓటర్లే. "లౌకికవాద ప్రజాతంత్ర సామ్యవాదం" (Secular Democratic Socialism), అనగా, అంతర్గత ప్రజాస్వామ్యంతోకూడిన, స్వజాతీయ స్వాధికార స్వపరిపాలన. "జుగాడ్ ఓటర్లచే నిర్వచించబడిన మెజార్టీపాలన". నిర్వహణ ఖర్చులనిమిత్తం ఓటర్లు వారియొక్క ఆర్థిక స్తోమతను బట్టి ఒకేసారి పార్టీకి ఇచ్చే విరాళం 2 వేలు, లేదా 5 వేలు, లేదా 10 వేల రూ.ద్వారా మాత్రమే "జుగాడ్ పార్టీ" లో ప్రవేశం. తాము స్వీకరించిన పనికి తగ్గ తాత్కాలిక నేతృత్వాధికారం ఉంటుంది. ఎవ్వరికీ అధినేత హెూదా ఉండదు. సందర్భోచితంగా అనుసంధానకర్తలకు 3 ఓట్లతో వీటోహక్కు ఉంటుంది. MLA నియోజకవర్గం నుండి గ్రామ సర్పంచి వరకూ నిధులు, బాధ్యతలు, జవాబుదారీతనం ప్రాతిపదికగా జుగాడ్ ఓటర్ల పర్యవేక్షణలో స్వయంపాలనాధికారం.

ఏ పార్టీ అభ్యర్థి అయినా, ఎన్నికల సమయంలో ఓటర్లంతా సమానమే, కాబట్టీ ఓట్ల వ్యాపారం జరగదు. జుగాడ్ పార్టీ అభ్యర్థిని చూడగానే జనాలు గుర్తుపడతారు. కండువాలుండవు, కటౌట్లుండవు, ఫ్లెక్సీలుండవు. ఈపార్టీలో నేరచరితులకు B-Form లభించదు. ఈపార్టీ అభ్యర్థులందరూ గెలుపు గుఱ్ఱాలే. ఎవర్నిఎన్నుకుంటారో ఓటర్ల ఇష్టం. ఎన్నికలనిమిత్తం చేసే ఖర్చు ఎన్నికలకమిషన్ పరిమితికి మించేప్రసక్తేలేదు. గ్రామస్థాయినుండీ ఎక్కడికక్కడ ఆర్థికవనరుల వికేంద్రీకరణతో పారదర్శకంగా జరగవలసిన అధికారవికేంద్రీకరణ - "చట్టబద్ధ సుపరిపాలన ద్వారానే" సాధ్యం. దానికోసం కనీసం 100 మంది, "భావజాలాల సంకెళ్ళనుండీ విముక్తిచెందిన" చిత్తశుద్ధిగల, కార్యకర్తల/జుగాడ్ ఓటర్ల నిధులతో, వినూత్నమైన ఆలోచనతో, ఒక జాతీయ రాజకీయ పార్టీ వ్యవస్థ కేంద్ర ఎన్నికల కమిషన్ నియమావళితో నిర్మించడమే - జుగాడ్ ఓటర్ల ఉద్యమ ప్రాథమిక సంకల్పం!

**M.Parthasarathy (9866416798) &**
**25 other Jugaad Voters READY with Rs 1 lakh starting Fund.**

Advt.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Jugaad Bharat United Voters December 2025

Simplifying Democracy - Strengthening Unity among voters

**ఓటు మనది. పార్టీ మనది. డబ్బు మనది. అధికారం మనది.**

**పనిచేయని ప్రభుత్వాన్ని గద్దె దింపే అధికారం కూడా మన చేతుల్లోనే ఉంది!**

**అదే జుగాడ్ 50:50 రాజనీతి**

☆ ధనమూలమిదం జగత్. ఎవ్వరికీ ఏదీ ఉచితంగా రాదు అని మీకూ తెలుసు. నాకూ తెలుసు. కానీ మనం డాక్టర్ అంబేద్కర్ పెట్టిన రహస్య ఓటింగ్ విధానాన్ని మనసా వాచా కర్మణా ఆచరించలేక పోతున్నాం! అందుకే (నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం) మనమధ్య అత్యవసరం!

☆ ఈమధ్యనే మన ఉద్యమానికి జుగాడ్ ఓటరుగా విరాళమిచ్చిన శ్రీ CV రత్నం గారికి స్వాగతం! మేధావి వర్గానికి చెందిన ఈ సీనియర్ సిటిజన్ రత్నం (విశ్రాంత ఇంజనీరు) గారికి పొలిటికల్ పార్టీల వ్యవస్థీకృత అవినీతి వ్యవహారాలపై నమ్మకం లేదు. మనం తలపెట్టిన ఆచరణ-యోగ్యమైన చట్టబద్ధపాలనతో కూడిన సుపరిపాలన కోసం బాధ్యత గల పౌరునిగా, వారిచ్చిన రూ. 2500 donation ధన్యవాదాలతో స్వీకరిద్దాం!

☆ 25 మంది జుగాడ్ ఓటర్లతో, డిసెంబర్ 2021 జనబలం మాసపత్రికలో ప్రతిపాదించిన వివరణాత్మక ద్విపక్ష పార్టీయొక్క మౌలిక-రాజ్యాంగ సూత్రాలు నేడు 50 మందికి నచ్చాయి! 25 నుండి 60 సంవత్సరముల వయస్సు కలిగిన యువతీ-యువకులందరికీ ఇదే మా ఆహ్వానం! Cooperation based on mutual trust (నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం) అనే ధ్యేయంతో మీ కోసం, మీ పిల్లల భవిష్యత్తు కోసం ఒక ప్రయత్నం చేద్దాం రండి!

☆ ఓటర్లే అవినీతిలేని-పార్టీ నిర్మించుకుని పారదర్శకంగా నిర్వహించుకోవాలి. పదవులకోసం కీచులాడుకోకూడదు. ఓటర్లలో పాలకవర్గం, పాలితవర్గం అని రెండేరెండు సమూహాలున్నాయి ! మిగతా పొలిటికల్ పార్టీలు చేసిన మంచిని మెచ్చుకోవాలి. వారిని ఊరికే విమర్శించరాదు. జుగాడ్ ఓటరుగా జీవితంలో ఒకేసారి కనీసం రూ. 2,000 విరాళమిచ్చి మీ బాధ్యత మీరు తీసుకోండి.

**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు : (Rs/-10,000 donors)

**Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)(11)KOTIKALAPUDI TARAKESH**

జుగాడ్ ఓటర్లు : **Sarvasri (1) JVL. NARAYANA (Nellore AP) (2) S.D.BABU (Tamilnadu) (3) T.SURYANARAYANA (Vizag AP) (4)Smt.D. SUBHADRA (5) M.RANGA RAO (6) M.SAI SUBBARAO (7) Smt.D.JANAKI (8) J.VENKATA RAO (Vijayawada AP) (9) P.NARASIMHA RAO (10) SAI SURYANARAYANA (Karnataka) (11) MSS KUMAR (12) Dr.U.V.KRISHNA MURTHY (13) M.RAMA RAO (14) NANDAN SRIDHAR (15) Smt.K.RAJESWARI (16) Smt.K.LAKSHMI (17) Justice CHANDRAKUMAR (18) K. VASUDEVA RAO (19) NARAGONI (20) D.KONDALA RAO (21) M.S. Narayana Rao (22) Sriram (Amalapuram AP) (23) P.Sunil (Bhimavaram AP) (24) Amaranath (25) B.Poorna Kumar Das (26) KHS Sarma (27) Metta Ramarao (Vizag, AP) (28) IR Rao (29) S Madhavarao (30) DRK Rao (31) Smt.P Amulya (32) pallela Devaraju (33) YSN MURTY (Kakinada, AP) (34) DV KOTESWARA RAO (35) Santosh Eeraveni (36)Somanchi Radhakrishna 37) C.V.Ratnam.**

advt

# మార్కెట్ పిల్లలు VS స్కూలు విద్యార్థులు



2025లో పాఠశాల విద్యపై నాలుగైదు కీలక సర్వేలు ప్రభుత్వ, ప్రయివేటు పరంగా వెలువడ్డాయి. అసర్-2024 ప్రయివేటు సర్వే. ప్రథమ్ అనే సంస్థ 2004 నుండి, ముఖ్యంగా గ్రామీణ భారతదేశంలో జరుగుతోంది. యూనియన్ విద్యాశాఖ నిర్వహించే జాతీయ ఎచీవ్ మెంట్ సర్వే స్థానంలో ఈ ఏడాది నుండి 'పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్' పేరుతో నివేదికను వెలువరిస్తున్నారు. ఆ నివేదికతోపాటు పీజీఐ 2.0, జాతీయ శాంపిల్ సర్వే ఈ సంవత్సరం విడుదలయ్యాయి. అసర్ సర్వే విడుదలవుతున్న గత ఇరవై ఏళ్లలో ఈ ఏడాదే అత్యధిక మెరుగుదల నమోదైంది. జాతీయ విద్యావిధానాన్ని అనుసరించటం వల్ల ఈ ఫలితాలు మెరుగయ్యాయని నిర్వాహకులు విశ్లేషించారు. పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్, పీజీఐ 2.0, జాతీయ శాంపిల్ సర్వే కూడా ఇదే అభిప్రాయాన్ని, అంటే, గతం కంటే కొద్దిగా మెరుగు అని పేర్కొన్నాయి. ఈ వివరాలన్నిటినీ 'జనబలం' సంచికల్లో సంక్షిప్తీకరించి ప్రచురించాం. అసర్ తాజా సర్వే ప్రకారం.. మూడవ తరగతిలో కనీస స్థాయి తీసివేత చేయగల విద్యార్థుల సంఖ్య 33.7% గా ఉంది. 5వ తరగతిలో భాగాహారం చేయగల పిల్లలు 30.7%, ఎనిమిదవ తరగతిలో అంకగణిత సామర్థ్యం గల విద్యార్థుల సంఖ్య 45.8%. కాస్త మెరుగైనా పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంది కాబట్టే.. తెలుగు రాష్ట్రాల్లో 14-18 ఏళ్ల మధ్య కౌమార బాలల్లో దాదాపు 50 శాతం మంది గడియారం చూసి నిమిషాలు సహా టైమ్ చెప్పలేరని, పలువురు మార్కెట్‌లో కూరగాయలు తూకం వేయలేరని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తన వాచీ చూపిస్తూ పదే పదే చెబుతుంటే ఆ వీడియోలు చూసేవారికి, ప్రసంగాలు వినేవారికి బోర్ కొట్టవచ్చేమోగానీ, సమాజంలో మార్పుకి అది చాలా అవసరం. సుప్రసిద్ధ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి అన్నట్లు, ఒక లోపాన్ని సరిదిద్దేదాకా ఆ సమస్యలోని అంశం మనకు అర్థంకానట్లే లెక్క.. ఈ కోవలోనే మరో సర్వే ఓ కీలకమైన విభిన్నాంశంతో పట్టణ ప్రాంతానికి సంబంధించి పాఠశాల విద్యపై కొన్ని నెలల క్రితం వెలువడింది.

2019లో నోబెల్ బహుమతి గెలుచుకున్న ఆర్థికవేత్తలు అభిజిత్ బెనర్జీ, ఈస్తర్ డుఫ్లోతో పాటు కొందరు ఎం.ఐ.టి ప్రొఫెసర్లు, హార్వర్డ్ కి చెందిన సైకాలజీ ప్రొఫెసర్, కోల్‌కతా ఐఐఎంకు చెందిన విద్యావేత్త, ఓ మహిళా జర్నలిస్టు, న్యూయార్క్ విశ్వవిద్యాలయానికి చెందిన అప్లయిడ్ సైకా లజీ, ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు ఈ అధ్యయన బృందంలో ఉన్నారు. వీరు చేసిన సర్వే గణితానికిబీ కోల్‌కతా, ఢిల్లీ మహానగరాలకే పరిమితమైనదిగానీ, సాదాసీదాగా కనిపించేదేగానీ.. చాలా ఆసక్తికరమైనది, విలువైనది.

ఈ సర్వేలో పాల్గొన్న పిల్లలు ఎక్కువమంది 13, 15 ఏళ్ల వయసువారు. గరిష్ఠ వయోపరిమితి 17 ఏళ్లు. వీరిలో కొందరు ప్రస్తుతం స్కూల్ లో చదువుతూనో, గతంలో 7, 8 తరగతులు చదివి ఆపివేసో మార్కెట్‌లో రిటైల్ చిరు వ్యాపారాలు చేస్తున్నవారు. ఇంకొందరు ఎటువంటి మార్కెట్ లావాదేవీలతో సంబంధంలేకుండా స్కూల్‌లో చదువుకే పరిమితమైనవారు.

వీధి వ్యాపారాలు చేసే పిల్లలు సంక్లిష్ట మార్కెట్ లెక్కల్ని కూడా మనసులోనే గణించుకొని అలవోకగా, క్షణాల్లో చెప్పగలిగారు. అదే తరహా లెక్కల్ని స్కూలు పుస్తకాల నుండి అడిగితే చెప్పలేకపోయారు. తడబడ్డారు. వీళ్లతో సమ వయస్కులైన బడికి వెళ్లే పిల్లలు పాఠ్యాంశాల్లోని లెక్కల్లో మెరుగ్గా ఉన్నారు గానీ.. నిజ జీవితంలో, అంటే మార్కెట్ లో అవసరాలకు అన్వయించమని అడిగితే అదే స్థాయి లెక్కలే అయినా ఎక్కువమంది విఫలమయ్యారు. భారతదేశ గణిత బోధన మార్కెట్ తో సంబంధం లేకుండా సాగుతోందని ఈ అధ్యయనంతో రూపొందించిన పత్రానికి సహ రచయిత అభిజిత్ బెనర్జీ అన్నారు.

ఇది రెండు మహానగరాల సర్వేయే అయినప్పటికీ, ఇందులో ప్రశ్నల స్థాయి అసర్ తదితర భారతీయ సర్వేల్లోని అంకగణిత ప్రమాణాల్లోనే ఉంది. కాబట్టి, మొత్తంగా పోల్చి చూస్తే.. ఈ సర్వే బైటపెట్టిన మార్కెట్ - పాఠశాల విద్యా సామర్థ్యాల అంతరం గ్రామీణ, పట్టణ, ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా భారతదేశ విద్యావ్యవస్థలోని ఒక కీలక లోపాన్ని వెల్లడించే సూచికగా పరిగణించాలి.

అమ్మకాలకు అవసరమైన సంక్లిష్ట మానసిక లెక్కల్ని సులువుగా చేయగలుగుతున్న పిల్లలు తరగతి గది లెక్కల దృక్పథంలోకి మారలేకపోవటానికి - స్కూల్ లో ఊహాజనిత

లెక్కల్ని ప్రావీణ్యంతో చేయగలుగుతున్నవారు నిజజీవిత లావాదేవీలకు తమ పరిజ్ఞానాన్ని అన్వయించలేకపోవటానికి మధ్య అగాధాన్ని.. మూడు డేటా సేకరణ ప్రయత్నాలతో బేరీజు వేశారు.

**మూడు ప్రయోగాలు:**

మొదటి డేటా సేకరణ ప్రయోగంలో భాగంగా కోల్‌కతా మార్కెట్‌లలో పనిచేస్తున్న 201 మంది పిల్లల్ని ఎంచుకున్నారు. ఒక పరిశోధకుడు సాధారణ కొనుగోలుదారుగా దుకాణం దగ్గరకు వెళ్లారు. కిలోల లెక్కన కాకుండా, కొంత గందరగోళపరిచే తూకం లెక్కలతో కూరగాయలు కొనుగోలు చేశారు. ఉదాహరణకు, 800 గ్రాముల బంగాళదుంపలు, కిలో రూ.15 చొప్పున 1.4 కిలోగ్రాముల ఉల్లిపాయలు అడిగారు. రూ.37 ఇమ్మని వారు చెప్పటంతో, 200 నోటు ఇచ్చి రూ.163 వెనక్కి తీసుకున్నారు. మిగతా దుకాణాల వద్ద ఇదే తరహాలో బృందం పరీక్షించింది. మార్కెట్ లోని పిల్లలు 95-98% సందర్భాలలో డబ్బు లెక్కలు సరిగానే చేయగలిగారు. రెండోసారి ప్రయత్నాన్ని కూడా ఇందులో పరిగణలోకి తీసుకున్నారు.

అయితే, ఇదే పిల్లల్ని పక్కకు తీసుకెళ్లి కూర్చోబెట్టి (వారి తల్లిదండ్రుల అనుమతితో) మూడంకెల సంఖ్యను ఒక అంకెతో భాగించమని లెక్కలిచ్చారు. పాఠశాల గణిత పరీక్షల తరహాలో అడిగారు. 32% మాత్రమే సరిగా చేయగలిగారు. అదేవిధంగా రెండంకెల తీసివేతను 54% మంది పిల్లలు మాత్రమే సరిగా చేయగలిగారు. ఇక్కడ కూడా రెండుసార్లు అవకాశమిచ్చారు.

రెండో అధ్యయనంలో ఢిల్లీలోని మార్కెట్‌లో అమ్మకాలు జరుపుతున్న 400 మంది పిల్లలతో ఇదేతరహా పరీక్షల్ని ప్రయత్నించారు. అవే ఫలితాలు పునరావృతమయ్యాయి. మార్కెట్ లావాదేవీల నిర్వహణలో బలమైన సామర్థ్యాల్ని ప్రదర్శించగలిగారు. కానీ వీరిలో స్కూలుకు కూడా వెళ్తున్నవారిలో 15% మాత్రమే తరగతి గది గణితంలో ఒక మాదిరి ప్రతిభ చూపగలిగారు. రెండో తరహా ప్రయోగంలో, స్కూల్‌లో బాగా చదువుతున్న పిల్లలు మార్కెట్ సమస్యల్ని ఎలా పరిష్కరించగలరో పరిశీలన జరిపారు. 17 స్కూళ్ల నుండి 200 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో ఎవరూ మార్కెటలో పనిచేయటం లేదు. కష్టమైన లెక్కల్ని, పెన్సిల్, కాగితం ఇచ్చి, సమయ పరిమితి లేకుండా చేయ మన్నారు. తప్పు దిద్దుకునేందుకు ఒకసారి అవకాశ మిచ్చారు. 96% మంది సరైన సమాధానాలిచ్చారు. ఆ తర్వాత మార్కెట్ నేపథ్యంలో ప్రశ్నలిచ్చి.. అంతకు ముందులాగే సమయ పరిమితి లేకుండా, పెన్సిల్, కాగితం వినియోగించుకునే అవ కాశం ఇచ్చారు. 60% మంది మాత్రమే సరిగా చేయ గలిగారు.

చివరిగా మూడో తరహాలో.. మార్కెట్, పాఠశాల రెంటి నుండీ 200 మందికి పైగా పిల్లల్ని ఎంపిక చేశారు. వివిధ సందర్భాలకు సంబంధించి పలు రకాల ప్రశ్నలు అడిగారు. పనిచేసే పిల్లల్లో 85% మంది మార్కెట్ లావాదేవీలకు సంబంధించి సరైన సమాధానం ఇవ్వగా, పనిచేయని పిల్లల్లో ఆ సంఖ్య అదేస్థాయి కష్టంతో కేవలం 10%. ఈసారి పెన్సిల్, కాగితం వంటి సహాయ పరికరాలేమీ లేవు. కానీ భాగాహారం, తీసివేత సమస్యల్ని పెన్సిల్, కాగితంతోపాటు ఇచ్చినప్పుడు మార్కెటేతర పిల్లల్లో 69% సరిగా పరిష్కరిం చగా, మార్కెట్ పిల్లల్లో 45% మంది మాత్రమే చేయ గలిగారు.

మార్కెట్, స్కూలు పిల్లల్ని సమానస్థాయిలో ఇంకా అంచనా వేసేందుకు పరిశోధకులు ప్రతి విభాగం విద్యార్థులనీ నోటిమాటగా ఓ ప్రశ్న అడిగారు. ఒక బాలుడు మార్కెట్‌కి వెళ్లి రెండు కూరగాయలు కొనటంపై ప్రశ్నించారు. మార్కెట్ పిల్లల్లో సుమారుగా మూడో వంతు మంది ఎటువంటి సహాయం లేకుండా సమస్యను పరిష్కరించగలగ్గా, స్కూలు పిల్లల్లో 1% లోపు మాత్రమే సరైన జవాబివ్వగలిగారు. వాళ్లు లెక్కలు చేసే ఒక మూస పద్ధతిని చిట్కాలాగా అనుసరిస్తున్నారు తప్ప, ఆ గణిత సమస్యను అర్థం చేసుకోవటం లేదని బెనర్జీ వ్యాఖ్యానించారు.

స్కూలు పిల్లలు ఒక ఊహాజనిత గణిత సమస్య నుండి నిత్యావసరమైన నిర్దిష్ట సమస్య దగ్గరికొచ్చేసరికి అధ్వాన్నంగా ఉన్నారని, మరో సహ రచయిత ఈస్తర్ డుఫ్లో అన్నారు. మార్కెట్ పిల్లలు ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నారన్నారు.

రిటైల్ వ్యాపారంలో అవసరమైన లెక్కల్ని మనసులోనే చకచకా గణించుకోవటానికి కొన్ని సులభ పద్ధతుల్ని, సాంప్ర దాయేతర రీతిలో మార్కెట్ పిల్లలు వినియోగిస్తున్నారని ఈస్తర్ డుఫ్లో తెలిపారు. ఉదాహరణకి, 43ను 11తో గుణించటం. ఇందుకోసం వాళ్లు 43 ను 10తో హెచ్చించి, ఆ వచ్చిన అంకెకు 43 కలుపుతున్నారు. 10 అంకెను బేస్‌గా ఉపయోగించి లావాదేవీల్ని వేగంగా లెక్కిస్తు న్నారు. మార్కెట్ పిల్లల దగ్గర ఇతర తెలివైన పద్ధతులు కూడా ఉండి వుండొచ్చని ఆమె పేర్కొన్నారు. అందుకు భిన్నంగా స్కూల్ పిల్లలు.. సాంప్రదాయ లిఖిత పద్ధతుల్లో భాగాహారం, తీసివేత మొదలైనవి మెరుగ్గా చేస్తున్నారని వివరించారు.

**అంతరాన్ని తొలగించే మార్గం కనుగొనాలి**

ఉన్నత పాఠశాల విద్యార్థుల నైపుణ్యాలు, విద్యా ప్రగతికి సంబంధించి ఈ సర్వే ఫలితాలు ఒక కీలక ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. పాఠశాల స్థాయిలో ప్రయోగాలు, అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గా ఉంటేనే వారికి దీర్ఘకాల భవిష్యత్తు. మార్కెట్‌లో పని ద్వారా, తరగతి గదిలో బోధన నుండి గణితం నేర్చుకోవటం మధ్య ఉన్న అంతరాన్ని తొలగించటానికి మార్గం కనుగొనటం భారతీయ విద్యార్థులకు ప్రయోజనకరమవుతుందని పరిశోధనాపత్ర రూపకర్తలు అన్నారు.

**భిన్న పరిష్కారాలున్నాయని తెలియాలి**

ఒక అంకగణిత సమస్య సమాధానానికి ఒకే మార్గం

ఉన్నట్లుగా తరగతి గది బోధన ఉండటం సమస్యకు కొంత కారణంగా కనిపిస్తోందని బెనర్జీ అభిప్రాయపడ్డారు. విద్యార్థులు తమ సొంత తార్కిక శక్తితో భిన్న మార్గాల్లో సమాధానం వెతికే అవకాశం ఉండాలన్నారు. అయితే ఇందు కు ఉపాధ్యాయులను తప్పు పట్టలేమని.. వారు పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులకు సంబంధించి తమకు నిర్దేశించిన కచ్చితమైన నిబంధనల్ని పాటిస్తున్నారన్నారని డుఫ్లో తెలిపారు.

**ఇంకొన్ని ప్రయోగాలు అవసరం**

ఇదే సమయంలో ఈ కీలక సమస్య ఇంకా ఒక ప్రశ్నగానే ఉందని, భారతీయ తరగతి గదుల్లో గణిత బోధన లోపాల్ని సరిదిద్దే నిర్దిష్ట సమాధానానికి మరికొన్ని ప్రయోగాలు అవసరం ఉండొచ్చని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

సహజాతం లేదా పని ద్వారా నేర్చుకోవటానికి, తరగతి గది ద్వారా నేర్చుకోవటానికి మధ్య అంతరానికి వారధిగా వ్యవహరించే విద్యా పద్ధతులు, ఈ రకమైన అంశాలూ ఉండాలని సూచించారు. ఈ తరహా సర్వేని 1980ల ప్రాంతంలో బ్రెజిల్ లో నిర్వహించినట్లు సమాచారం. అందులో కూడా ఇదే తరహా ఫలితాలు వచ్చాయి. అంటే, పనిచేసే పిల్లలు మార్కెట్ లెక్కల్లో ఆరితేరారు. అంకగణితాన్ని మనసులోనే లెక్కించి మొత్తం బిల్లు ఎంతయిందో వినియోగదారులకు చెప్పగలు గుతున్నారు. స్కూల్ లో చెప్పే పాఠ్యాంశ లెక్కల్ని మార్కెట్ పిల్లలు తేలిగ్గా నేర్చుకోగలరని ఆ అధ్యయనం పేర్కొంది.

**నిత్యజీవితావసరాల కోసమే కాదు..**
**నిత్యజీవితావసరాల ద్వారానూ నేర్చుకోవాలి**

మన దేశంలో ఇప్పటి వరకూ ఎక్కువ సంఖ్యలో నిర్వహించిన అసర్ సర్వేల్లో తీసివేత, భాగాహారం వంటివి చేయమని పిల్లల్ని పరీక్షిస్తారుగానీ.. ఎందుకు తీసివేయాలి, ఎందుకు భాగించాలి వంటి ప్రశ్నలు అడగరు. ఈ నేపథ్యంలోనే, 16–18 వయసు పిల్లలకు ఒక చిన్న కుండలో నీటిని శుద్ధి చేయటానికి సరిపడా బిళ్లల్ని ఇచ్చి, కాస్త పెద్ద కుండలో నీటి శుద్ధికి ఎన్ని బిళ్లలు అవసరమవుతాయి? అనడిగితే ఎక్కువమంది జవాబు చెప్పలేకపోయారు. నేర్చుకున్న విషయాల్ని నిత్యజీవితంలో అన్వయించటం మాత్రమే కాదు.. నిత్యజీవితావసరాలు, పనుల ద్వారా నేర్చుకోవటం కూడా విద్యాప్రమాణాలను ప్రభావితం చేస్తుందని తేలిన నేపథ్యంలో.. పిల్లల చదువులకి, వారి రోజువారీ అవసరాలకి మధ్య సంధానం ఉండే పాఠశాల విద్య వారి పైచదువులకి, ఉపాధికి పటిష్ఠ పునాది అవుతుంది. జాతీయ విద్యావిధానం 2020 ఈ దిశలో ఉన్నప్పటికీ, విద్యలో మార్పు వంటివి కేవలం ప్రభుత్వాలకు వదిలేసే అంశాలు కావు. ❖

# పది నెలలు గడిచినా గెజిట్ ఏదీ?

## ఆంధ్రప్రదేశ్ లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం రైల్వే జోన్ కి శంకుస్థాపన చేసి పది నెలలు గడిచిపోయినా నేటికీ యూనియన్ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయకపోవటం ఆశ్చర్యంగా ఉందని ఆంధ్రప్రదేశ్ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. 2019 ఫిబ్రవరిలో విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ (దక్షిణ కోస్తా) రైల్వే జోన్ జాతీయ స్థాయి ప్రభుత్వ ఆదేశాలతో ఏర్పడిందని, 2020లో 170 కోట్లు మంజూరయ్యాయని, 2025లో డీపీఆర్ కూడా ఆమోదించారని తెలిపారు. 2025 జనవరి 8న ప్రధాని మోదీ జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేసి జనరల్ మేనేజర్ నూ నియమించారని, కానీ ఇప్పటికీ గెజిట్ విడుదల చేయలేదని అన్నారు. గెజిట్ లేకుంటే ఉద్యోగుల సర్దుబాటు, జోన్ హద్దులు, పరిపాలన ఎలా సాగుతాయన్నారు?

**పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో చర్చించండి**


డిసెంబర్ పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు రైల్వే జోన్ గెజిట్ అంశాన్ని చర్చకు తేవాలన్నారు. విశాఖపట్నంలో బాబ్జీ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం విశాఖ నగరం మాత్రమే కాకుండా.. చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలలో కూడా ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఉత్తరాంధ్ర యువత వలసలు పోవాల్సిన అవసరంలేకుండా చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలని, నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, వైద్య సౌకర్యాలు స్థానికంగానే అందుబాటులోకి తేవాలన్నారు. వైద్యంపై ప్రభుత్వం అంతర్జాతీయ నిపుణుల కమిటీని వేయటం అభినందనీయమని, లోక్‌సత్తా ప్రతిపాదించిన ఫ్యామిలీ డాక్టర్ ఆధారిత ప్రాథమిక వైద్య విధానం, ప్రభుత్వ–ప్రయివేటు భాగస్వామ్యం ఏ మేరకు.. మొదలైన అంశాల నమూనాను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఏపీ ప్రభుత్వం రోజుకు రూ. 883 కోట్లు ఖర్చు పెడుతోందని, ప్రభుత్వం ఇచ్చే తాత్కాలిక పథకాల మీద ఆధారపడకుండా ప్రజలు, ముఖ్యంగా యువత ఆదాయాలు పెంచుకునే విధానాల్ని అమలు చేయాలన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో అవినీతి నిర్మూలన

యం. పద్మనాభరెడ్డి
అధ్యక్షులు, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

మన దేశం ఎదుర్కొంటున్న సమస్యలలో అతి ముఖ్యమైనది పాలనలో అవినీతి. ఇది ప్రాచీన కాలం నుంచి వస్తున్న ఒక తప్పిదము. "ఏ విధంగానైతే నీటిలో బ్రతికే చేప ఎప్పుడు నీరు తాగుతుందో గుర్తుపట్టడం సాధ్యం కాదో అలానే ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పుడు ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తారో చెప్పడం కష్టం" (కౌటిల్యుని అర్థశాస్త్రం) – అయితే పాలనలో జరుగుతున్న అవినీతిని అరికట్టలేము అని ఒక నిర్ణయానికి రావలసిన పనిలేదు. ప్రజల చైతన్యంతో అవినీతిని పూర్తిగా నిర్మూలించలేకపోయినా చాలావరకు కట్టడి చేయవచ్చు.

ప్రజాజీవితంలో జరుగుతున్న అవినీతిని రెండురకాలుగా



విభజించవచ్చు. **ఒకటి:** చిన్నస్థాయిలో జరిగే అవినీతి అంటే దైనందిన జీవితంలో ప్రతిపౌరుడు వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో లంచాలు ఇవ్వనిదే పనికాని పరిస్థితి. దీనిని బలవంతపు వసూళ్ళు అని చెప్పవచ్చు. ఇదేకాక పౌరులు, అధికారులు కుమ్మక్కై అవినీతికి పాల్పడడం. ఉదాహరణకు మునిసిపల్ సిబ్బందికి లంచాలు ఇచ్చి చట్టాలకు విరుద్ధంగా నిర్మాణాలు, రెవెన్యూ సిబ్బందికి లంచాలు ఇచ్చి ప్రభుత్వభూముల కబ్జా, విద్యుత్ సిబ్బందితో కలసి మీటరు లేకుండా విద్యుత్ వాడకం, ఇలా రకరకాలుగా ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు కలసి అవినీతికి పాల్పడడం, నాకది నీకిది అన్న పద్ధతిలో జరిగే అవినీతి.

**ఇక రెండవది,** పెద్దస్థాయిలో అవినీతి (గ్రాండ్ కరప్షన్). ఇందులో ఉన్నతస్థాయి అధికారులు, రాజకీయనాయకులు, వ్యాపారస్థులతో చేతులు కలిపి చట్టాలను తుంగలో తొక్కి దేశసంపదను కొల్లగొట్టడం, గత కొన్ని సంవత్సరాలుగా ఈ అవినీతి మన దేశసంపదను కొల్లగొట్టడమే కాక ప్రపంచంలో భారతదేశం అత్యంత అవినీతి, కుంభకోణాల దేశం అనే ముద్రపడింది. ఉదాహరణకు ...జాతీయ స్థాయిలో 2 –జి, కామన్‌వెల్త్ ఆటలు, కోల్‌గేట్ వంటివి. ఇక రాష్ట్రానికి వస్తే ఓబుళాపురం గనులు, వ్యాన్‌పిక్ వంటి సంస్థలకు భూకేటాయింపులు, జలయజ్ఞం, కాళేశ్వరం ప్రాజెక్టు, సెజ్‌ల పేరున భూ కేటాయింపులు, మద్యం సిండికేట్ల స్కామ్, ఈ మధ్యనే వెలుగులోనికి వచ్చిన కమర్షియల్ ట్యాక్స్‌లో స్కామ్, విద్యుత్ కొనుగోళ్ళలో అవినీతి ఇలా కోకొల్లలుగా స్కామ్‌లు బయటపడుతున్నాయి. ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరగడంతో, దేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుంది.

రాజకీయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోవడం మంచివారు రాజకీయాలలో భాగస్వాములు కాకపోవడం, యువత, విజ్ఞులు ఎన్నికలకు దూరంగా ఉండటం ఓటర్లకు మంచివారిని ఎన్నుకునే సంఖ్య తగ్గిపోవడం వంటి వాటితో ప్రజాస్వామ్యం మనుగడకే ప్రమాదం ఏర్పడుతుంది.

అవినీతితో దేశ ఆర్థిక వ్యవస్థ కూడ ఘోరంగా దెబ్బ తింటుంది. అవినీతితో లాభాపేక్షకు పెద్దపీట వేయడంతో, ఆర్థికరంగంలో ప్రావీణ్యత కొరవడుతుంది. అవినీతి ఉత్పత్తులపై ఒక అదనపు పన్నుగా భారం పడుతూ ఉత్పత్తి రంగంలో పోటీని తగ్గిస్తుంది. ఎగుమతులు తగ్గిపోతాయి. అలాగే కొత్తగా పెట్టుబడులు రావు. అవినీతితో పర్యావరణానికి కూడ పరోక్షహాని కలుగుతుంది. అవినీతి ద్వారా పారిశ్రామికవేత్తలు పర్యావరణానికి హాని కలిగించే పరిశ్రమలు, కార్యకలాపాలు నిర్వహించి లాభాలు ఆర్జిస్తున్నారు. దీంతో దీర్ఘకాలికంగా ప్రజల జీవితాలకు హాని కలుగుతుంది.

అవినీతి మూలంగా దేశభద్రతకు ముప్పు వాటిల్లే సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా విదేశాల నుంచి ఆయుధ కొనుగోళ్ళలో ఎక్కువ ధరకు అలాగే నాసిరకం ఆయుధాలు కొనుగోలు చేసిన సందర్భాలు మనదేశంలో చాలా జరిగాయి. రక్షణశాఖలో అవినీతి దేశ భద్రతకు ముప్పుగా పరిణమిస్తుంది.


ఇక చివరగా అతి ప్రమాదకరమైనది ప్రజలపై అవినీతి ప్రభావం. రకరకాల అవినీతి మార్గాలతో సామాజిక పతనం, అవినీతితో ప్రజలకు తాము నిర్మించుకున్న వ్యవస్థలపై సందేహం, నమ్మకం పోవడంతో, రాజకీయ వ్యవస్థపై దుష్ప్రభావం చూపుతుంది. అవినీతితో సంపాదించిన ఆస్తులైన ఎలా సంపాదించాడు అనే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి ఎంత సంపాదించాడు అని

ఆలోచించడం, అటువంటి వారికి గౌరవం, అందలం ఎక్కించడం జరుగుతుంది. దీనితో సమాజంలో ఒక నిర్లిప్తత, అసంతృప్తి, బలహీన ప్రజాసంఘాలు ఇలా ప్రజాభిప్రాయాలు బలహీనపడి, అల్పులు, అసాంఘిక శక్తులు, కేవలం ధనం, కులం, మతం వంటి ప్రాతిపదికలపై ఎన్నికల బరిలో ప్రవేశిస్తున్నారు. నల్లధనం ఎన్నికల ఫలితాలను శాసిస్తుంది. అలాగే ప్రజలు కూడ ఓటు అమ్ముకోవడం ఎన్నికల ప్రక్రియలో ఒక భాగంగా చూస్తున్నారు. వీటన్నింటి ప్రభావం జనజీవనంపై పడి లంచాలు ఇవ్వడం, లంచాలు తీసుకోవడం ఒక ఆనవాయి తీగా మారిపోయింది.

అయితే, అవినీతిని అరికట్టడానికి సరియైన చట్టాలు లేవా అంటే కావలసినన్ని ఉన్నాయి. లేనిదల్లా వాటిని అమలు పరచడానికి ధృడచిత్తము గల అధికారులు , అవినీతిని అరి కట్టడానికి చిత్తశుద్ధి కలిగిన రాజకీయవ్యవస్థ కొర వడింది. దేశంలో అవినీతిని అరికట్టాలంటే ఈ విష వలయం నుంచి ఎక్కడో ఒకచోట ప్రారంభించవలసిన అవసర ముంది.

రాజకీయాలలో అవినీతిని కట్టడి చేస్తే కొంతవరకు సమా జంలో మార్పులు తీసుకురావచ్చు. అంటే రాజకీయ సంస్క రణలతో ఆరంభించవలసిన అవసరం ఎంతైనా ఉంది. నేడు దేశంలోని కొన్ని పార్టీలను మినహాయిస్తే చాలామటుకు ప్రధాన పార్టీలలో వంశపారంపర్యం నెలకొంది. అప్పు డప్పుడు దీనిపై చర్చ జరిగినా, సర్పంచ్ స్థాయి నుంచి ప్రధానమంత్రి వరకు చాలా సందర్భాలలో వంశపారంపర్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. పార్టీలలో అంతర్గత ప్రజా స్వామ్యం లోపించడం దీనికి ఒక ముఖ్యకారణం. అలాగే పార్టీల పనితీరులో పారదర్శకత లోపించి విచ్చలవిడిగా డబ్బులు సేకరించడంతో నీకిది నాకది పద్ధతిన వ్యాపార వేత్తలు లాభపడే విధంగా చాలా నిర్ణయాలు తీసుకుం టున్నారు. దానితో ప్రభుత్వ ఖజానాకు రావలసిన డబ్బు వ్యాపారవేత్తల జేబులలోకెళుతుంది.

మన ఎన్నికల విధానాన్ని బ్రిటీష్ పద్ధతిలో గత 75 సంవత్సరాలుగా అమలు చేస్తున్నాము. ఈ పద్ధతి కన్నా జర్మనీ ఎన్నికల విధానం బాగున్నను ప్రజలలో అవగాహన తక్కువగా ఉండటంతో కొంచెం క్లిష్టంగా ఉన్న జర్మనీ విధానం మనదేశంలో సరిపడదేమో అన్నసందేహం కలుగుతుంది. ప్రస్తుతం తన సమీప ప్రత్యర్థి కన్నా ఒక్క ఓటు ఎక్కువగా వచ్చినా గెలుపు ఖాయం (ఫస్టు ఫాస్టు ద పోస్టు). దీనితో అభ్యర్థులు ఎంత డబ్బయినా వెనుకాడకుండా ధన, కుల మత ప్రలోభాలతో ఎన్నికలలో గెలుస్తున్నారు. అదే దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిపిన అభ్యర్థులు రంగంలో ఉండక ప్రజలు పార్టీలకు ఓటు




లంచం తీసుకుంటుంటే ఉద్యోగంలోంచి తీసేశారు. లంచం ఇచ్చి మళ్లీ చేరాను!

వేయడంతో ఎన్నికలలో ధన, కుల, మత ప్రభావం తగ్గి ఎన్నికలు సజావుగా జరుగుతాయి.

ప్రజలు ఎన్నుకున్న శాసన, పార్లమెంటు సభ్యులలో సగం మంది నేరచరిత్రగలవారే. ఇంతకు పూర్వము నేరస్థులు, రాజకీయనాయకుల అండతో కార్యకలాపాలు సాగించేవారు. ఇప్పుడు వారే నాయకులుగా ఎదిగి, చట్టాన్ని, పాలనను తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. మన పార్లమెంటు సభ్యులు చాలామంది కాంట్రాక్టులు చేస్తూ, దేశసంపదను కొల్లగొడుతున్నారు. ఇక శాసనసభ సభ్యుల తీరు వేరుగా లేదు. కొందరు లిక్కరు మాఫియాలకు తెర వెనుక ఉంటూ సమాజంలో గౌరవ శాసనసభ్యులుగా చెలామణి అవుతు న్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని నేరచరితులు ఎన్నికలలో పోటీ చేయకుండా ఉండే విధంగా సంవరించవలసిన అవ సరం ఎంతైనా ఉంది. ఈ మధ్య సుప్రీమ్‌కోర్టు కొన్ని సంద ర్భాలలో తీర్పులు వెలువరించినా ఇంకా అవి చట్ట రూపం

దాల్చి అమలు కావడానికి సమయం పడుతుంది.

**పోలీసుశాఖలో సంస్కరణలు:** ప్రజల మానప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగం నేడు అవినీతిలో కూరుకుపోయింది. ఆ శాఖలో నియామకాలు, బదిలీలు, పదోన్నతులు అన్నీ లంచాలతో ముడిపడి ఉన్నాయి. పోలీసు శాఖలో సంస్కరణల గురించి గత నాలుగు దశాబ్దాలుగా నివేదికలు ఎన్నో ఉన్నాయి. సుప్రీమ్‌కోర్టు కూడ సంస్కరణల గురించి 6 మార్గదర్శక సూత్రాలు తెలిపినా చాలా రాష్ట్రాల లో ఇవి అమలుకు నోచుకోలేదు. మన రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా రాజకీయ నాయకుల గుప్పిట్లో ఉండడంతో ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం పోయింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీమ్ కోర్టు సూచించిన 6 మార్గదర్శక సూత్రాలు పాటిస్తే కొంత వరకైనా పోలీసు వ్యవస్థలో అవినీతిని తగ్గించవచ్చు.

**పాలనలో సంస్కరణలు :** అవినీతి నిర్మూలన దిశగా ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. అందులో ముఖ్యంగా సమాచార హక్కు చట్టం, పౌరహక్కుల పత్రం (సిటిజన్స్ చార్టర్) వంటివి ముఖ్యమైనవి. సమాచారహక్కు చట్టం కొద్దో గొప్పో ఫలితాలు చూపిస్తున్నా ఇది ఇంకా ప్రజలలోనికి వెళ్ళలేదు. గ్రామ, మండలస్థాయిలో పేదల కోసం చేపట్టిన ఎన్నో కార్యక్రమాలు అవినీతిలో కూరుకుపోయి ఆశించిన ఫలితాలు అందడంలేదు. చాలా రాష్ట్రాలలో సమాచారహక్కు చట్టం కమీషనర్ల నియామకం జరుపక సమాచారహక్కుచట్టం అమలు కావడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా కమీషనర్లు లేరు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా రెండు నెలల క్రితం కోర్టు ఆదేశాలతో కమీషనర్ల నియామకం జరిగింది. ఇక పౌరహక్కుల పత్రం ఇంకా బాలారిష్ట దశలోనే ఉంది. కొన్ని శాఖలు పౌరహక్కుల పత్రాన్ని అంతర్జాలంలో ఉంచి తరువాత మరిచిపోతున్నారు. పౌరహక్కుల పత్రం సరిగా అమలైనచో ప్రజలు తమకు అందాల్సిన సేవలను ఒక హక్కుగా నిర్ణీతసమయంలో పొందగలుగుతారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు అవసరం లేదు. నిర్ణీత గడువులో సంబంధిత సేవలు పొందవచ్చు. ఈ-గవర్నెన్స్ ఇప్పుడిప్పుడే ఆచరణలోనికి వస్తుంది. ఈ విషయంలో ఇంకా చొరవ చూపి చాలా పనులు ఈ-గవర్నెన్స్ ద్వారా లావాదేవీలు జరిపిన ప్రజలు, ప్రభుత్వ అధికారుల మధ్య కలయిక తగ్గి అవినీతికి అవకాశాలు తగ్గుతాయి. అలాగే, పార్లమెంట్ ముందున్న విజిల్ బ్లోయిర్ ప్రొటెక్షన్ బిల్లు (ప్రజావేగుల రక్షణ బిల్లు), బినామీ ట్రాంజాక్షన్ బిల్లు, సిటిజన్స్ రైట్స్, గ్రీవియన్స్ రిడ్రెసల్ బిల్లు వంటి వాటిని చిత్తశుద్ధితో అమలుపరచిన అవినీతిని చాలావరకు అరికట్టవచ్చు.

అవినీతి నిరోధక సంస్థలైన ఏ.సి.బి., విజిలెన్స్ కమీషన్, డైరెక్టర్ జనరల్ విజిలెన్స్..ఎన్‌ఫోర్స్‌మెంటు వంటి శాఖలు ఇంకా బాగా పనిచేయాల్సిన అవసరముంది. అలాగే ఈ సంస్థలు పంపిన నివేదికలపై ప్రభుత్వం సత్వరచర్యలు గైకొనాలి. విజిలెన్స్ కమీషన్ నివేదికలపై చర్యలు గైకొనక అవినీతి అధికారులకు రాష్ట్ర సచివాలయం కొమ్ముకాస్తుంది. పాలనలో జవాబుదారీతనం, పారదర్శకత రాష్ట్ర సచివాలయంలో మచ్చుకైనా కానరాదు. ఉన్నతస్థాయి ముఖ్యకార్యదర్శులకు దస్త్రాలు పరీక్షించే ఓపికలేదు. దీనితో ఇక కిందిస్థాయి సిబ్బంది విపరీతమైన అవినీతికి పాల్పడుతున్నారు. చాలా సందర్భాలలో లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారులపై ప్రాసిక్యూషన్ కోసం ఏ.సి.బి. వారు అనుమతి అడుగగా రాష్ట్ర సచివాలయంలో పలు సాకులతో ప్రాసిక్యూషన్ అనుమతి నిరాకరించిన కేసులు కొన్ని వందలలో ఉన్నాయి. రాష్ట్ర సచివాలయంలో డబ్బులు ఖర్చుపెడితే ఏ పనైనా చేయించుకోవచ్చన్న భావన ప్రజలలో కలిగింది. కొన్ని సందర్భాలలో అధికారులు అ.ని.శా.కు లంచం తీసుకుంటూ రెండుసార్లు పట్టుబడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి.

నానాటికి తీవ్రమవుతున్న అవినీతిని అరికట్టడానికి ప్రజా ఉద్యమం తప్పనిసరి. అన్నాహజారే లోక్‌పాల్ చట్టం కోసం మొదలు పెట్టిన ఉద్యమం మాదిరి గ్రామస్థాయి నుంచి ప్రజలు తమ దైనందిన జీవితంలో అనుభవిస్తున్న అవినీతిపై పోరాటం చేయవలసిన అవసరం ఉన్నది.

**ప్రజల భాగస్వామ్యంతో అవినీతిని అరికట్టడానికి కొన్ని సూచనలు :**

1. అవినీతి అధికారుల గుట్టు బట్టబయలు చేయడం
2. నీతిమంతులైన అధికారులను గుర్తించి గౌరవించడం
3. అవినీతికి వ్యతిరేకంగా మోరల్ అప్పీలు చేయడం, అలాగే అవినీతికి సంబంధించిన పని చేయకపోవడం
4. ప్రభుత్వ పనితీరులో తప్పిదాలను ప్రతిఘటించడం, ఉద్యమాలు చేయడం
5. అవినీతి పద్ధతులను పాటించకపోవడం, ప్రతిఘటించడం
6. అవినీతి నిరోధక ప్రజాసంఘాలుగా ఏర్పడి ప్రజలకు అందాల్సిన అన్ని సేవలు, లాభాలు ఒక హక్కుగా పొందేటట్లు చూడడం
7. ప్రసార మాధ్యమాలు అవినీతిపై పోరాటంలో తమ వంతు పాత్ర నిర్వహించాలి
8. రాజకీయాలలో అవినీతిని ఎట్టి పరిస్థితులలో ఒప్పుకోక పోవడం (జీరో టాలరెన్స్) ❖

**(డిసెంబర్ 9న అవినీతి వ్యతిరేక దినోత్సవం)**

# బీహార్ లో ప్రశాంత్ కిషోర్ ప్రత్యామ్నాయ స్టార్టప్ .. మౌలికాంశాలపై చర్చ రేకెత్తించటంలో కీలకపాత్ర



ఇటీవలి బీహార్ అసెంబ్లీ ఎన్నికల హడావుడి అధికారం కోసం అలవిమాలిన పోరాటంలా సాగింది. గెలిస్తే ప్రధాన సమస్యల పరిష్కారానికి ఏం చేస్తారో ముందు చెప్పి, ఆ తర్వాత సాంకేతిక లోపాల్ని ప్రస్తావించాల్సిన ప్రధాన పార్టీలు.. మౌలిక సమస్యలపై చర్చను మసక బార్చాయి. వ్యక్తిగత దాడులతోనూ ప్రత్యర్థులపై బురద జల్లే ప్రయత్నం చేశాయి. అదలా ఉంచితే, బీహార్ ప్రజల మౌలిక సమస్యలను ఎక్కువగా ప్రస్తావించింది జన్ సురాజ్య పార్టీ మేనిఫెస్టో. అందులో మొదటిది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల్ని మెరుగుపరచటం. ప్రభుత్వ స్కూళ్లు మెరుగు పడేదాకా ప్రయివేటు పాఠశాలల్లోనూ 15 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత విద్య. బీహార్ నుంచి పొట్ట చేత పట్టుకుని ఇతర రాష్ట్రాలకు వలసలు పోవాల్సిన అవసరం లేకుండా యువతకు కనీస స్థాయి వేతనంతో స్థానికంగానే ఉపాధి, అరవై ఏళ్లు పైబడినవారికి పెన్షన్‌ను రూ.400 నుంచి 2,000కి పెంచటం, మహిళలకు స్వయం ఉపాధికి తక్కువ వడ్డీకి (సుమారు 4%) బ్యాంకు రుణాలు ప్రభుత్వ గ్యారంటీతో అందించటం, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి సంధానించి రైతులకు ఆదాయం పెంచటం మొదలైనవి.

ఎన్నికలకు ముందు ఓ పాడ్ కాస్ట్‌లో ఈ అంశాలను ప్రస్తావిస్తూ.. మిగతా పార్టీల్లా మీరు తాత్కాలిక పథకాలను, ఇంకా ఎక్కువ పెన్షన్‌ను, నగదు బదిలీల్ని ఇవ్వరా? అని అడిగిన ప్రశ్నకు ఆ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ చాలా స్పష్టంగా 'నో' చెప్పారు. ఈ అయిదూ తప్ప ఇంకేమీ ఇవ్వబోమని, బీహార్ పునరుజ్జీవనమే తన లక్ష్యమని తెలిపారు. ప్రతిపక్షాల హామీల్నీ తప్పుపట్టారు.. నితీష్ కుమార్ ప్రభుత్వం విధించిన మద్యపాన నిషేధాన్ని తొలగించి ఆ డబ్బును రాష్ట్రంలో నాణ్యమైన చదువుకు వినియోగిస్తామన్నారు.

బీహార్‌లో బయట దుకాణాల్లో మద్యం అమ్మకపోయినా, ఇంటికి డెలివరీ చేస్తున్నారన్నారు. ఇలాంటి కేసుల్లో పట్టుబడినవారు పేదలను కేసుల్లో ఇరికించి జైలుకు పంపుతున్నారన్నారు. ఇంతకంటే అధ్వాన్న చట్టబద్ధపాలన ఉండదన్నారు. మాఫియాలను పెంచుతూ పేదలను, మహిళలను క్రూరంగా శిక్షిస్తున్న మద్య నిషేధాన్ని ఎత్తివేసి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, డీఎడిక్షన్ కేంద్రాలపై దృష్టి సారిస్తామని పీకే అన్నారు.

నేపాల్‌లో జెన్ జడ్ ఆందోళనల గురించి వ్యాఖ్యానిస్తూ, మార్పు వీధుల్లో ఆందోళనలతో రాదన్నారు. విప్లవాలుగా చెప్పుకునే ఆ తరహా హింసాత్మక ఆందోళనలు ఓ కత్తిలా ప్రభుత్వాన్ని తెగనరికి గద్దె దించటానికి తప్ప, నిర్మాణాత్మక మార్పులకు ఉపకరణాలు కాలేవన్నారు. ప్రపంచ చరిత్రను అధ్యయనం చేసి తానీ మాటలు చెబుతున్నానన్నారు. మార్పుకి గాంధీ మార్గమే సరైనదని ప్రశాంత్ కిషోర్ తేల్చిచెప్పారు.

**అరవింద్ కేజ్రీవాల్ విఫల ప్రయోగం**

ఆప్ వ్యవస్థాపకుడు అరవింద్ కేజ్రీవాల్ భిన్నమైన రాజకీయాలు చేస్తానని చెప్పి, చివరికి ఓ సాధారణ రాజకీయవేత్తగా మిగిలిపోయారని పీకే అన్నారు. ఆయన్నో విఫల ప్రయోగంగా అభివర్ణించారు. ఏకే చేయలేని పని పీకే చేయగలరా అని అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ.. తాను రాజకీయాల్లో విప్లవం తెస్తానని, సమూల మార్పులు తెస్తానని చెప్పటం లేదన్నారు.

**దీర్ఘకాలం పోరాడగలిగితే నితిష్ స్థానానికి పోటీ పడే అవకాశం**

238 సీట్లలో పోటీ చేసిన జన్ సురాజ్.. చాలాచోట్ల డిపాజిట్లు కోల్పోయినా 3.4% ఓట్లు సాధించి ఒక సీటులో రెండో స్థానంలో, 129 సీట్లలో మూడో స్థానంలో నిలిచింది. రెండు ప్రధాన కూటముల మధ్య సొంతంగా పోటీ చేసే పార్టీలకు అవకాశం కష్టమని 2024 నుండి ఎన్నికల్లో రుజువవుతోంది. ప్రస్తుతానికైతే బీహార్ కూడా అదే ఒరవడి కొనసాగించింది.

మదర్ ఆఫ్ ఎలక్షన్స్ గా ఈసీ అభివర్ణించిన ప్రస్తుత బీహార్ ఎన్నికల్లో 1.7 కోట్ల మంది ఓటర్లు యువత. జన్ సురాజ్ ఎజెండాకు వీరి నుండి మంచి ఆదరణ లభించింది. ఒక సీనియర్ సెఫాలజిస్ట్ అంచనా ప్రకారం, ఎన్నికలకు కొన్ని వారాల ముందు వరకూ పీకేకు 8% ఓట్ షేర్ ఉంది. అయితే ఆయన ఎన్నికల్లో పోటీ చేయకపోవటం, ప్రధాన పార్టీలు వనరుల దూకుడుతో వెనుకబడ్డారు. పీకే కూడా సొంత డబ్బే అయినా, కోట్ల రూపాయలు వెచ్చించినట్లు సమాచారం. కులానికి అతీతంగా ఓటు వేయాలను కున్నవారు కూడా ఇంతకుముందు జనబలంలో పేర్కొన్నట్లు, బీహార్ లాంటి పేద రాష్ట్రంలో ఓటు మాత్రమే ప్రభుత్వ పథకాలను అందుకోవటానికి ఏకైక ఆయుధంగా భావిస్తారు. గెలిచే అవకాశంలేని పార్టీకి ఓటు వేయటం వృథా అని మాత్రమే కాదు.. తమ రోజువారీ జీవితాల్లోనూ నష్టపోతామనే భయం ఆ రాష్ట్రంలో ఎక్కువగా ఉంటుంది. ప్రత్యేక ఓటరు సవరణ (సర్)పై రాహుల్, ఇతర కొన్ని పక్షాలు ఓటరు అధికార్ యాత్రకు స్పందన ఎక్కువగా ఈ భయం నుంచే ఏర్పడింది. ఈసీ చెబుతున్న పౌరసత్వ సమస్య ఉందని అక్కడ ప్రజలందరికీ తెలిసిన విషయం కావటంతోపాటు.. ఎప్పుడైతే ఓటరు పేర్ల తుది జాబితాలు పెద్దగా తొలగింపులు లేకుండా వెలువడ్డాయో, పొరపాటున పేరు లేనివారు తప్ప మిగిలినవారెవరూ రాహుల్ తదితరుల ఆరోపణలను పట్టించుకోలేదు.

ఈ క్రమంలో జన్ సురాజ్ ఓట్లు రెండు ప్రధాన పార్టీల మధ్యా కొంత చీలినా, సుమారు 33 స్థానాల్లో గెలుపోటములన్ని పీకే పార్టీ ప్రభావితం చేసిందని అంచనా. 238 సీట్లలో పోటీ చేసిన జన్ సురాజ్.. చాలాచోట్ల డిపాజిట్లు కోల్పోయినా 3.4% ఓట్లు సాధించి ఒక సీటులో రెండో స్థానంలో, 129 సీట్లలో మూడో స్థానంలో నిలిచింది. రెండు ప్రధాన కూటముల మధ్య సొంతంగా పోటీ చేసే పార్టీలకు అవకాశం కష్టమని 2024 నుండి ఎన్నికల్లో రుజువవుతోంది. ప్రస్తుతానికైతే బీహార్ కూడా అదే ఒరవడి కొనసాగించింది.

రాష్ట్రాన్ని 2005 నుండి పరిపాలిస్తున్న నితీష్ కుమార్ కులరాజకీయాలను, పొత్తుల ఫిరాయింపుల్ని మంచి పరిపాలన కోసమే వినియోగించటం వల్ల ఆయనకు ఆదరణ తగ్గలేదు. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో ఆయనకు ఎదురైన అవరోధాల నుండి మహిళా ఓటర్ల మద్దతు గట్టెక్కించిందని గణాంకాలు సూచిస్తున్నాయి. నితీష్ నుండే కులగణనను రాహుల్ ఎత్తుకున్నారు. ఓట్ల శాతంలో ఆర్జేడీ అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించినా, అంతిమంగా ఎన్.డి.ఏ రికార్డు మెజారిటీతో గెలిచింది. అయితే, నితీష్‌కు ఇది చివరి ఎన్నికగా భావిస్తున్నారు. బీహారీ బ్రదర్స్ లో మరొకరైన లాలూప్రసాద్ ఇప్పటికే తెరవెనక్కి వెళ్లిపోయారు. దీంతో.. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్, కర్పూరీ ఠాకూర్, మండల కమిషన్‌ల తరానికి చెందిన నితిష్ తర్వాతి శకం రాజకీయం మొదలయ్యే అవకాశం వచ్చేసారి నుండి ఉంటుందంటున్నారు. బీజేపీకి బీహార్‌లో ఈసారి ఎక్కువ సీట్లు వచ్చినా, నితీష్ లేకుండా గెలిచే పరిస్థితి ప్రస్తుతానికి ఆ పార్టీకి లేదు. బీజేపీలో జేడీయూని నితిష్ విలీనం చేస్తారనే అభిప్రాయమూ ఉంది. అయితే, ఆర్థికాభివృద్ధి, పొట్ట చేత పట్టుకుని వలసలు, ఉపాధి అవకాశాలు, విద్య, ఆరోగ్యం మొదలైన అంశాలపై ప్రజల్లో ఆకాంక్షలు, చర్చ మొదలవటానికి కారకుల్లో ఒకరైన ప్రశాంత్ కిషోర్.. ఆ మౌలిక ఎజెండాపై దీర్ఘకాలిక పోరాటం చేయగలిగితే నితీష్ స్థానానికి పోటీ పడే అవకాశం ఆయనకు కూడా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

ఒక మునిసిపల్ కార్పొరేషన్ లాంటి చిన్న, సంపన్న ప్రాంతం, కొన్ని అసాధారణ పరిస్థితులు కలిసొచ్చాయి కాబట్టి.. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో మొదటిసారే ముఖ్యమంత్రి కాగలిగారు. అదేవిధంగా అస్సాంలో విద్యార్థి ఉద్యమ పార్టీ గణ పరిషత్. ఒక పెద్ద, సంక్లిష్ట రాష్ట్రంలో ఎన్.టి రామారావు మినహాయించి, ఇంతవరకూ ఎవరూ అలా మొదటిసారే, స్వల్పకాలంలో విజయం సాధించలేదు. కాబట్టి, ప్రశాంత్ కిషోర్ కన్సల్టెంట్‌గా కాకుండా, నిజమైన ప్రజాస్వామిక నాయకుడిగా వ్యవహరించాలంటే, దీర్ఘకాలం పోరాటం తప్ప అడ్డదారులు లేవు. జనవరి 15, 2026 నుండి నవ నిర్మాణ జాగరణ్ యాత్ర చేస్తామంటున్నారు. భారతదేశానికి మళ్లీ ప్రజాస్వామిక మార్గదర్శనం చేసే స్థాయికి బీహార్ పునరుజ్జీవనం ఎప్పుడన్నది ఇప్పటికైతే ప్రశ్నే.

❖

# రోజుకు రూ.835 కోట్ల ఖర్చు.. ఫలితాలు ప్రశ్నార్థకం

## హైదరాబాద్ పైనే అతిగా ఆధారపడిన తెలంగాణ

### రేవంత్ పాలన @ 2



తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి 2025 డిసెంబర్ కి రెండేళ్లు పూర్తి చేసుకున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బీఆర్ఎస్/టీఆర్ఎస్ రెండు దఫాల విజయం తర్వాత కాంగ్రెస్ తరపున మొదటి, కేసీఆర్ తర్వాత రెండవ ముఖ్యమంత్రి రేవంత్.

కేసీఆర్ పాలనలోని అంశాల జోలికివెళ్లకుండా, వాటిలోని తప్పుల్ని ఎత్తిచూపటం, కేసీఆర్ అహాన్ని వీలైనంత దెబ్బ తీస్తూ వ్యక్తిగత ప్రతీకారాన్ని ఆస్వాదించటం, కేసీఆర్‌కు ప్రజల్లో చెడ్డపేరు తెచ్చిన వ్యవహారశైలికి భిన్నంగా వ్యవహరించటం రేవంత్ తొలినాళ్ల పాలనలోని ప్రధానాంశాలు.

ఇందులో భాగంగా ప్రగతిభవన్ బారికేడ్లను మొదట తొలగించారు. ప్రగతిభవన్ పేరును జ్యోతిరావ్ పూలే ప్రజాభవన్‌గా మార్చారు. గడీల తరహా పాలనను బద్దలు కొట్టి, ప్రజల స్వామ్యాన్ని పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ఆరు గ్యారంటీలకు తోడు రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని మరో హామీని అనధికారికంగా ఇస్తున్నామని, మరో 400 పై చిలుకు హామీలనూ అమలు చేస్తామని రేవంత్ ఎన్నికల సమయంలో ప్రకటించారు. ప్రజల నుండి ముఖ్యమంత్రే నేరుగా వివిధ సమస్యలపై ప్రజల నుండి అర్జీలను తీసుకునే కార్యక్రమాన్ని ప్రజా భవన్‌లో ప్రారంభించారు. ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి మోదీని, ఇతర మంత్రులను తరచూ కలిసి రాష్ట్రావసరాలకు నిధుల్ని రాబట్టు కోవటానికి వీలైనంత ప్రయత్నం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి నిర్మిస్తే హైదరాబాద్‌కి వచ్చే నష్టమేమీ లేదని బహిరంగంగా చెప్పటంతోపాటు అందుకు తగ్గట్లు పెట్టుబడుల్ని పోటాపోటీగా సమీకరించుకునే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.

అధికార యంత్రాంగంలో సమర్థులను సెక్రటేరియట్‌లో, కొన్ని కీలక స్థానాల్లో నియమించుకున్నారు. తెలంగాణలో విద్యారంగాన్ని బాగుచేసి, నైపుణ్యాల్ని పెంచి, తన గెలుపుకి కీలకమైన నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నారు. కేసీఆర్ ను విమర్శించిన మాజీ ఐఏఎస్ అధికారులు, ఉద్యమంలో పాల్గొన్న విద్యావేత్తల నుండి సలహా సూచనలు తీసుకున్నారు. గత పదేళ్ల తెలంగాణ సమీక్షను విధాన పరంగా, సమగ్రంగా చేయకుండా, కేసీఆర్ హయాంలో ఏ రంగం ఎలా దెబ్బతిందో వెల్లడించే శ్వేత పత్రాలను విడుదల చేశారు. ఆర్థిక సంక్షోభాన్ని ప్రజలకు తెలియచేశారు. ఈ రకంగా సాంప్రదాయ రాజకీయాన్ని మెరుగైన పాలనతో మేళవిస్తూ కేసీఆర్‌కు భిన్నమైన ముఖ్యమంత్రిగా తన ప్రత్యేక తను చాటుకునే ప్రయత్నం చేశారు. కానీ కాలం గడుస్తున్న కొద్దీ తాత్కాలిక తాయిలాల భారం ఎక్కువై ఉక్కిరిబిక్కిరి కాసాగారు.

ప్రజాభవన్‌లో దర్బార్‌ను రెండు రోజులకే పరిమితం చేశారు.బాధ్యతలను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి, ఓ ఐఏఎస్ అధికారికి అప్పచెప్పారు. దీనికితోడు తాత్కాలిక తాయిలాలకు సొమ్ముల ఒత్తిడి మరీ పెరిగిపోయింది. అప్పటికే ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రభుత్వానికి బహిరంగంగా సలహా ఇచ్చారు. పథకాలను హేతుబద్ధీకరించి, క్రమపద్ధతిలో హామీల్ని నెరవేర్చాలని, ఇందుకోసం ప్రజలకు నచ్చచెప్పాలని సూచించారు.

ఖజానా ఖాళీగా ఉన్నా..పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రైతురుణమాఫీని ఒకే దఫా చేస్తామని హామీ ఇచ్చారు. చివరికి మాట ఇచ్చినందుకు రూపాయి రూపాయి కూడబెట్టి కొంతవరకు రుణమాఫీ చేసేసరికి ఖజానా ఇంకా సంక్షోభంలో కూరుకుపోయింది. ఆ దెబ్బ నుంచి ఇప్పటి దాకా రేవంత్ ప్రభుత్వం కోలుకోలేదు.

కులగణన ద్వారా బీసీలకు స్థానిక ప్రభుత్వాలతోపాటు విద్య, ఉద్యోగాల్లో కూడా 42% రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఒక్కో విద్యార్థి మీదా ఏటా రూ.1,08,000 ఖర్చు చేస్తున్నా, చదువెందుకు రావటం లేదు? ప్రభుత్వ స్కూళ్లలో ఉన్నకొద్దీ విద్యార్థులెందుకు తగ్గిపోతున్నారు? అని వరుస సమావేశాల్లో బహిరంగ వ్యాఖ్యలు చేశారు. నెపాన్ని

అధికారయంత్రాంగంపై నెట్టే ప్రయత్నం చేశారు. అయితే ప్రజాప్రయోజనాలకు ఏ సందర్భాన్నీ జారవిడువని జేపీ నేతృత్వంలోని ఎఫ్.డి.ఆర్ బృందం ముఖ్యమంత్రి ఆవేదనను ఒక అవకాశంగా వినియోగించుకుని తెలంగాణ పాఠశాల విద్యారంగాన్ని బాగుచేసే ప్రయత్నం ప్రారంభించింది. సమస్య ఎక్కడుంది, డబ్బు ఖర్చు చేస్తున్నా ఎందుకు ఫలితాలు రావటం లేదు, అయిదో తరగతివారు రెండవ తరగతి పాఠం ఎందుకు చదవలేకపోతున్నారు, హైస్కూల్ లో కూడికలు, తీసివేతలు కూడా ఎక్కువమంది ఎందుకు చేయలేకపోతున్నారు, మనకున్న బలాల్ని ఉపయోగించి ఏం చేస్తే వేగంగా మార్పు వస్తుంది.. ఈ అంశాలన్నిటినీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ తో పాటు ఒక నోట్ ను కూడా జేపీ సవివరంగా వివరించి ముఖ్యమంత్రికి, విద్యాశాఖ అధికారులకు అందచేశారు. ఏవో కొన్ని చర్యలు తీసుకుంటున్నారుగానీ.. ఇంతవరకూ మూలాల్ని కదిలించలేదు. తాత్సారం చేస్తున్నారు. ఫలితంగా ఈ ఏడాది కూడా ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గింది. అన్ని స్కూళ్లనీ హేతుబద్ధం చేసినా, ఇంకా 10,000 మంది ఉపాధ్యాయులు మిగిలారు. రేవంత్ ప్రభుత్వం రాగానే 11,000 కు పైగా టీచర్లను రిక్రూట్ చేసింది. అది ఎంత తప్పుడు నిర్ణయమో, అనాలోచితమో, ప్రజాధనం దుర్వినియోగమో కళ్ల ముందు కనిపిస్తున్నప్పుడు.. ఇక మిగిలినవారిని ముఖ్యమంత్రి ఎలా ప్రశ్నించగలరు? అందరూ ఒకే తానులో గుడ్డలన్నట్లు బండి నెమ్మదిగా కదులుతోంది. కానీ ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు ఏసీ గదులతో ఇంటర్నేషనల్ స్కూళ్లు అంటూ ఓ నాలుగు వేల కోట్లకుపైగా నిధులు ప్రతిపాదించారు. యూనియన్ ప్రభుత్వాన్నీ సహాయం అడిగారు. మరి ఇప్పటికే ఉన్న వేలాది ప్రభుత్వ స్కూళ్ల సంగతేంటి?.. అంటే సమాధానం లేదు. కులగణనకు బీసీ రిజర్వేషన్లకు సంబంధం ఏమిటి అంటే.. సరైన సమాధానం లేదు.

ఈ రెండేళ్లలో రేవంత్ చేసిన మంచి పనులు హైదరాబాద్ కి పెట్టుబడులు సాధించటానికి శాయశక్తులా ప్రయత్నించటం, హైడ్రా ద్వారా ఆక్రమణల్ని కూలగొట్టి ప్రభుత్వ జాగాల్ని రక్షించటం, ప్రజలకు పారదర్శకంగా సమాచారం చేరేలా సెక్రటేరియట్ లో, మీడియాలో అందుబాటులో ఉండటం, ప్రజల వినతుల్ని స్వీకరించే ఏర్పాటు చేయటం మొదలైనవి. కానీ ఇవన్నీ కలిపినా కేసీఆర్ మొదటి రెండేళ్ల పాలనలో కంటే గొప్పవేమీ కాదు. విధానపరంగా కేసీఆర్ వైఫల్యాలను పరిష్కరించ లేకపోయారు.

అంతకుముందు కేసీఆర్ చేసినట్లే, అంతా హైదరాబాద్ చుట్టూ తిప్పి, ఉచితాలను నమ్ముకుని, వాటికి డబ్బుల్లేక చేతులెత్తేసి, అనవసరంగా కులగణన అంటూ హడావుడి చేసి అభాసుపాలవటం వల్ల చివరికి అన్నిచోట్లా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. రోజుకు రూ.835 కోట్లు ఖర్చు పెడుతున్నా, రాష్ట్ర ప్రజల జీవితాల్లో ఆ స్థాయి ఫలితాలు కనిపించటం లేదు.

కాళేశ్వరం ప్రాజెక్టు ఎంత అసంబద్ధమైందో, అవినీతి ఎలా ప్రవహించిందో జస్టిస్ ఘోష్ కమిటీ స్పష్టంగా నిగ్గుతేల్చినా కేసీఆర్ బృందంపై చర్యలు లేవు. ఓ పక్కన కాళేశ్వరాన్ని విమర్శిస్తూనే, మరోవంక మూసీ సుందరీకరణ అంటూ లక్షన్నర కోట్ల ప్రాజెక్టుకు ప్రతిపాదనలు చేయటం, మెట్రోకి రూ.300 కోట్లు ఇచ్చి ప్రోత్సహించాల్సింది బదులు ప్రభుత్వం నడుపుతుందంటూ తీసుకోవటం, విస్తరించటానికి రూ.50,000 కోట్లతో ప్రణాళిక వంటివి చేయటం ప్రతిష్టను దిగజార్చేవి. కమీషన్ల కోసమే ఇంత భారీ పథకాలు అంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. చివరికి రూ.4,000 కోట్ల పైచిలుకు ప్రతిపాదనలతో మూసీలోకి మురుగునీరు చేరకుండా చర్యల నుండి పరివాహక ప్రాంత క్రమ అభివృద్ధికి నిర్ణయించారు. ఏసీబీ రోజుకో అవినీతి కేసు నమోదు చేస్తున్నా, చర్యలపై అతీగతీ లేదు. అవినీతిపై ఒక పద్ధతి ప్రకారం చర్యలు తీసుకునే చిత్తశుద్ధిని ముఖ్యమంత్రి ప్రదర్శించకపోవటంతో ఆ విషయంలో ప్రజలు సగటు రాజకీయ నాయకుడి లెక్కనే రేవంత్ నూ భావిస్తున్నారు.

**సరైన ఎజెండాకి మారాలి**

రేవంత్ ప్రభుత్వం సమయం మించిపోకుండా సరైన

## అప్పుల్లో రికార్డులు

తెలంగాణ బడ్జెట్ లో ఆర్థిక ద్రవ్యలోటు పెరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్ నుండి అక్టోబర్ నాటికే రాష్ట్ర ప్రభుత్వం ఏడాది లక్ష్యంలో 93.58% సేకరించింది. గతేడాది ఇది 71.80% అని 'కాగ్' తాజా గణంకాలు వెల్లడించాయి.

✦ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఖర్చులు పోను రెవెన్యూ మిగులు రూ.2738 కోట్లు ఉంటుందని అంచనా వేసినా, ఏడు నెలలకే రూ.10,113 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడింది.

✦ పాత అప్పులపై వడ్డీ కిస్తీలకు ఈ ఏడాది మొత్తానికి రూ.19,369 కోట్లు కేటాయిస్తే, అక్టోబర్ నాటికే అందులో 85.34% చెల్లించాల్సి వచ్చింది.

✦ ఉద్యోగుల జీతభత్యాలు, రిటైరైనవారికి పెన్షన్ల వ్యయం గణనీయంగా పెరుగుతోంది. ప్రాథమిక ద్రవ్యలోటు ఏడాది మొత్తానికీ రూ.34,640 కోట్లు లెక్కేయగా, అయిదు నెలల ముందే 98.18 శాతానికి (రూ.34,011.34 కోట్లు) చేరింది.

ఎజెండాను గుర్తించి చిత్తశుద్ధితో అమలు చేస్తేనే ముంచుకొస్తున్న సవాళ్లను ఎదుర్కోగలదు.

హైదరాబాద్ డబ్బుని నగర అభివృద్ధికి, ఇక్కడ పెట్టుబడుల్ని, ఉపాధి అవకాశాల్ని ఇంకా పెంచటానికి, ప్రజలు సౌకర్యవంతంగా, జీవన నాణ్యతతో బతికేలా మౌలిక వసతులు, పౌర సేవల్ని అందించే ఏర్పాటుకి ఎక్కువగా వినియోగించాలి. అదేవిధంగా హైదరాబాద్ మీద అతిగా ఆధారపడకుండా గ్రామీణ తెలంగాణ స్వావలంబన అభివృద్ధి సాధించేలా నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు అందించటం, ప్రభుత్వోద్యోగాలు ఎంత భ్రమో యువతకు నచ్చచెప్పి ఆ పిచ్చిని వదిలించటం, ఉపాధి అవకాశాల కోసం చిన్న పట్టణాల అభివృద్ధి, తయారీ రంగాన్ని ప్రోత్సహించటం, సిటిజన్ చార్టర్ల ద్వారా ఆలస్యానికి జరిమానాతో పౌర సేవలు సకాలంలో, నాణ్యతతో అందే ఏర్పాటు, మహిళలపై వేధింపుల దశలోనే నేరాల నియంత్రణకు గ్రామ న్యాయాలయాల చట్టం అమలు ద్వారా స్థానిక కోర్టుల ప్రారంభం, కమ్యూనిటీ పోలీసింగ్, నేర పరిశోధన వరకూ రాజకీయ జోక్యం లేకుండా జవాబుదారీ తనంతో పోలీసులకు స్వయంప్రతిపత్తి, వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతికత, స్వేచ్ఛా మార్కెట్, సహకార సంఘా లతో రైతులు వ్యాపారంలా చేసేందుకు.. వరికి బదులు ఉద్యాన పంటలు వంటి వాటి వైపు మొగ్గు చూపటం, కాంట్రాక్టు వ్యవసాయం మొదలైన చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలో, గ్రామ పంచాయతీల సంఖ్యను ఇప్పుడున్న 12 వేల పైచిలుకు నుండి తగ్గించి 1000-1200గా చేయాలి. ఒక్కో పంచాయతీగా కనీసం 30-40,000 జనాభా ఉండేలా చేయాలి. న్యూయార్క్ తో పోటీ పడతామని చెప్పు కుంటే చాలదు.. ఆ నగర మేయర్‌గా భారతీయ మూలా లున్న జోహ్రాన్ మమ్దానీ ఎన్నికైతే అంత చర్చ ఎందుకు జరిగిందో కాస్త ఆలోచించండి. అలాంటి సాధికారత మన మేయర్లకు, మునిసిపల్ చైర్మన్లకు ఇవ్వండి. హైదరాబాద్ నుండి ప్రారంభించి అన్ని పంచాయతీలకూ జవాబుదారీ తనంతో స్థానిక సాధికారత కల్పించటం, విద్య, ఆరోగ్యం వంటి రోజువారీ కీలక బాధ్యతల్ని ప్రజల భాగస్వామ్యమున్న వార్డు కమిటీలతో ఆ స్థానిక ప్రభుత్వాల పరిధిలోకి తెచ్చి నిధులివ్వటం, క్రమంగా హైదరాబాద్ మీద అతిగా ఆధార పడకుండా గ్రామీణ తెలంగాణ సొంత ఆదాయం సమ కూర్చుకునేలా చేయటం రేవంత్ ప్రభుత్వ ఎజెండా కావాలి. రెండేళ్ల ఉత్సవాలు ప్రజాపాలన పేరుతోనో, మరో నినాదంతోనో ఘనంగా చేసుకోండి. రైజింగ్ తెలంగాణ 2047కి ప్రపంచ సమ్మిట్ నిర్వహించి ఆలోచనలు చాటుకోండి. కానీ అధికారానికి లక్ష్యమేంటో, తెలంగాణకు ఏవి అవసరమో ఆ పనులు ఈవేళ చేయకుండా మొక్కుబడి సమీక్షలు, రసవత్తర డైలాగుల ప్రసంగాలు, ఈవెంట్ మేనేజ్ మెంట్ సదస్సులు వృధా. ఈవేళ సరైన పనులు చేస్తేనే, భవిష్యత్తులో లక్ష్యాలు సాధ్యమవుతాయి. మీరు నిజాయతీగా పనిచేస్తే, మూసీ సుందరీకరణ కోసం ఇళ్లు కూలగొట్టినా పేదలు సహించేవారు. సరైన ఎజెండా, ప్రజలకు ప్రతి విషయాన్నీ పారదర్శకంగా తెలియచేయటం, సకాలంలో ప్రతి ప్రాజెక్టూ తక్కువ ఖర్చుతో నాణ్యంగా పూర్తిచేయటం, ఫలితాల్ని నిర్దిష్టంగా అందించటం చేస్తే సీనియర్లు, జూనియర్లు తేడా లేకుండా, అధికారులు, మంత్రులూ ముఖ్యమంత్రిని అనుసరించకతప్పదు.

హైదరాబాద్ నుండి ప్రారంభించి అన్ని పంచాయతీలకూ జవాబుదారీతనంతో స్థానిక సాధికారత కల్పించటం, విద్య, ఆరోగ్యం వంటి రోజువారీ కీలక బాధ్యతల్ని ప్రజల భాగస్వామ్యమున్న వార్డు కమిటీలతో ఆ స్థానిక ప్రభుత్వాల పరిధిలోకి తెచ్చి నిధులివ్వటం, క్రమంగా హైదరాబాద్ మీద అతిగా ఆధార పడకుండా గ్రామీణ తెలంగాణ సొంత ఆదాయం సమకూర్చుకునేలా చేయటం రేవంత్ ప్రభుత్వ ఎజెండా కావాలి.

తెలంగాణకు ముఖ్యమంత్రి అవ్వటమే జీవితాశయం, కేసీఆర్ అహాన్ని దెబ్బకొట్టటమే గొప్ప విజయం అని రేవంత్ అనుకుంటే.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిలా ఆయనెవరి గురించో చెప్పుకున్నట్లు, తెలంగాణ రెండో ముఖ్యమంత్రి అని ఫుట్ నోట్స్ రాసుకోవటానికి పనికొస్తుందంతే. ఏపీకి, కొన్ని అంశాల్లో చివరికి ఢిల్లీకి కూడా లేని మేధోవనరులు హైదరాబాద్‌కి ఉన్నాయి. ఉపయోగించుకునే విజ్ఞతను, ప్రాప్తకాలజ్ఞతను ప్రదర్శిం చండి. ఇప్పటికీ సమయం మించిపోలేదు. ఇది మధ్యంతర సమీక్షే. అటు గ్రామీణ తెలంగాణలో చిన్న పట్టణాలు, ఇటు హైదరాబాద్ పర్యావరణహిత అభివృద్ధితో తెలంగాణను ఒక మహానగరంలా మార్చగలిగితే మీరు అనుకున్న రైజింగ్ తెలంగాణ 2047, 30 ట్రిలియన్ భారత ఆర్థిక వ్యవస్థలో మన వాటా 10% కచ్చితంగా ఆచరణసాధ్యమవుతుంది. మిగతా రాష్ట్రాలు, వచ్చే తరాలు కూడా మీ పేరు చెప్పుకుంటాయి. మేలుకోండి ముఖ్యమంత్రీ! ❖

# 2025-కొన్ని ప్రజాస్వామిక పరిణామాలు

భారత ప్రజాస్వామ్యాన్ని, మనల్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేసిన ప్రపంచ ప్రజాస్వామ్యాన్ని స్థూలంగా పరిశీలిద్దాం. ఇటీవల ఐడియా (ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమొక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్) అనే సంస్థ 173 ప్రజాస్వామ్య దేశాలపై విడుదల చేసిన నివేదిక ప్రకారం.. వరుసగా గత తొమ్మిదేళ్లుగా దిగజారుతూ వస్తున్న ప్రజాస్వామ్యం 2024-25లో కూడా అదే ధోరణిని కనబరిచింది. ప్రాతినిధ్యం, హక్కులు, చట్టబద్ధపాలన, ప్రజల భాగస్వామ్యం అనే నాలుగు అంశాల ప్రాతిపదికన ఎన్నికల సంఘం, స్వేచ్ఛాయుత ఓటింగ్, న్యాయవ్యవస్థ స్వతంత్రత, ప్రజల హక్కుల వినియోగం మొదలైన విభాగాలను, సంబంధిత వ్యవస్థల తీరును చర్చించారు. మొత్తంగా చూస్తే,173లో కేవలం 25 వరకు దేశాలు మాత్రమే నిజమైన ప్రజాస్వామ్య దేశాలుగా నిలిచాయి. ఇంకో 40-50 వరకు లోపభూయిష్ట ప్రజాస్వామ్యాలుగా ర్యాంకును పొందాయి. మిగిలినవి బూటకపు ఎన్నికలు లేదా నియంతృత్వ, అరాచక దేశాలుగా కొనసాగుతున్నాయి. చాలా దేశాల్లో మీడియా స్వేచ్ఛ దిగజారింది. అణచివేతకు గురికావటమో లేక ప్రభుత్వాలకు లొంగిపోవటమో.. మొత్తంగా ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా మీడియా చాలా దేశాల్లో తన పాత్రను సవ్యంగా నెరవేర్చటం లేదు. 2024లో రికార్డు స్థాయిలో 74 ప్రజాస్వామ్య దేశాలకు ఎన్నికలు జరిగాక వేసిన అంచనాలివి.

ఆసక్తికరమైన విషయమేమంటే, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి ఎన్నికైన దగ్గర్నుంచి ఈ పతనం ప్రజాస్వామ్యంలో కనిపిస్తోంది. పతనం మొదలవటం వల్ల ట్రంప్ వచ్చారా, ట్రంప్ రావటం వల్ల పతనానికి నాంది పడిందా అన్న ఇంగితజ్ఞానపు ప్రశ్నను చర్చిస్తే.. ప్రజాస్వామ్యంలో ఏర్పడిన స్తబ్ధతను ఆసరాగా చేసుకునే ట్రంప్ లాంటి శక్తి తలెత్తింది అనుకోవటానికి ఎక్కువ ఆస్కారం కనిపిస్తుంది. ఇదే సమయంలో ఈ ఏడాది నోబెల్ ఆర్థిక పురస్కారం లభించిన అంశం ప్రాతిపదికన ఆలోచిస్తే.. ఇది ప్రజాస్వామ్యం దిగజారటమా? లేక ప్రజాస్వామ్యంలో సృజనాత్మక విధ్వంసక దశా? అన్న సందేహమూ కలుగుతుంది. సాంకేతికత, సంస్కృతి, సృజనాత్మక విధ్వంసం, ఆర్థికాభివృద్ధి, ప్రజాస్వామిక వ్యవస్థలు మొదలైన అంశాలను నోబెల్ ఆర్థిక పురస్కారం స్పృశించింది. టెక్నాలజీ బదిలీ అయినంత తేలిగ్గా వ్యవస్థలు బదిలీ కావు.. అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఎప్పటి నుంచో చెబుతున్న విషయం కోణంలోనూ ఈ అంశాన్ని పరిశీలించవచ్చు. మొత్తంగా అయితే, సోషల్ మీడియా, ఏ.ఐ సాంకేతికతల ప్రభావం, యుద్ధాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో పెరుగుతున్న వలసలు, వాణిజ్య ఆంక్షలు, ఏకధృవ ప్రపంచం కాస్తా బహుళ ధృవ ప్రపంచంగా మారే క్రమం, సరిగ్గా 80 ఏళ్ల క్రితం ముగిసిన రెండో ప్రపంచ యుద్ధానంతర శాంతిని, ఒప్పందాల్ని, వ్యవస్థల్ని సవాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కుదిపేస్తున్నాయి.


భారతదేశం విషయానికొస్తే, మన దేశంలో ప్రజాస్వామ్యం బలంగానే ఉందిగానీ.. లోపభూయిష్టంగా ఉందని నివేదిక బేరీజు వేసింది. అంతర్జాతీయ సర్టిఫికెట్ల ప్రమాణాల్ని ఆయా విభాగాలవారీగా మనం పూర్తిస్థాయిలో అంగీకరించక పోవచ్చుగానీ, స్థూల మదింపు అయితే మన అంచనాలకూ దగ్గరగానే ఉంది.

రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న మైలురాయితో భారతదేశం తన 2025 ప్రస్థానాన్ని ప్రారంభించింది. కచ్చితంగా ఇదో ఘనవిజయం అనటంలో సందేహం లేదు. మన కంటే ఎక్కువ భాషలున్న దేశాలుండొచ్చు, కానీ ఇన్ని భాషలు, కులాలు, మతాలు, తెగలు, సాంస్కృతిక వైవిధ్యంతో సంక్లిష్ట భిన్నత్వం గల సువిశాల, అధిక జనాభా దేశం ప్రపంచంలో మరొటి లేదు. అయిదువేల సంవత్సరాల అవిచ్ఛిన్న సంస్కృతిని ఆధునిక ప్రజాస్వామ్య దేశంగా కొనసాగించటంలో భారత రాజ్యాంగం అసాధారణ విజయం సాధించింది. ఇది మన జాతీయోద్యమ నేతలకు, రాజ్యాంగ నిర్మాతలకు గొప్ప నివాళి. ఇదే సమయంలో ఈ ఏడాది ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నికల వ్యవస్థపై పెద్దఎత్తున విమర్శల దుమారం చెలరేగింది. రాజ్యాంగం కంటే ముందే రాష్ట్రపతి ప్రత్యేక అధికారాల ద్వారా ఏర్పడిన స్వతంత్ర సంస్థ ఎన్నికల సంఘానికి పార్టీ పక్షపాతాల్ని బాధ్యతాయుత జాతీయ పార్టీలు సహా వివిధ ప్రతిపక్షాలు ఆపాదించాయి. ఎన్నికల నిర్వహణలో సాంకేతికతను వినియోగించటంలో భాగంగా అమలు చేస్తున్న ఈవీఎంలు (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు)పై కూడా ట్యాంపరింగ్ చేస్తున్నారని ఆరోపణలు పునరావృతమయ్యాయి. ఆ తర్వాత ఓటరు జాబితాల్ని అధికార పార్టీకి అనుకూలంగా

మార్చారనే ఆరోపణలు. అయితే వీటిని లోపాలుగా తప్ప రాజకీయ కుట్రలుగా ప్రజల్లో ఎక్కువమంది భావిస్తున్నట్లు కనిపించదు. అందుకు సాక్ష్యాలూ లేవు.

మరోవంక, మత రాజకీయాలను ఎదుర్కోవటానికి కులగణన రాజకీయం తేవటం, పంచాయతీ నుండి పార్లమెంటు వరకూ దేశమంతా ఒకేసారి (జమిలి) ఎన్నికలు జరపాలన్న అంశంపై వివాదం, రిజర్వేషన్లపై 50% పరిమితిని తొలగించాలని జాతీయ ప్రధాన ప్రతిపక్షం డిమాండ్ చేయటం, ఎటువంటి అధికారాలూ, పెద్దగా నిధులూ లేని స్థానిక ప్రభుత్వాల్లో బీసీ రిజర్వేషన్లను 23% నుండి 42 శాతానికి పెంచాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించినా వివిధ కారణాలరీత్యా న్యాయ స్థానాలు తోసిపుచ్చటం, గవర్నర్ వ్యవస్థ వివాదాస్పద మవటం, గవర్నర్, రాష్ట్రపతి సంతకాలు లేకున్నా బిల్లులు ఆమోదించినట్లుగా భావించవచ్చని సాక్షాత్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగాన్ని ఉల్లంఘించే తీర్పునివ్వటం, ఆ తర్వాత రాష్ట్రపతి ప్రశ్నలతో కొన్ని నెలలకు సరిదిద్దుకోవటం, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో లెక్కలు చూపని డబ్బులు కట్టలు బయటపడటం వంటి పరిణామాలు చోటు చేసు కున్నాయి. సామాజిక మాధ్యమాల్లో విపరీత ధోరణులు పెరిగిపోయి నకిలీ వార్తలు, వీడియోలు, విద్వేషపూరిత వ్యాఖ్యలు, సైబర్ మోసాలు ఎక్కువయ్యాయి. కశ్మీర్ పుల్వామాలో పాకిస్థాన్ మద్దతున్న ఉగ్రవాదులు అమాయక పర్యాటకుల మీద దాడి చేయటం, భారత్ స్వదేశీ సాంకేతికతతో ఆ దాడుల్ని తిప్పికొట్టే స్థాయికి ఎదగటం కొన్ని దేశాలకు మింగుడుపడక విదేశాంగ విధానంపై ప్రభావం చూపింది. అమెరికా, భారత్ మైత్రికి ఉన్నట్లుండి గండి పడింది. భారత్ స్వదేశీ నినాదాన్ని పెద్దఎత్తున ప్రచారం చేయటం, స్వావలంబనకు ప్రాధాన్యతనివ్వటం ఈ అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో వచ్చిన గణనీయ మార్పు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్-గాజా యుద్ధం వల్ల లక్షల మంది వలసలుపోగా, అనేకమంది అమాయకులు బలయ్యారు. మధ్యలో ఇరాన్ జోక్యం, ఖతార్ పై ఇజ్రాయిల్ దాడి వంటివి మధ్యప్రాచ్యంలో పాత భయాల్ని తిరగదోడింది. సరైన నేతలు కొరవడి హమాస్ వంటి ఉగ్ర వాద శక్తుల్ని గెలిపించిన గాజా ప్రాంతం దాదాపు శ్మశా నంలా మారింది. అమెరికా జోక్యంతో తాత్కాలికంగా యుద్ధం ఆగినా, నిజమైన శాంతికి ఇంకా జరగాల్సింది చాలా ఉంది.

యుద్ధాల్లో సాంప్రదాయ ధోరణులు మారిపోయి గగనతల డ్రోన్, క్షిపణి దాడులు, సోషల్ మీడియా ఫేక్ వీడియోల ద్వారా భావోద్రేకాలను రెచ్చగొట్టే మైండ్ గేమ్‌తో డిజిటల్ యుద్ధాలు కొత్త వ్యూహాలయ్యాయి. రోజువారీ జీవితంలో




సాంకేతికత వేగం ధాటికి ప్రజల, ముఖ్యంగా భారత్‌లో ఎక్కువసంఖ్యలో ఉన్న యువత ఏకాగ్రత వంటి సామర్థ్యాలు దెబ్బతినటం, కనీసం 20% మందిలో మానసిక ఆందోళనలు పెరగటం వంటివి చోటుచేసుకుంటున్నాయని ఈ ఏడాది వైద్య నిపుణులు, శాస్త్రవేత్తలేకాదు.. రాజకీయ విధాన నిర్ణేతలు కూడా గుర్తించారు. ఉపాధి రంగంలో నాణ్యతలేని, నిరంతరం నేర్చుకునే తత్వం కొరవడినవారు ఏ.ఐ లాంటి సాంకేతికతలకు బాధితులవుతున్నారు.

గతంలో కొవిడ్ మహమ్మారికి ఆపాదించిన ఈ లక్షణాలను ఇప్పుడు సోషల్ మీడియా, పెరుగుతున్న మొబైల్ విని యోగాలకు ఆపాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో విడుదలైన బ్రిటిష్ చిత్రం 'అడాలసెన్స్' ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మానసిక ఆందోళనలు అన్ని రంగాల్లో చర్చించాల్సిన సమస్యగా గుర్తించటం ప్రారంభమైంది.

అదేవిధంగా, భారత్‌లో వ్యవసాయరంగం స్వయం సమృ ద్ధిని సాధించినా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవ సాయం ముసలివారు, మహిళల రంగంగా యువత భావిం చటం కొత్త సామాజిక సంక్షోభానికి దారితీస్తోంది. రైతులకు కాస్త ఆదాయం మెరుగుపరిచేలా వ్యవసాయంలో స్వేచ్ఛా మార్కెట్ సంస్కరణలు తెచ్చేందుకు యూనియన్ ప్రభుత్వం 2020లో తెచ్చిన వ్యవసాయ చట్టాలను ప్రతిపక్షాలు రాజకీయ స్వార్థంతో అడ్డుకోవటం చివరికి అమెరికాతో వాణిజ్య వివాదంగా పరిణమించింది. ఆ దేశం నుండి చౌక వ్యవసాయోత్పత్తులు దిగుమతి కాకుండా మన రైతుల్ని కాపాడటం వల్ల అమెరికా మన మీద సుంకాల్ని వివిధ వంకలతో 50% దాకా విధించింది. లాబీయింగ్ తర్వాత కాలక్రమంలో కొంత సర్దుబాటు జరిగింది.

పట్టణీకరణ అంటే మహానగరాలకు వలసలు అనే ధోరణి జీవితాల్ని ఇంకా దుర్భరం చేస్తోంది. ఈ నేపథ్యంలో అప్పులు చేసి మరీ తాత్కాలిక తాయిలాల్ని పంచటం,

ప్రభుత్వోద్యోగాల ఆశ చూపి యువతను మాయబుచ్చటం అధికార రాజకీయ క్రీడలో భాగంగా మారింది. 2025లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తాత్కాలిక తాయిలాలు పరాకాష్టకు చేరుకున్నాయి. బీహార్ లో పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ సహా అసలు చర్చించటానికే సాధ్యంకాని రీతిలో ఇంటికో ప్రభుత్వోద్యోగం వంటి ఎన్నికల హామీలని ఆర్జేడీ, కాంగ్రెస్ తదితర పార్టీల మహాగర్ బంధన్ ఇచ్చింది. యూనియన్ ప్రభుత్వ స్థాయిలో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ సంక్షేమం–అభివృద్ధి మధ్య సమతూకం పాటిస్తున్న ప్రధానమంత్రి కూడా రాష్ట్రాల ఎన్నికల సమయంలో తన పార్టీ మితిమీరిన తాత్కాలిక తాయిలాల హామీల్ని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. రాజకీయ పార్టీలు చట్టసభల్లో తమ సభ్యులకు ఒక పరిధిదాటి విప్ జారీ చేయకూడదని వాదించటంతోపాటు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖఢ్ మధ్యంతర రాజీనామా ఒక అసాధారణ పరిణామంగా కనిపిస్తుంది.

ఇక సమ్మిళిత అభివృద్ధి లేకుంటే ఓట్లు పడవని అర్థం కావటంతో.. అన్ని స్థాయిల్లో విద్య, ఆరోగ్యం వంటి సేవల గురించి మాట్లాడుతున్నా సరైన విధానాల్ని రూపొందించటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఏఐ సాంకేతికత సర్వరోగ నివారిణి అన్నట్లు భ్రమపడుతున్నాయి. ఈ ఏడాది విడుదలైన అసర్–2024 సర్వే, పీజీఐ 2.0, పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్, జాతీయ శాంపిల్ వంటి సర్వేలన్నీ విద్యారంగ ఘోర దుస్థితిని, అభ్యసన సామర్థ్యాల అధ్వాన్నతను కళ్లకు కట్టాయి. తరగతి గదుల్లో సమాధానాలు చెప్పగలుగుతున్నవారిలో కూడా ఎక్కువమంది మార్కెట్ లెక్కల్లో విఫలమవుతున్నారని నోబెల్ విజేత అభిజిత్ బెనర్జీ వంటి వారి నమూనా సర్వేల్లో తేలింది. పాఠశాల విద్య, ఆరోగ్య రంగంపై మల్లగుల్లాలు పడటం, అదే సమయంలో ప్రచారానికి తప్ప నిజమైన ఫలితాలకు ప్రాధాన్యత నివ్వక పోవటం ఈ ఏడాది ఓ పరిణామంగా కనిపిస్తుంది. నాణ్యమైన విద్య లేకుంటే సమ్మిళిత అభివృద్ధి అసాధ్యం. అందుబాటులో ఆరోగ్యం లేకుంటే, ఉత్పాదకత పెరగటం అసంభవం. ఒక రంగంలో అభివృద్ధి మరో రంగంలో సమస్య కాకుండా చాలా ముందుచూపుతో, అవగాహనతో విధానాల రూపకల్పన ఉండటం అరుదుగా జరుగుతోంది. అంతెందుకు, మన పొరుగున ఉన్న ఆఫ్ఘనిస్థాన్ ను ప్రపంచంలోనే అధ్వాన్న దేశంగా భావిస్తాం. ఆ దేశంలోని తాలిబాన్లు అమ్మాయిలకు చదువు అందకుండా చేయటం పట్ల అన్నిచోట్లా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కానీ తాలిబాన్ అగ్రనాయకులు, అధికారులు తమ కూతుళ్లకు మాత్రం విదేశాల్లో చదువులు చెప్పిస్తున్నారట. విద్య, ఆరోగ్యంపై చర్చ కొంత మెరుగైనా ఇంకా

**ఈ ఏడాది విడుదలైన అసర్–2024 సర్వే, పీజీఐ 2.0, పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్, జాతీయ శాంపిల్ వంటి సర్వేలన్నీ విద్యారంగ ఘోర దుస్థితిని, అభ్యసన సామర్థ్యాల అధ్వాన్నతను కళ్లకు కట్టాయి. తరగతి గదుల్లో సమా ధానాలు చెప్పగలు గుతున్నవారిలో కూడా ఎక్కువమంది మార్కెట్ లెక్కల్లో విఫలమవుతున్నారని నోబెల్ విజేత అభిజిత్ బెనర్జీ వంటి వారి నమూనా సర్వేల్లో తేలింది. పాఠశాల విద్య, ఆరోగ్య రంగంపై మల్లగుల్లాలు పడటం, అదే సమయంలో ప్రచారానికి తప్ప నిజమైన ఫలితాలకు ప్రాధాన్యత నివ్వక పోవటం ఈ ఏడాది ఓ పరిణామంగా కనిపిస్తుంది.**

సరైన స్థాయిలో, దిశలో జరగటం లేదన్నది ఈ ఏడాది మనం గుర్తించాల్సిన మరో కీలకాంశం.

అదేవిధంగా, ప్రభుత్వం అందించే సేవల్లో వైఫల్యానికి ప్రభుత్వోద్యోగులతోపాటు స్థానిక ప్రభుత్వాల వైఫల్యం కూడా కారణమని ఈ ఏడాది కొంత అవగాహన కలుగుతుంది. మంచినీరు, పక్కా ఇళ్లు మొదలైన వసతులకు ప్రభుత్వాలు ఎంతో డబ్బు వెచ్చిస్తున్నా- చేతల్లో ఆశించిన ఫలితాలు రావటం లేదు. విపరీత కేంద్రీకృత వ్యవస్థ వల్ల స్థానిక ప్రభుత్వాలు ఉత్సవ విగ్రహాలు కావటం ఎన్నికల ఫలితాల్ని కూడా తారుమారు చేస్తోందని, వాటికి ప్రత్యామ్నాయంగా ప్రవేశపెడుతున్న గ్రామ సచివాలయాలు, జన్మభూమి వంటి వ్యవస్థలు క్రమంగా ప్రతికూల ఫలితాలనిస్తున్నాయని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియచేస్తున్నాయి.

లోక్‌సత్తా జేపీ లాంటి వారి జీవిత గమనాన్నే మార్చిన అంతర్గత ఎమర్జెన్సీ భారత్‌లో ఈ ఏడాది 50 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఆ సమయంలో ప్రధాని ఇందిర ప్రవేశపెట్టిన 42వ రాజ్యాంగ సవరణలోని సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగించటం మరోమారు చర్చనీయాంశమైంది. ఈ ఏడాదే ప్రజాస్వామికంగా, ఆర్థికంగా బలంగా ఉన్న దక్షిణ కొరియాలో కేవలం కొన్ని గంటలు ఎమర్జెన్సీ విధించినందుకు ఆ దేశాధ్యక్షుడ్ని జైలుకి పంపటం ఓ విశేషం.

రాష్ట్రాలు దుబారా చేస్తున్నా, మితిమీరిన తాత్కాలిక తాయిలాల్ని ప్రకటిస్తున్నా.. యూనియన్ ప్రభుత్వం అసాధారణ సంకల్పంతో ఆర్థిక క్రమశిక్షణను పాటించటం, మౌలిక వసతులకు రూ.11 లక్షల కోట్లకు పైగా వెచ్చించటం ఈ సంవత్సరం ప్రముఖంగా ప్రస్తావించాల్సిన విషయం. ప్రజాస్వామ్యానికి ఊపిరిలాంటి ఆర్థిక వ్యవస్థలో కీలకమైన బ్యాంకింగ్ రంగాన్ని మోదీ ప్రభుత్వం ప్రక్షాళన గావించి రూ.లక్ష కోట్ల లాభాల్లోకి తెచ్చింది. అదేవిధంగా, ద్రవ్యోల్బణాన్ని కనిష్టస్థాయిలో కొనసాగించగలుగుతోంది. ఎన్.డి.టి.వి కాంక్లేవ్ లో మాట్లాడుతూ ప్రధాని వృద్ధి రేటు

7.8% దాకా ఉందని చెబుతున్నా.. 6-7 శాతం మధ్యే కొనసాగుతున్నట్లు ఎక్కువ రేటింగ్ ఏజెన్సీలు భావిస్తున్నాయి. అయితే ఈ వృద్ధికి తగ్గ ఉపాధి అవకాశాలు పెరగకపోవటం పెద్ద సమస్యగా కొనసాగుతోంది. ముఖ్యంగా తయారీ రంగాన్ని ప్రోత్సహించకుండా, గ్రామాల మధ్య చిన్న పట్టణాల ద్వారా అందుకుకావలసిన సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తుండటం వల్ల అభివృద్ధిలో వినూత్నత, సంపద సృష్టి విస్తరణ దేశ సామర్థ్యానికనుగుణంగా జరగటం లేదు.

ఎన్నికల్లో ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్లే, తక్కువ వస్తే ఎన్ని ఓట్లు వచ్చినా వృధా అనే మన దేశంలో లాంటి ఎఫ్.పి.టి.పి ఎన్నికల వ్యవస్థ ఉన్న దేశాల్లో కంటే ప్రతి ఓటుకూ విలువనిచ్చే దామాషా ఎన్నికల పద్ధతి ఉన్న దేశాలు ప్రజాస్వామ్యంలో అగ్రస్థానంలో ఉన్నాయని నివేదికలు చెబుతున్నా, ఓట్ల కొనుగోలు డబ్బు కోసం లెక్కలు చూపని వ్యయం ప్రపంచ రికార్డులు సృష్టిస్తున్నా, మన నేతలు ఆ భయంకర లోపాల్ని సరిచేసే ఎన్నికల సంస్కరణల కోసం, దామాషా ఎన్నికల పద్ధతి కోసం పోరాడకుండా..సాంకేతిక లోపాలపై ఈసీ మీద దాడి చేసే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. ఇస్రో అసాధారణ విజయాలను సొంతం చేసుకుంది.

**తెలుగు రాష్ట్రాలు**

ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక తాయిలాల్లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. 2014లో రాష్ట్రం విడిపోయినప్పుడు మిగులు ఆదాయంగల సంపన్న రాష్ట్రం తెలంగాణ అసంబద్ధ హామీల అమలుకు అప్పుల్లో కూరుకుపోగా, ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో హెచ్చులకు పోయి ఇచ్చిన తాత్కాలిక తాయిలాల హామీల్ని నెరవేర్చటానికి మరింత సంక్షోభంలో కూరుకుపోయింది. ఇదే సమయంలో పెట్టుబడులను ఆకర్షించటానికి రెండు రాష్ట్రాలూ పోటాపోటీగా ప్రయత్నించటం కొంత ఆశావహ పరిణామం. అయితే ఇందుకు కావలసిన విద్యుత్, నీరు వంటి మౌలిక వనరులను సమకూర్చటం, అది కూడా పర్యావరణహితంగా అందించటం పెద్ద సవాలని నిపుణులు అంటున్నారు. ప్రయివేటు పెట్టుబడుల్లో నాణ్యత కనిపిస్తుండగా, ప్రభుత్వ మూలధన వ్యయాల్లో ఎన్నికల ఖర్చుకు కమీషన్ల ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. అయితే కొందరైనా విజ్ఞతతో స్పందించి మందలించటం వల్ల బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం కొంత వెనక్కితగ్గింది. ఇదే సమయంలో కులగణనను గొప్ప సామాజిక న్యాయ సైద్ధాంతికాంశంగా ప్రచారం చేస్తూ, మూసీని రూ.1 లక్ష కోట్లకు పైగా నిధులతో అందాలరాశిగా మారుస్తానని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం కూడా విమర్శలకు సమాధానం చెప్పలేక ప్రస్తుతానికి ఆగింది. ఏడీబీ ఆర్థిక సహకారంతో మురుగునీటి వ్యవస్థను బాగుచేసే కార్యక్రమానికి పరిమితమైంది. మెట్రోకు రూ.300 కోట్లు సహాయం చేయటానికి బదులు మొత్తం ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి కొనుగోలు చేయటం, రూ.50,000 కోట్లతో విస్తరణ ప్రణాళికలు ప్రకటించటం, కాళేశ్వరం మరమ్మతుల విషయంలోనూ ఎల్ అండ్ టీ, బీఆర్ఎస్ తో ప్రభుత్వం రాజీపడుతోందన్న అభిప్రాయం కలగటం విమర్శలకు తావిస్తోంది. మొత్తమ్మీద ఎన్నికల వ్యయం, తాత్కాలిక తాయిలాల ఖర్చుపై తెలుగు రాష్ట్రాల నుండి మొదలుపెట్టి దేశవ్యాప్తంగా కొన్ని సంస్కరణలు, నిబంధనలు అవసరమని, లేకుంటే అది ఆర్థికాభివృద్ధి స్థాయిని దెబ్బతీసే ప్రమాదముందని 2025 హెచ్చరిస్తుంది.

2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించటం, దేశంలో సహకార రంగం వాటాను జీడీపీలో 3% నుండి 10% కి ఉపాధితో నైష్పత్తికంగా పెంచాలని ప్రభుత్వం నూతన సహకార విధానాన్ని 'సహకార్ సే సమృద్ధి' నినాదంతో రూపొందించటం మరో విశేషం.

మొత్తంగా ఎన్ని సవాళ్లు ఎదురైనా, భారత్ నిర్జీవ ఆర్థిక వ్యవస్థ అని ట్రంప్ శాపనార్థాలు పెట్టినా.. మన దేశానికి ఇప్పటివరకూ ఉన్న అభివృద్ధి అవకాశాలైతే చెక్కుచెదరలేదు. రాజకీయ సంకల్పం ఉండి, ప్రజలకు విషయం అర్థమైతే.. ఆ సవాళ్లన్నీ ప్రచ్ఛన్న అవకాశాలుగా మారతాయి. ట్రంప్ 2.0 ఎజెండా ఏదైనా, ఆయన భారత్‌కి స్వావలంబన విలువ తెలియచేశారు. పాడిందే పాట అయినా.. ఆత్మనిర్భర భారత్ లేకుండా ఏ విదేశమూ మన కోసం నిలబడదని రుజువైంది. ఈ రకంగా పలు మౌలిక విధానపరమైన అంశాలు సాంప్రదాయ రాజకీయంలో కూడా పెద్దఎత్తున చర్చకు రావటం, తెలుగులో సహా మీడియా కూడా అందుకు కొంత చొరవ చూపటం ఈ ఏడాది విశేషం. అయితే రాజకీయ పక్షపాతాలు, స్పష్టత కొరవడటం పెద్ద లోపాలు. 'సమన్యాయం' అనే ప్రజాస్వామిక సూత్రం ఆధారంగా విధానాల రూపకల్పన, అమలు జరిగేలా చర్యలు తీసుకుంటే, ప్రజలు కూడా కులమతాలకతీతంగా ధర్మనిరతిని ప్రదర్శిస్తూ సహకరిస్తారని 2025 మరోమారు రుజువు చేసింది.సరైన నిర్ణయాలు, విధానాలు, సమర్థ అమలు, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు భారతదేశం తనకొచ్చిన అరుదైన అవకాశాన్ని సద్వినియోగం గావించుకోవటానికి, 21వ శతాబ్దం 2.0లో బలమైన భవిష్యత్ భారతంగా ఎదగటానికి దోహదం చేస్తాయని సందేశమిచ్చింది. ❖







'ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇన్ క్లూజివ్ గవర్నెన్స్ హైదరాబాద్' (ఐఐజీహెచ్) ఆధ్వర్యంలో 'ప్రతి బిడ్డకూ అందుబాటు, సమానావకాశాలు, సమ్మిళితత్వం, నాణ్యతా ప్రమాణాలతో చదువును అందించే దిశగా తెలంగాణ విద్యావిధానాన్ని సంస్కరించటం' అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐఐజీహెచ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మురళీ మనోహర్ పుట్టి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.





హైదరాబాద్‌లో నిర్వహించిన వికాస్ భారత్ యంగ్ ప్రొఫెషనల్స్ రౌండ్ టేబుల్స్ డైలాగ్ కార్యక్రమంలో భూ సార పరిరక్షణ, నిర్వహణపై ప్రసంగిస్తున్న ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th December 2025 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001







*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**